RNI.No. APTEL/2014/57702 | ESTD: 1999 | www.voodayam.com | Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 04-02-2026 బుధవారం | సంపుటి : 12 | సంచిక : 341 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

## చంద్రబాబు పాలనకు జగన్ పాలనకు పొంతన లేదు

- గతంలో టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారు
- క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు
- హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

5



## పెద్దపులి సంచారంపై ప్రజలకు ఆందోళన అక్కర్లేదు

- మంత్రి కందుల దుర్గేష్
- రాజానగరం సమీపంలో సంచరిస్తున్న పులిని పట్టుకునేందుకు అటవీశాఖ ముమ్మరంగా గాలింపు

5





## వారంతా నేరస్థులే.. కల్తీ నెయ్యిపై మంత్రి పయ్యావుల

**అమరావతి :**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిట్ ఇచ్చిన నివేదికలో నివ్వెరపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నెయ్యిలో కెమికల్స్, ఇతర ఫ్లేవర్స్ కలిపారన్నారు. వైసీపీ నేతలు కల్తీని సహజం అంటున్నారని మండిపడ్డారు. తెలిసి కూడా వారు మౌనంగా ఎందుకు ఉన్నారనేది తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్డీయే పక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు... జంతు కొవ్వు అవశేషాలు ఉన్నాయని చెప్పడంతో ఈ అంశంపై చర్చ జరిగినట్టు తెలిపారు. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న ఎన్డీటీబీ రిపోర్టు ఆధారంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారన్నారు.

నెయ్యి పరీక్షల్లో 'ఎస్ వాల్యూ'లో తేడా ఉందని, అంటే.. సస్పెక్టెడ్ అడల్టరేషన్ జరిగే అవకాశం ఉందన్నారు. సోయాబీన్, కోకోనట్, పామ్ ఆయిల్, ఫిష్ ఆయిల్, లార్డ్ వంటి అవశేషాలు ఉండే అవకాశం ఉందని నివేదికలో వెల్లడైందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రెండు పోస్టింగుల్లో టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా శ్యామల రావును నియమించారని తెలిపారు. దీంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. 2022 ఆగస్టు 3న బీటా సిటోస్టెరాల్ ఉన్నట్టు రిపోర్టు వచ్చినప్పటికీ, దాన్ని కొనసాగిస్తూ తప్పును కప్పిపుచ్చారని మంత్రి ఆరోపించారు.

పూర్తిగా టెండర్ నిబంధనలు ఉల్లంఘించారని విమర్శించారు మంత్రి పయ్యావుల. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లు కేటాయించారని ధ్వజమెత్తారు. ఇందులో భాగస్వాములైన అందరినీ నేరస్థులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారికి జరిగిన అపచారంలో సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి సహా పలువురు అధికారులు ఉన్నారన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిట్ చెప్పిందన్నారు. బాలాజీ, ధర్మారెడ్డి, సింఘాల్‌పై చర్యలకు సిట్ సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేశారని సిట్ పేర్కొందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుపై దుర్భాషలు..

### మాజీ మంత్రి కాకాణికి నోటీసులు..

**నెల్లూరు:**



మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసానికి పోలీసులు వెళ్లారు. ఆయనకు అధికారులు నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో పరుష పదజాలంతో దుర్భాషలాడిన ఆరోపణలపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో నెల్లూరు రూరల్, పొదలకూరు, మనుబోలు పోలీస్ స్టేషన్లలో కాకాణిపై కేసులు నమోదయ్యాయి. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి తల్లిదండ్రులపైనా కాకాణి దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం కాకాణి నివాసానికి వెళ్లి, ఆయనతో మాట్లాడిన అనంతరం నోటీసులు అందజేశారు. ఈ కేసుల్లో విచారణకు సహకరించాలని, అవసరమైన వివరాలు అందించాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో నెల్లూరు జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కింది.

**నోటీసులపై కాకాణి..**

పోలీసులు నోటీసులు ఇచ్చారని.. ఈరోజు(మంగళవారం) సాయంత్రమే విచారణకు రావాలని చెప్పారని మాజీ మంత్రి కాకాణి తెలిపారు. తాను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు గాను విచారణకు పిలిచినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఏ అంశంలో తాను ఆరోపణలు చేశానో స్పష్టంగా చెప్పాలని పోలీసులను అడిగినట్లు తెలిపారు. ఏ అంశంలో విచారణకి రమ్మంటున్నారో చెబితే, వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకువెళతానన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ అంశం ఉందనేది స్పష్టత లేదన్నారు మాజీ మంత్రి. కేసుకు సంబంధించిన వివరాలు ఇస్తే, విచారణకు హాజరవుతానని కాకాణి గోవర్ధన్ స్పష్టం చేశారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత్‌కు 'గేమ్ ఛేంజర్: టీడీపీ ఎంపీ

**న్యూఢిల్లీ :**



అమెరికా పన్నుల తగ్గింపు దేశ ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర్' అని టీడీపీ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మరో చరిత్రాత్మక ఆర్థిక విజయాన్ని సాధించిందని అన్నారు. భారత్ – అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వానికి మరో నిదర్శనంగా నిలిచిందన్నారు. ఆసియా దేశాల్లోనే భారత్‌కు అత్యల్ప పన్ను శాతం వర్తించడం విశేషమన్నారు. దీని వల్ల 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఎంపీ వివరించారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా తీరప్రాంతాలకు భారీ లాభాలు చేకూరుస్తుందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. కాకినాడ నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా, సముద్ర ఆహార ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు మరింత సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీని ద్వారా వేలాది మంది మత్స్యకారులు, రొయ్యల రైతులు, ఎగుమతిదారులకు ఆర్థిక భద్రతతో పాటు కొత్త ఆశలు కలుగుతాయని అన్నారు. ఈ ట్రేడ్ డీల్ భారత్ – అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా తీర్చిదిద్దే కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి దేశహితమైన నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి టీడీపీ ఎంపీ సానా సతీష్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ఏపీఎస్ఆర్టీసీ బస్సులోనే ఎక్స్ మిల్ట్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ మృతి

**జమ్మలమడుగు, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** సోమవారం రాత్రి ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు లాస్ట్ సర్వీస్ లో ప్రయాణించిన ప్రయాణికుడు ఎక్స్ మిల్ట్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ మృతి చెందారు. మృతుడు మద్యం సేవించి ప్రయాణం చేసినట్లుగా సమాచారం.. బస్సు పార్కింగ్ చేసిన తర్వాత దిగి పొమ్మని చెప్పిన డ్రైవర్ రామాంజుల రెడ్డి. మృతుడు కాసేపు ఆగి పోతాను అని చెప్పడంతో డ్రైవర్ వెళ్లి పోయారు. అద్దె బస్సు క్లీనర్ చెనిక్కాయల భాష ఉదయం వచ్చి బస్సులోనే మృతి చెందిన మృతుడిని అమానుషంగా ఈడ్చుకుంటూ... బస్సు బయటకు లాగి పడేసినట్లు సమాచారం. పోలీసులకు సమాచారం తెలుపకుండా అద్దె బస్సు ఓనర్ అద్దె బస్సును సర్వీసు కు పంపారు. ఆర్టీసీ బస్ స్టాండ్ లో వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు తెలుపడంతో అక్కడికి అర్బన్ పోలీసులు చేరుకున్నారు. అర్బన్ సీఐ నరేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం..

# సిట్ నివేదికలో షాకింగ్ విషయాలు

*తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ అంశంలో సుప్రీంకోర్టు నియమించిన సిట్ నివేదిక ఇచ్చింది. 11 పేజీలతో కూడిన ఈ నివేదికను ఏపీ ప్రభుత్వానికి అందజేసింది. దర్యాప్తులో తేలిన అంశాలను వివరిస్తూ బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తూ లేఖ రాసింది.*



**అమరావతి:**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏపీ ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించింది. 2019–2024 మధ్య కాలంలో జరిగిన ఘోర తప్పిదాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఉద్దేశ్యపూర్వక మోసాలను వివరిస్తూ 11 పేజీల లేఖలో సిట్ తన దర్యాప్తు అంశాలను పేర్కొంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

**సిట్ నివేదిక.. కీలక అంశాలు..**

టెండర్ నిబంధనల మార్పు: 2020లో ఎటువంటి అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండర్ కండిషన్లు మార్చారు. దీంతో అర్హత లేని కంపెనీలకు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. 2020–2023 మధ్య ఈ అర్హత లేని కంపెనీలే కల్తీ నెయ్యి సరఫరా చేశాయి.

**నిబంధనల రిలాక్సేషన్:** నెయ్యి సరఫరా సంస్థలకు కనీసం రూ.250కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనను రూ.150 కోట్లకు తగ్గించారు. డైరీ రంగంలో 3 ఏళ్ల అనుభవం ఉండాలన్న నియమాన్ని ఏడాదికి కుదించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధనను పూర్తిగా తొలగించారు. అలాగే, 12 టన్నుల వెన్న తీయాల్సిన నిబంధనను 8 టన్నులకు తగ్గించారు.

**టీటీడీ పర్చేజ్ కమిటీ పాత్ర:** పర్చేజ్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా చెవిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి పాత్రను సిట్ నిర్దిష్టంగా ప్రస్తావించింది. టెండర్ కండిషన్లు మొదలుకుని నెయ్యి సరఫరా వరకు ప్రతి అంశంలో ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది.

**అధికారుల బాధ్యత:** మొత్తం ప్రక్రియ తప్పుదారి పట్టడంలో ఎఫ్ఏ&సీఏఓ బాలాజీ, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బాధ్యులని సిట్ పేర్కొంది. అర్హత లేని డైరీల నుంచి కల్తీ నెయ్యి కొనుగోలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని నివేదికలో తెలిపారు.

**సీఎఫ్టీఆర్ఐ పరీక్షలు:** కల్తీ నెయ్యిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో 2022 మే 25న సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్టీఆర్ఐ)కు శాంపిల్స్ పంపారు. పరీక్షల్లో వైష్ణవి డైరీ, బోలేబాబా డైరీల నుంచి వచ్చిన నెయ్యి కల్తీ అయినట్టు నిర్ధారణ అయింది. అయితే, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి సహా అధికారులు ఈ నివేదికను పరిగణలోకి తీసుకోలేదు.

**వరుస మోసాలు:** వరుస తప్పిదాలు, మోసాలతో కల్తీ నెయ్యి సరఫరాకు అనేక దశల్లో టీటీడీ పెద్దలు సహకరించారని సిట్ తన దర్యాప్తులో తేల్చింది.

## తిరుమల పవిత్రతను కాపాడి తీరుతాం..

### ఎన్డీయే నేతలతో సీఎం చంద్రబాబు

**అమరావతి:**

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

**ప్రభుత్వానికి జనసేన పూర్తి మద్దతు**

శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

**ఐక్యంగా వైసీపీ కుట్రలను తిప్పికొడదాం: సత్యకుమార్ యాదవ్**

బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశంలో నాదెండ్ల మనోహర్(పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి), నారా లోకేష్(మానవ వనరుల అభివృద్ధి, పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి), పయ్యావుల కేశవ్(ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి), సత్యకుమార్ యాదవ్(ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి) పాల్గొని తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు.అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది.



## విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్..

### మోహన్ బాబు కాలేజీ బౌన్సర్లు అరెస్ట్

**తిరుపతి :**




ప్రముఖ నటుడు మంచు మోహన్ బాబు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించేందుకు బయల్దేరిన విద్యార్థి సంఘం నాయకులు కిడ్నాప్‌నకు గురయ్యారు. దీంతో సహచర విద్యార్థి సంఘం నాయకులు వెంటనే తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు దృష్టికి వెళ్లడంతో.. ఏఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు వెంటనే రంగంలోకి దిగి.. నారావారిపల్లి సమీపంలోని భీమవరం వద్ద కిడ్నాపర్ల వాహనాన్ని అడ్డుకున్నాయి. కిడ్నాప్‌నకు గురైన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు విడిపించి.. తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.అలాగే కిడ్నాపర్లను అరెస్ట్ చేశారు తిరుచానూరు పోలీసులు. వారి వాహనాలను స్వాధీనం చేసుకుని.. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కిడ్నాప్‌నకు పాల్పడిన వారంతా మోహన్ బాబు కాలేజీ బౌన్సర్లుగా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ చేసిన వారితోపాటు చేయించిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. కిడ్నాప్‌నకు గురైన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్‌తోపాటు నవీన్ ఉన్నారు.




## ఆస్తి తగాదాలతో తల్లీకొడుకుల దారుణ హత్య

### అనంతపురంలో ఘోరం..

**అనంతపురం :**




అనంతపురం జిల్లాలోని శింగనమల మండలం తరిమెల గ్రామంలో దారుణ ఘటన జరిగింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యారు. తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నల్లప్ప మరణించిన తర్వాత ఆయనకు సంబంధించిన ఆస్తి పంపకాల విషయంలో మొదటి భార్య పిల్లలకు, రెండవ భార్యకు మధ్య గత కొంతకాలంగా తీవ్ర వివాదాలు నడుస్తున్నాయి. ఈ వివాదాలే ఇప్పుడు హత్య వరకు దారితీశాయి. నల్లప్ప రెండవ భార్య యల్లమ్మ(38) స్థానిక అంగన్‌వాడీ కేంద్రంగా టీచర్‌గా పనిచేస్తున్నారు. యల్లమ్మ సహా ఆమె కుమారుడు చిన్నా(22)ను దారుణంగా చంపేశారు. మొదటి భార్య కుమారులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక సమాచారం. భూమి లేదా ఇతర ఆస్తుల పంపిణీలో తలెత్తిన ఘర్షణలే ఈ జంట హత్యలకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు.

**పోలీసుల విచారణ..**

పోలీసుల విచారణ ప్రకారం.. హత్య సమాచారం అందిన వెంటనే పోలీసులు తరిమెల గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కుటుంబ కలహాలు ప్రాణాలు తీసే స్థాయికి వెళ్లడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి కోసం కన్నవారనే కనికరం లేకుండా ప్రాణాలు తీయడం సమాజంలోని నైతిక విలువల పతనాన్ని సూచిస్తోంది. ఆస్తి తగాదాల నేపథ్యంలోనే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమికంగా తేలిందని వెల్లడించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని జిల్లా పోలీసులు తెలిపారు.

# ప్రజా దర్బార్ ద్వారా కీలక సమస్యలకు పరిష్కారం

## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ ఫిబ్రవరి03 (వుదయం ప్రతినిధి):** ప్రజా దర్బార్ ద్వారా కీలక సమస్యలకు పరిష్కారం చూపినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళ వారం అవనిగడ్డలోని రెవిన్యూ హాలులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, ప్రజల నుంచి 29 అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి, ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రజా దర్బార్ దృష్టికి 344అర్జీలు రాగా, వాటిలో 210 పరిష్కారం చేశామన్నారు. 125 అర్జీలు పరిష్కార దిశగా ఉన్నాయని, తొమ్మిది అర్జీలు రీ-ఓపెన్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజా దర్బార్ ద్వారా మోపిదేవి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 14 మంది కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించినట్లు తెలిపారు. నరసింహాపురంలో 100కేవీ ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు జరిగిందన్నారు. పాదాలవారిపాలెంలో రెండు ట్రాన్స్ఫర్మర్ల రిపేర్ కారణంగా నెలకొన్న లో-ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపించినట్లు తెలిపారు. నరసింహపురం రోడ్డులో శుక్రవారం సంత జరిగే సమయంలో ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం చూపామన్నారు. నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెంలో గ్రామ ప్రజలకు పంచాయతీ ద్వారా సురక్షిత త్రాగునీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన 24 గంటల విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇలా కీలక సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం ఉత్తమ వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మరియాదేవి, డీఈఈలు, ఏఈఈలు, మండల అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యాన్ని అసత్యంగా మార్చి చూపాలన్నదే కూటమి నేతల ఉద్దేశ్యం

## కావలిలో వైసీపీ నేతలు ఫిర్యాదు



**కావలి, ఫిబ్రవరి 03, వుదయం న్యూస్:** సత్యాన్ని, అసత్యంగా ప్రచారం చేయాలన్నది కూటమినేతల దురుద్దేశం అని కావలి వైసిపి నేతలు పేర్కొన్నారు. మంగళవారం కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాలతో వైసీపీ నేతలు కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కూటమినేతల అఘాయిత్యాలను ఎండగడుతూ పోలీస్ లకు ఫిర్యాదు చేశారు. అసత్య ప్రచారాలు చేస్తున్న కూటమి నేతలపై చర్యలు తీసుకోండి అని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసం పై దాడికి పాల్పడడం మహిళలు ఇంట్లో ఉన్నది చూసి వారి పట్ల కనికరం చూపకపోవడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా కావలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లోని సీఐ ఫిరోజ్ ఖాన్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ వైసీపీ కన్వీనర్ కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కనుమరులపూడి వెంకటనారాయణ, రాష్ట్ర నాయకులు దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్న ఆంజనేయులు, కామరాజు సురేష్ కనపర్తి రాజశేఖర్, షాహుల్ హమీద్, కుందుర్తి శ్రీనివాసులు, కామయ్య, తదితర వైసీపీ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నివేదికలో నిజాలు దిగ్భ్రాంతిని కలిగించాయి

## అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ ఫిబ్రవరి03(వుదయం ప్రతినిధి):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ద్వారా తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో బయటపడిన నిజాలు దిగ్భ్రాంతి కలిగించాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే లడ్డు కల్తీ వ్యవహారంలో నివేదిక వస్తే చర్యలు తీసుకోకపోగా, ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు వైకాపా నాయకులు సిగ్గు వదిలి ప్రజలను మభ్య పెట్టే విధంగా మాట్లాడుతూ, వీధి పోరాటాలకు దిగటం విడ్డూరంగా ఉందన్నారు. తిరుమల తిరుపతి పవిత్రత కాపాడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రయత్నం చేస్తుంటే వారిపైనే అసత్య ప్రచారాలు సాగిస్తూ దొంగే దొంగా అని అరిచిన చందాన వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సామాన్య భక్తులను సైతం విస్మయానికి గురి చేస్తోందన్నారు. విజ్ఞులైన ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం వాస్తవాలను గమనించాలని కోరారు. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి దోషులను శిక్షించటమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.

# మార్చి 5న భారత్ బంద్‌కు పిలుపు

## నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్




**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** అక్రమ అరెస్టులు (రెడ్ బుక్) రాజ్యాంగం నిరసనగా మార్చి 5వ తేదీన భారత్ బంద్ కు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ పిలుపును ఇచ్చారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతి రాజధాని అనే ప్రకటించిన చంద్రబాబు నాయుడు ఇప్పటికీ 20 నెలలు అయినప్పటికీ రైతులకు ఒక ప్లాట్ కేటాయించలేదన్నారు. మా యొక్క నియోజకవర్గం లో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. నారా లోకేష్ సామాజిక వర్గం ను వదిలేసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల వారిని జైలుకు పంపిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 5వ తేదీన భారత్ బంద్ పిలుపును ఇవ్వడం జరిగిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదన్నారు. పేదల మహిళలకు దుల్హన్ పథకం ఇవ్వలేదు. మైనారిటీ కార్పొరేషన్ నిధులు హజ్ హౌస్ నిర్మాణం చేపట్టలేదు. ఉర్దూ అకాడమీ నిర్వీర్యం చేశారు. కేంద్రం నుండి వచ్చిన నిధులు చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇతర దేశాలలో దాచుకుంటున్నారు. ఈ కూటమి యొక్క ప్రభుత్వం వైఫల్యానికి కారణంగా 25న భారత్ బంద్ కు విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం. కార్యక్రమంలో అన్న వైఎస్ఆర్ లీడర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ స్లిప్పులను వెంటనే ఆన్‌లైన్ చేయాలి

## జెడ్పీ సీఈఓకు యూటీఎఫ్ జిల్లా శాఖ వినతి



**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను వెంటనే ఆన్లైన్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మ కు యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సాయంత్రం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో ఓబుళమ్మని కలిసి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలోని ఉపాధ్యాయులు ప్రతి నెలా తమ వేతనం నుండి మినహాయించి జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ కు కాంట్రిబ్యూషన్ ను జమ చేయడం జరుగుతున్నదన్నారు. అయితే జిల్లాలో జిల్లా పరిషత్ వారు ప్రావిడెంట్ ఫండ్ ను పూర్తిస్థాయిలో ఆన్లైన్ చేయకపోవడం మూలాన తమ మినహాయింపులు సక్రమంగా జమ అవుతున్నాయో లేదో తెలుసుకోలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఆన్లైన్ స్లిప్పులను కూడా 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే ఆన్లైన్లో పొందుపరిచారని, దీనివల్ల ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఖాతాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోలేక పోతున్నారన్నారు. జిల్లా పరిషత్ అధికారులు స్పందించి తక్షణం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్లిప్పులను ఆన్లైన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను ఆన్లైన్ చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని, త్వరలోనే వాటిని ఆన్లైన్లో ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శులు ఏజాస్ అహ్మద్, గోపీనాథ్, సుబ్బారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, రామకేశవ, నరసింహులు, బాబు చెన్నయ్య, మహబూబ్ బాషా, చింతల రాయుడు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆస్తిపై ఫోటో వేసుకున్న ఘనుడు జగన్

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- చల్లపల్లి మండలం పురిటిగడ్డలో పాస్ బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**అవనిగడ్డ ఫిబ్రవరి03 (వుదయం ప్రతినిధి):** రైతు ఆస్థి పొలం పట్టాదారు పాస్ పుస్తకాలపై తన ఫోటో వేసుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో గ్రామ సచివాలయం వద్ద రైతులకు పట్టాదారు పాస్ బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి పాస్ పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చట్టప్రకారం పాస్ బుక్స్ జారీ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మినహా ఏ ప్రభుత్వమూ సీఎం ఫోటోలతో పాస్ బుక్స్ ప్రింట్ వేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ తన ఫోటోతో జారీ చేసిన పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రద్దు చేసి చట్టప్రకారం ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాలు ముద్రించి పాస్ బుక్స్ విలువ పునరుద్ధరించిందన్నారు. దీంతోపాటు రైతులకు పాస్ పుస్తకాల జారీకి ముందే ఎలాంటి తప్పులు లేకుండా అన్ని వివరాలు సక్రమంగా ఉన్న పాస్ బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు సమర్థవంతమైన రెవిన్యూ సేవలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి రమ్య, ఇంచార్జి తహసీల్దార్ జీ.శ్రీలత, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, రీ-సర్వే డీటీ చిన్నం నీలిమ, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, మాజీ ఎంపీటీసీ దేవభక్తుని గోపాలకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని నానీ, ఎస్ఐ ఆంజనేయులు, రాజులపాటి జగదీష్, వీఆర్ఓలు కళ్లేపల్లి బేబీ, శ్రీనివాస్, ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షర ఆంధ్ర విజయవంతంగా అమలు చేయాలి

- యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి
- పీ3 విధానాన్ని క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్




**తిరుపతి, ఫిబ్రవరి 3, వుదయం ప్రతినిధి:** యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను, పీ3 తదితర అంశాలపై పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మిని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమీషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ గా అక్షర ఆంధ్ర, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను, పీ3, తదితర అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అక్షర ఆంధ్ర" అక్షరాస్యత కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అక్షరాస్యత లేని ప్రతి వ్యక్తిని గుర్తించి, వారికి చదువు-వ్రాయడం నేర్పే బాధ్యతను క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలోలబ్ధిదారుల ఖచ్చితమైన గుర్తింపు, తరగతుల నిరంతర నిర్వహణ, అభ్యాస పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. "అక్షర ఆంధ్ర" ద్వారా ప్రతి పౌరుడికి చదువు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ కార్యక్రమాన్ని సామూహిక బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను జిల్లాలో పూర్తి ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరుతాయని తెలిపారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ సమాచారం, సామాజిక-ఆర్థిక స్థితిగతులు పూర్తిగా పరిశీలించి నమోదు చేయాలి, డూప్లికేట్ ఎంట్రీలు, తప్పు సమాచారం నమోదు కాకుండా క్రాస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయాలి, ప్రజలకు సర్వే ఉద్దేశ్యం, ప్రయోజనాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలి అని సూచించారు. సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం, తప్పుడు నమోదు జరిగితే సంబంధిత సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రభుత్వ విధానాలకు పునాది లాంటిదని, దీన్ని అత్యంత బాధ్యతగా చేపట్టాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి3 విధానాన్ని జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో మరింత బలంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పీ 3 అమలులో గ్రామ, మండల స్థాయిలో ప్రజల చురుకైన భాగస్వామ్యం ఉండాలి, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలి, పారదర్శకత, బాధ్యతతో పనులు నిర్వహించాలి అని తెలిపారు. పి 3 ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతాయని, ప్రజల నమ్మకం పెరుగుతుందని పేర్కొంటూ, అందరూ ఆర్డీఓలు, తహసీల్దార్లు ఈ విధానాన్ని ప్రాధాన్యతగా తీసుకొని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోజ్ మాండ్, డి ఎల్ డి ఓ నారాయణ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, ఇరిగేషన్ డి ఈ రాధాకృష్ణ, జి ఎస్ డబ్ల్యూ ఎస్ జగదీష్, డిప్యూటీ రవాణా కమీషనర్ మురళి మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ జె డి ప్రసాద రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సంకల్పయాత్రకు సంఘీభావం

**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** తనదైన సహజ శైలిలో సంచలనమైన వ్యాఖ్యలతో తరుచూ వార్తల్లో నిలుస్తూ, అభిమానాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా చేతుల్లో చూపించే వ్యక్తి, తనకు నచ్చిన విషయం యేదైనా నిర్మొహమాటంగా బహిరంగంగా మాట్లాడే దమ్మున్న మనిషి, ప్రముఖ నిర్మాత, చలనచిత్ర నటులు బండ్ల గణేష్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా గెలిస్తే తాను కాలినడకన తిరుమలకు వస్తానని శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మొక్కుకోవడం, భగవంతుడు ఆయన మొర ఆలకించి మన రాష్ట్రానికి పట్టిన చీకట్లను పారద్రోలి అఖండ ప్రజాదరణతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బండ్ల గణేష్ తన మొక్కుబడిని సంకల్పయాత్ర ద్వారా తీర్చుకుంటూ ఆ దేవదేవుని తొలి గడప అయిన కడపజిల్లాలోనికి ప్రవేశించిన శుభసందర్భంగా ఆయనకు శాలువా కప్పి, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి చిత్రపటంతో స్వాగతం పలికి, బాబు తో నేను సైతం అంటూ కరపత్రాలతో సంఘీభావం తెలుపుతూ సనాతన హైందవ ధర్మంలో భగవంతుని అనుగ్రహం కోసం పాదయాత్ర కూడా ఒక ప్రక్రియగా అన్నమయ్య, ఆదిశంకరాచార్యులు లాంటి మహనీయుల్ని ఆదర్శంగా తీసుకుని సాగుతున్న యీ సంకల్పయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఆ తిరుమలేశుని కరుణాకటాక్షాలు బండ్ల గణేష్ కి, వారి కుటుంబసభ్యులకు, వారి పరివారానికి ఎల్లవేళలా వుండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటరీ తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి కూనపురి రామునాయుడు, ప్రొద్దుటూరు నియోజకవర్గ సిబియన్ ఆర్మీ కో-ఆర్డినేటర్ సిజె.వెంకటసుబ్బయ్య, నందమూరి యువసేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, కార్యదర్శులు తాటి సుధాకర్ యాదవ్ తదితరులు సంకల్పయాత్రలో పాల్గొన్నారు.




## మార్కెట్ యార్డ్‌లో మంచినీళ్ల సౌకర్యం కల్పించాలి

### సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చిన సీఐటీయూ నాయకత్వం

**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** కడప మార్కెట్ యార్డులో హమాలీలకు, రైతులకు మంచినీళ్ల సౌకర్యం కల్పించి, మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం, మౌలిక సౌకర్యాలు కల్పించాలని మార్కెట్ యార్డ్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి గారికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, యార్డ్ కన్వీనర్ రవి, శీను, శేఖర్, మహిళలు సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డిలు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మనోహర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కడపలో ఉన్న మార్కెట్ యార్డ్ కు రైతాంగం పశువు, శనిగలు, శనిక్కాయలు ఇతరతర పంటలు తీసుకొని వస్తారని గుర్తు చేశారు. ముఖ్యంగా నగరంలో ఉన్న మార్కెట్ యార్డ్ లో సీజనల్ అన్ సీజనల్ హమాలీ కార్మికులు దాదాపు 300 దాకా ఉంటారని తెలిపారు .ముఖ్యంగాహమాలి కార్మికులకు మంచినీళ్ల సౌకర్యం లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే తరుణంలో మహిళ కార్మికులు మరుగుదొడ్ల సమస్యతో తీవ్రంగా మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్లాగే గత నాలుగు సంవత్సరాలుగా ఇవ్వని యూనిఫామ్ ను ఇవ్వాలని కోరారు. రోడ్డు వైడింగ్ పేరుతో మరుగుదొడ్లను తొలగించారన్నారు. వాటిని ఇప్పటివరకు కట్టకపోవడం బాధాకరమని తెలిపారు. కనుక జిల్లా వ్యాప్తంగా వస్తున్నటువంటి రైతాంగానికి మంచినీళ్ల సౌకర్యం యార్డ్స్ లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.



## సీసీ రోడ్లు ప్రారంభం

**ఆత్మకూర్ రూరల్ చేజర్ల (వుదయం ప్రతినిధి)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరి నాయుడు సూచనలతో చేజర్ల మండల కేంద్రంలో బీసీ ఎస్టీ కాలనీలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద సుమారు 18లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చేజర్ల టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రావి లక్ష్మి నరసారెడ్డి చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్. సిరాజుద్దీన్ సొసైటీ అధ్యక్షులు అధ్యక్షులు బూదల్ల వీరరాఘవరెడ్డి , మండల బీజేపీ అధ్యక్షులు గుండాల విజయభాస్కరరెడ్డి ,సోమశిల దక్షిణ కాలువ చైర్మన్ రావి ప్రసాద్ రెడ్డి , ఎంపీటీసీ సభ్యులు షేక్ మస్తానయ్య, చేజర్ల పెద్ద చెరువు చైర్మన్ అరవ గోపిరెడ్డి , టీడీపీ బూత్ కన్వీనర్ రావి లక్ష్మి ప్రసన్న సచివాలయం సిబ్బంది ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# మురికి కాలువ మీద అక్రమ కట్టడాలు




**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** డీసీఎస్ఆర్ కాలనీ వాసులు ఖలందర్ బాష, రాఘవ రెడ్డి ఆవేదన మంగళవారం వారు ఈ విషయమై స్థానిక ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ మండలంలోని క్రొత్తపల్లె గ్రామ పంచాయితీ లోని 10వ వార్డు, డి.సి.యస్.ఆర్. కాలనీలో డి.సి.యస్.ఆర్. కాలనీ డిపో వెనుక భాగంలో పంచాయితీలో మురికి కాలువ మీద కొంత మంది వ్యక్తులు అక్రమ కట్టడాలు నిర్మించి కొంత భాగం సి.సి. రోడ్డు మీద కూడా కట్టడం జరిగిందని, తద్వారా ప్రజలకు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. వర్షకాల సమయంలో కాలువల మీద అక్రమ కట్టడాలు చెపట్టడం వలన కాలువలోని మురికి నీరు బయటికి వచ్చి ఆ ప్రాంతం అంత అపరిశుభ్రంగా మారి, ప్రజలు అస్వస్థతకు గరై ఆనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టరు, ఆర్డీవో, పంచాయితీ అధికారులకు అనేక సార్లు విన్నవించుకొన్నామని, చివరకు సీఎం పేషీకి విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. కానీ ఇంతవరకు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కావున స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపకరిస్తుంది



**విజయవాడ ఫిబ్రవరి 3 వుదయం న్యూస్ బ్యూరో:** -పెనమలూరు నియోజకవర్గం పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 36మందికి షుమారు 25 లక్షల 16వేల 848 రూపాయల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ . ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేద బడుగు వర్గాల ప్రజలు,హస్పిటల్ వెళ్లి నగదు చెల్లించిన పేదవారికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంరాఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని,గడచిన 18 నెల కాలం లో 1330 మందికి 12 కోట్ల 25 లక్షలు 45 వేల రూపాయల మేర పేదవారికి సీఎంరాఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా భావిసున్నాననీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## ఏఐఎస్బీ జిల్లా ఉపాధ్యక్షులు అఖిల్




**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** తిరుపతి పట్టణంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై ఆందోళన చేస్తున్నటువంటి విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేసిన మోహన్ బాబు బౌన్సర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏఐఎస్బి జిల్లా ఉపాధ్యక్షులు ఓసూరి అఖిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం కడప నగరం కాగితాలపెంటలోని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బి) జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. తిరుపతి పట్టణంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు సిద్ధమైన విద్యార్థి సంఘ నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, యూనివర్సిటీ నాయకుడు వినోద్ లను దారి మధ్యలో మోహన్ బాబు యూనివర్సిటీ బౌన్సర్లు అడ్డుకొని వారిపై దాడి చేసి కిడ్నాప్ చేసి తమ వాహనాల్లో తీసుకెళ్లడం దారుణం అని వారు తెలిపారు. మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి వేలరూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతుండటంతో యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు సిద్ధమైన సమయంలో ఇలా జరగడం దారుణమన్నారు. యూనివర్సిటీలో జరిగిన తప్పును సరిహద్దుకోకుండా మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం ఇలా దౌర్జన్యాలకు పాల్పడటం సిగ్గుచేటని వారు అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఈ ఘటన వెనుక ఎవరు ఉన్న కఠినంగా వ్యవహరించి క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్బినాయకులు అంజి, చింటూ లు పాల్గొన్నారు.

# ఘంటసాల విద్యా వనరుల కేంద్రం నిర్మాణ పనులను పరిశీలన



**అవనిగడ్డ ఫిబ్రవరి03 (వుదయం ప్రతినిధి):** మండల కేంద్రమైన ఘంటసాల గ్రామంలో నిర్మిస్తున్న విద్యా వనరుల కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎంఈవో 1 ఎన్.శివశంకరరావు అన్నారు. ఘంటసాల గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో సమగ్ర శిక్ష అభియాన్ నిధులు రూ.53 లక్షలతో నిర్మిస్తున్న మండల విద్యా వనరుల కేంద్రం పనులను ఎంఈవో 1, ఎంఈవో 2, ఏఈలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న బెడ్ కాంక్రీట్ పనులను, వాటి నాణ్యతను అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. భవన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 1 శివశంకరరావుతో పాటు ఎంఈవో 2 ఎండీ మోమిన్, ఎస్ఎస్ఏ ఏఈ అవనిగడ్డ రాంబాబు, సిబ్బంది. కూలీలు పాల్గొన్నారు.

# కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలి

## డైట్ ఫ్యాకల్టీ పద్మజ




**కావలి, ఫిబ్రవరి 03, వుదయం న్యూస్:** కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధించేలా విద్యార్థులు కష్టపడి తమ సామర్థ్యాన్ని చూపాలని డైట్ ఫాకల్టీ యం పద్మజ తెలియజేశారు. కావలి పట్టణంలోని జనతా పేటలో స్థానిక ఆంధ్ర కేసరి మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు తరగతులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించి, విద్యార్థులు చదవడం, రాయడం వంటి మొదలైన నైపుణ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నందున హర్షం వ్యక్తంచేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత మరియు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి మధుసూదనరావు, ఉపాధ్యాయబృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## యుఎస్ సుంకాల తగ్గింపును ఆహ్వానించిన జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి



**శ్రీనగర్ :** రష్యా నుంచి ముడి చమురు కొనుగోలును నిలిపివేస్తే బదులుగా భారతీయ వస్తువులపై సుంకాలను 18శాతానికి తగ్గించాలన్న అమెరికా నిర్ణయాన్ని జమ్ము, కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆహ్వానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా చమురు కొనుగోలుకు 25 శాతం జరిమానాతో సహా 50 శాతం లెవీ విధించడం వల్ల భారతదేశం, భారత వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, వ్యాపార నష్టాలకు భయపడుతున్న ఎగుమతిదారులకు ఆ దేశానికి ఎగుమతులు పెరగడంతో ప్రయోజనం చేకూరుతుందని అబ్దుల్లా అన్నారు. అసెంబ్లీ భవనం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ, సుంకం విధించడం వెనుక కారణం స్పష్టంగా ఉందని అబ్దుల్లా అన్నారు. భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు అసంతృప్తిగా ఉన్నారు అని ఆయన అన్నారు. అయితే ఇతర ప్రతిపక్ష నాయకుల మాదిరిగానే తాను కూడా ప్రకటన విధానాన్ని ప్రశ్నించానని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఫోన్ సంభాషణ తర్వాత ట్రూత్ సోషల్‌లో ట్రంప్ మొదట ఈ ఒప్పందాన్ని ధృవీకరించారు. ఆ తర్వాత ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఇంధన దాహంతో ఉన్న దేశానికి కేంద్రం ప్రత్యామ్నాయ చమురు వనరులను తెచ్చేందుకు విధానాన్ని రూపొందించిందా, అది డీజిల్, పెట్రోల్ సహా ఇతర ఇంధనాల ధరల పెరుగుదలకు దారితీస్తుందా అని ఆయన ప్రశ్నించారు. భారతదేశం అమెరికా నుంచి, బహుశా వెనిజులా నుంచి చమురు కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని ట్రంప్ అన్నారు. అయితే, భారతదేశం ఆంక్షలు లేని దేశాల నుండి ముడి చమురును కొనుగోలు చేస్తూనే ఉంటుందని, ఆంక్షల కారణంగా వెనిజులా నుండి చమురు ఇప్పటి వరకూ కొనుగోలు చేయలేదని అధికారవర్గాలు తెలిపాయి.

తగ్గించిన సుంకాల వల్ల ఎగుమతులు పెరగాలని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల్లో కాశ్మీరీలను లక్ష్యంగా చేసుకోవడంపై మాట్లాడుతూ, విద్యార్థులు, వ్యాపారులపై వేధింపులను ఆపాలని, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన తన సహచరులను, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్లు ఆయన చెప్పారు. కాశ్మీరీ వ్యాపారులను వేధించి, దాడి చేసిన వారిపై ఉత్తరాఖండ్ వేగంగా చర్య తీసుకొని, అరెస్టు చేయడాన్ని తాను అభినందిస్తున్నానని ఆయన అన్నారు. అయితే, నేషనల్ కాన్ఫరెన్స్ మిత్రపక్షమైన కాంగ్రెస్ పాలించే హిమాచల్ ప్రదేశ్‌లో ఇలాంటి సంఘటనలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. మన ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం నాకు షాక్ ఇచ్చింది. కాశ్మీరీలను ఇలా వేధించడం ఆపాలని నేను హిమాచల్‌ను అభ్యర్థిస్తున్నాను అని ఆయన అన్నారు.

## భారత్-యుఎస్ మధ్య వాణిజ్య ఒప్పందం- ఒడుదుడుకులు




**న్యూఢిల్లీ :** భారత్, అమెరికాలు చారిత్రిక వాణిజ్య బిల్లును ఖరారు చేయడంతో ఏడాదిగా సాగుతున్న సుంకాల వివాదానికి తెరపడింది. భారతీయ ఎగుమతులపై వేసిన రెసిప్రోకల్ టారిఫ్ ను 18శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించి, భారతీయ ఎగుమతిదారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తక్షణ ఊరటను కలిగించారు. సోమవారం నాడు ట్రంప్‌కు, ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఈ వార్త వెలువడింది. నెలల తరబడి చర్చలకే పరిమితమైన ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలలో ప్రధానమైన మార్పుకు దారి తీసింది. ఇరు దేశాలకూ చెందిన ఇరు దేశాల రాయబారుల మధ్య నెలలు తరబడి జరిగిన తీవ్ర సంప్రదింపుల అనంతరం ఈ ఒప్పందం ఖరారైంది. గత ఏడాది మొదట్లో సానుకూలమైన అప్రమత్తతతో ప్రారంభమైన ఈ చర్చలు, నిలకడైన దౌత్యపరమైన కృషిగా పరిణామం చెంది, అంతిమంగా ఫిబ్రవరి 2026లో ఖరారయ్యాయి.

వాణిజ్య ఒప్పందానికి దారితీసిన కీలక ఘటనల కాలక్రమం ఏప్రిల్ 2025 – అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత్‌లో పర్యటించినప్పుడు, ఇరుపక్షాలు విధివిధానాలను ఖరారు చేశాయి; జూలై 9వ తేదీలోగా ఒప్పందం కుదిరే అవకాశం ఉందని భారత్ సంకేతాలు ఇచ్చింది. మే 2025– వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ప్రధాన సంధానకర్త రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌ను సందర్శించారు (మే 17–20); చర్చలు పురోగమించాయి, ఇరుపక్షాలు ఒక ఒప్పందానికి దగ్గరవుతున్నాయి.

జూన్ 2025 – జూన్ 3వ తేదీన అమెరికా వాణిజ్య మంత్రి లట్నిక్ ఒప్పందం ఖరారు కావచ్చంటూ పేర్కొన్నారు; దానిని భారీ వాణిజ్య ఒప్పందంగా ట్రంప్ అభివర్ణించారు. వ్యవసాయ దిగుమతి సంకాల విషయంపై చర్చలు ప్రతిస్తంభించాయి. వాషింగ్టన్‌కు రావలసిందిగా ట్రంప్ ఆహ్వానాన్ని ప్రధాని తిరస్కరించారు. జులై 2025 – భారత ప్రతినిధి బృందం ఎటువంటి పురోగతినీ సాధించకుండా తిరిగి వచ్చింది. జాతి ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యత ఉంటుందని జులై 4న గోయల్ నొక్కి చెప్పారు. జులై మధ్య కాలంలో ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు ఐదవ విడత చర్చలు జరిగాయి. భారతీయ సరుకులపై 25శాతం సుంకాన్ని ట్రంప్ తిరిగి విధిస్తూ, రష్యా చమురును కొనుగోలు చేయడాన్ని కొనసాగిస్తే జరిమానాలు విధిస్తామంటూ హెచ్చరించారు.

ఆగస్టు 2025 – భారతీయ ఎగుమతులపై సుంకాలను 50 శాతానికి అమెరికా పెంచింది. ఇది ఏ వాణిజ్య భాగస్వామిపైనైనా విధించగలిగే అత్యధిక సుంకం. చర్చలు కొనసాగుతున్నప్పటికీ, రష్యన్ చమురును దిగుమతి చేసుకుంటున్న బ్రిక్స్ దేశాలకు కూడా బెదిరింపులు విస్తరించాయి. ఆగస్టు 2025– ఆరవ విడత ద్వైపాక్షిక వాణిజ్య చర్చల కోసం అసిస్టెంట్ ట్రేడ్ రిప్రెజెంటేటివ్ బ్రెండన్ లించ్ నేతృత్వంలో అమెరికా ప్రతినిధి బృందం ఆగస్టు 25– 29 వరకు న్యూఢిల్లీకి రావలసి ఉంది. అయితే, ఈ పర్యటన రద్దు కావడమే కాక, కొత్త తేదీలను ఇంకా నిర్ణయించలేదంటూ వారి అధికారి వెల్లడించారు. సెప్టెంబర్ 2025– వాణిజ్య ఆటంకాలను పరిష్కరించడంపై ట్రంప్ ఆశావాదాన్ని వ్యక్తం చేస్తూ మోడీతో మాట్లాడాలని యోచిస్తున్నట్టు తెలిపారు. అమెరికా–భారత్‌లు "సన్నిహిత స్నేహితులు, సహజ భాగస్వాములు" అని ప్రధానమంత్రి మోడీ అభివర్ణిస్తూ కొనసాగుతున్న చర్చలను పట్టి చూపారు. అక్టోబర్ 2025 – రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపివేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చినట్టు ట్రంప్ పేర్కొనగా, జాతి ప్రయోజనాలను పట్టి చూపుతూ, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వాదనను తిరస్కరించింది. నవంబర్ 2025 – పరిమిత పరిణామాలు; ఎటువంటి ఖచ్చితమైన ఫలితాలు లేకుండా చర్చలు కొనసాగాయి

డిసెంబర్ 2025– ఢిల్లీలో చర్చలు జరుగుతున్న సమయంలో, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ట్రంప్‌తో "ఆత్మీయమైన, ఆసక్తికరమైన" సంభాషణ జరిగిందని ప్రధాని మోడీ ధృవీకరించారు. జనవరి 2026 – ఇరు దేశాలూ చర్చలు చురుకుగా నిర్వహిస్తూ, ఒప్పందం దిశగా కదులుతున్నామని యుఎస్ రాయబారి సెర్జియో గోర్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 2026 – వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన ట్రంప్, భారతీయ దిగుమతులపై సుంకాలను 50 నుంచి 18 శాతానికి తక్షణమే తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఇది భారత ఎగుమతిదారులకు తక్షణ ఊరటను అందిస్తోంది. ట్రంప్ సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ లో చేసిన పోస్ట్‌కు స్పందిస్తూ, మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై ఇప్పుడు సుంకం 18 శాతానికి తగ్గుతుందని తెలిసి తాను చాలా సంతోషించానని ప్రధాని మోడీ అన్నారు.

## ఎస్‌ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం

### డీఆర్‌డీవో మరో ఘనత..



**ఒడిశా :** దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన 'సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్' సాంకేతికతను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. పరీక్షల్లో భాగంగా నాజిల్ లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలూ ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఐటీఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. 'ఎస్‌ఎఫ్‌డీఆర్' ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల లక్ష్యాలను అత్యంత దూరం నుంచే అడ్డుకోగల క్షిపణుల తయారీ దిశగా భారత్ ముందడుగు వేసినట్లయ్యింది. ఈ ప్రయోగాన్ని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్, ఐటీఆర్ శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు.

## అప్పుడు సీజ్‌ఫైర్.. ఇప్పుడు ట్రేడ్ డీల్

### ట్రంప్ ప్రకటనపై కాంగ్రెస్ పోస్టు



**న్యూఢిల్లీ :** భారత్‌తో ట్రేడ్ డీల్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ప్రకటించడాన్ని తప్పుపట్టింది. అలాగే ట్రంప్ పోస్టులో ప్రస్తావించిన అంశాలపై ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది ఆపరేషన్ సిందూర్ వేళ.. భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ గురించి ఆయనే ప్రకటించడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆరోపణలు చేసింది. "గతేడాది సీజ్‌ఫైర్‌ను ట్రంపే ప్రకటించారు.. ఇప్పుడు ట్రేడ్ డీల్ గురించి ఆయనే చెప్పారు. దీని వెనక ఆంతర్యం ఏంటి..? మోదీ కోరిక మేరకే ఈ డీల్ కుదిరిందన్నారు. ట్రంప్‌నకు మోదీ లొంగిపోయారా? ఆ దేశంపై విధిస్తున్న సుంకాలను జీరోకు తీసుకొచ్చారు. దీనివల్ల అగ్రరాజ్య ఉత్పత్తులకు దేశ మార్కెట్‌లో పూర్తి స్వేచ్ఛ కల్పించినట్టే అవుతుంది. ఇలా చేయడం వల్ల మన వ్యాపారులకు తీవ్ర నష్టం కలుగుతుంది" అని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డీల్ రైతులను, వ్యాపారులను, పరిశ్రమలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వివరించాలని డిమాండ్ చేసింది. రష్యా చమురుకు బదులుగా అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోలు చేయడంపై మోదీ మౌనం వహిస్తున్నారని, దీనిపై సమగ్ర వివరాలు వెల్లడించాలని పోస్టులో పేర్కొంది. గతేడాది పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో భారత్ గట్టి బదులిచ్చిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో భారత్–పాక్ మధ్య ఘర్షణలు జరిగాయి. మన సైన్యం ధాటికి విలవిల్లాడిన పాక్.. మనతో కాల్పుల విరమణకు అంగీకరించింది. ఇది తనవల్లే కుదిరిందని ట్రంప్ పలుమార్లు ప్రకటించుకున్నారు. అయితే దానిని భారత ప్రభుత్వం మాత్రం అంగీకరించలేదు.

### సముద్రంలో బాలుడి సాహసం..

## గంటలపాటు ఈది.. కుటుంబాన్ని కాపాడి!



**పెర్త్:** సముద్రంలో కొట్టుకుపోయిన తన తల్లి, తోబుట్టువులను కాపాడుకునేందుకు ఓ బాలుడు పెద్ద సాహసం చేశాడు. అల్లకల్లోలంగా మారిన సముద్రంలో దాదాపు 4 గంటల పాటు భీకర అలలకు ఎదురీది ఎట్టకేలకు తీరానికి చేరుకుని సమాచారం అందించాడు. అప్పటికే చీకటి పడటంతో హెలికాప్టర్ సాయంతో రంగంలోకి దిగిన అధికారులు.. తల్లి, మరో ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. ఆస్ట్రేలియాలో ఈ ఘటన వెలుగు చూసింది. పెర్త్‌కు చెందిన జోవాన్ అపెల్బీ అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి చిన్న పడవలు (కయాక్), పెడల్ బోర్డ్‌ల సాయంతో సముద్రంలో విహారానికి వెళ్లారు. అంతలోనే వాతావరణం మారిపోవడంతో.. వారు క్రమక్రమంగా తీరానికి దూరంగా కొట్టుకుపోయారు. ఈ క్రమంలోనే.. తల్లి సూచనతో పెద్ద కుమారుడు ఆస్టిన్ (13) సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. సాయాన్ని అర్థించేందుకు తొలుత కయాక్‌పై తీరం వైపు బయల్దేరాడు. కానీ, అందులోకి నీరు చేరడంతో మధ్యలోనే వదిలేశాడు. అనంతరం లైఫ్‌జాకెట్‌నూ వదిలేసి.. తీరం వైపు ఈత కొట్టడం ప్రారంభించాడు. ఉద్ధృత అలల నడుమ దాదాపు 4 కిలోమీటర్ల మేర ఈది తీరానికి చేరుకున్నాడు.

బాలుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు హెలికాప్టర్ సాయంతో గాలింపు చేపట్టి.. తల్లి, ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఆ సమయానికి వారు తీరానికి 14 కిలోమీటర్ల దూరంలో పెడల్ బోర్డులను పట్టుకుని వేలాడుతూ కనిపించారని చెప్పారు. బాలుడి ధైర్యసాహసాలను ప్రశంసించారు. నలుగురికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరికీ ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం రాలేదన్నారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలను వదిలేసి తాను వెళ్లలేని పరిస్థితి ఉందని, ఆస్టిన్‌ను పంపడం తన జీవితంలో తీసుకున్న అత్యంత కష్టమైన నిర్ణయమని తల్లి జోవాన్ తెలిపారు. సముద్రంలో కొట్టుకుపోయిన మొదట్లో ధైర్యంగానే ఉన్నామని, కానీ.. చీకటి పడేకొద్దీ అలలు ఉద్ధృతంగా మారాయని, చలికి వణికిపోయామని చెప్పారు.





## ఇసిపై అభిశంసన తీర్మానం పెట్టే యోచనలో తృణమూల్

**న్యూఢిల్లీ :** త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తీవ్ర వివాదం నెలకొన్న నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అవకాశాన్ని చర్చించడానికి తృణమూల్ కాంగ్రెస్ ఇతర పార్టీలతో మాట్లాడనుందని పార్టీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి, ఎన్నికల సంఘంలోని ముగ్గురు ఉన్నతాధికారులకు మధ్య ఢిల్లీ లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో వాగ్వాదం జరిగిన ఒక రోజు తర్వాత ఈ ప్రకటన వెలువడింది. ఈ పరిణామాన్నిధృవీకరిస్తూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను జ్ఞానేష్ కుమార్ నిర్వహించిన తీరు తప్పు అని తృణమూల్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్ఐఆర్ నిర్వహిస్తున్న విధానం తప్పు, ఇది దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కులను ప్రభావితం చేస్తుంది కాబట్టి మేము ఆయనను అభిశంసించే విషయాన్ని పరిశీలిస్తున్నామని తృణమూల్ ఎంపీ ఢిల్లీలో తెలిపారు.

## మణిపూర్ నూతన సీఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్..!

### బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక



**ఇంఫాల్ :** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్‌జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపూర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరేన్‌సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ బాధ్యతలు చేపట్టనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

మణిపూర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో చేతివాటం.. ఏడుగురి అరెస్ట్



**ముంబై:** విమాన ప్రమాదంలో కన్నుమూసిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో జరిగిన విషయం తెలిసిందే. అయితే ఇదే అదునుగా పలువురి నగలను, నగదును కొందరు దొంగలు కాజేశారు. వీరిని పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. అజిత్ పవార్ అంత్యక్రియలకు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఆయన అంతిమ సంస్కారాలు ముగిసిన అనంతరం దాదాపు 15మంది వ్యక్తులు తమ బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఏడుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

### విమర్శలు ఎదురైనా..

## మా సహనమే గెలిపించింది

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకువచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు.

దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ



తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

## వాట్సాప్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్

దిగ్గజ టెక్ సంస్థ మెటాపై (ఓవబిజీ) సుప్రీంకోర్టు సీరియస్ అయింది. భారత చట్టాలను పాటించకపోతే దేశం విడిచి వెళ్లిపోవచ్చంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. వాట్సాప్ గోప్యతా విధానంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాట్సాప్ మాతృసంస్థ మెటాను సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ తీవ్రంగా హెచ్చరించారు.' మా దేశ ప్రజల గోప్యతతో రు ఆటలాడలేరు. మా డేటాలో సింగిల్ డిజిట్ కూడా పంచుకునేందుకు మేము అనుమతించమని స్పష్టం చేశారు. భారత చట్టాలను పాటించడం ఇష్టం లేకపోతే ఈ దేశం విడిచిపెట్టవచ్చని సీరియస్ కామెంట్స్ చేశారు. వాట్సాప్ 2021 గోప్యతా విధాన నవీకరణను పరిశీలిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (అఅఎ) నవంబర్ 2024లో జారీ చేసిన ఉత్తర్వుల నుండి ఈ వివాదం తలెత్తింది. మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని ఉపయోగించి వినియోగదారులను కొత్త గోప్యతా విధానాన్ని తప్పనిసరిగా అంగీకరించేలా వాట్సాప్ ఒత్తిడి తీసుకువ చ్చిందని సీసీఐ పేర్కొంది.


విశేష పత్రం

భాగం-II సెక్షన్ 3 సబ్-సెక్షన్ (ii)

**రైల్వేల మంత్రిత్వ శాఖ**

(దక్షిణ మధ్య రైల్వే)

PUB/1873

**ప్రకటన**

సికింద్రాబాద్, 29 జనవరి, 2026

**S.O.421(E)** - రైల్వేల చట్టం, 1989 (24 ఆఫ్ 1989) (ఇందులో తరువాత సదరు చట్టంగా పిలువబడును)లోని సెక్షన్ 20Aలోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, ఇందులో అనుబంధ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణలో పేర్కొన్న భూమి ప్రజాప్రయోజనం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బాపట్ల జిల్లా, బాపట్ల గ్రామం & మండలంలోని విజయవాడ-ఒంగోలు సెక్షన్‌లో బాపట్ల TSS నిర్మాణం - 3000 MT లోడింగ్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు 1x25kV నుండి 2x25kVకు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టం స్థాయిపెంపుదల పని కోసం అవసరమై ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సంతృప్తి చెందిన మీదట సదరు భూసేకరణకు తన ఉద్దేశ్యాన్ని ఇందుమూలముగా ప్రకటిస్తోంది.

సదరు భూమిపై ప్రయోజనం కలిగిన ఏ వ్యక్తి అయినా, పైన తెలిపిన ప్రయోజనం నిమిత్తం అట్టి భూసేకరణకు మరియు ఉపయోగానికి సదరు చట్టంలోని సెక్షన్ 20Dలోని సబ్-సెక్షన్ (1) క్రింద తమ అభ్యంతరములను అధికారిక రాజపత్రంలో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై (30) రోజుల వ్యవధిలోగా తెలియజేయవచ్చును.

అట్టి ప్రతీ అభ్యంతరాన్ని, సమర్థ ప్రాధికారి (LA)కి అనగా రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, బాపట్ల వారికి అందుకు సంబంధించిన కారణాలను వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును మరియు సమర్థ ప్రాధికారి రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, బాపట్ల వారు సదరు ఆక్షేపణదారుకు స్వయంగా గానీ లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా గానీ విచారణకు అవకాశం ఇస్తారు మరియు అటువంటి అన్ని ఆక్షేపణలు విచారించబడిన మీదట మరియు అట్టి తదుపరి విచారణ చేసిన తరువాత భూసేకరణ సమర్థ ప్రాధికారి (CALA), అవసరమని భావిస్తే, ఉత్తర్వు ద్వారా సదరు ఆక్షేపణలను అనుమతించవచ్చును లేదా నిరాకరించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 20Dలోని సబ్-సెక్షన్ (2) క్రింద భూసేకరణ సమర్థ ప్రాధికారి ద్వారా చేయబడిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

భూమి ప్లాన్లు మరియు ఈ ప్రకటన క్రింద ఉన్న భూమి ఇతర వివరాలను పైన తెలిపిన సమర్థ ప్రాధికారి (CALA) కార్యాలయంలో లబ్ధిదారులు మరియు ఆసక్తిగల వ్యక్తులు వాటిని పరిశీలించుకోవచ్చును.

**షెడ్యూలు**

**సేకరణలో ఉన్న భూముల వివరణ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బాపట్ల జిల్లా, బాపట్ల గ్రామం & మండలంలోని విజయవాడ-ఒంగోలు సెక్షన్‌లో బాపట్ల TSS నిర్మాణం - 3000 MT లోడింగ్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు 1x25kV నుండి 2x25kVకు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టం స్థాయిపెంపుదల పని కోసం.

| క్ర. సం. | మండలం పేరు | గ్రామం పేరు | అవశ్యక ప్రతిపాదనల ప్రకారం సర్వే సం. | భూమి రకం (ప్రభుత్వ/ ప్రైవేట్ మొ.) | భూమి స్వభావం (మాగాణి/ మెట్ట) | తాత్కాలిక విస్తీర్ణం (ఎకరాలు) | తాత్కాలిక విస్తీర్ణం (హెక్టార్లు) | తాత్కాలిక విస్తీర్ణం (చ.మీటర్లు) | పట్టాదారు/ అనుభోగదారు పేరు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | బాపట్ల | పశ్చిమ బాపట్ల | 363-1B | ప్రైవేట్ భూమి | మెట్ట | 1.78 | 0.720 | 7203.404 | సాల్వేషన్ ఆర్మీ |
| 2 | బాపట్ల | పశ్చిమ బాపట్ల | 372-1B | ప్రభుత్వ అన్యాక్రాంత భూమి | మెట్ట | 0.73 | 0.295 | 2954.205 | సాల్వేషన్ ఆర్మీ |
| మొత్తం | | | | | | 2.51 | 1.015 | 10157.609 | |

[F. No. W.Con/182/SRP/TSS/Bapatla/20A]

కె. సూర్యనారాయణ, చీఫ్ ఇంజనీర్ /Con-III

A2372



"ఇండియాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌ల విషయంలో నా మీద ఎన్ని విమర్శలు వచ్చినా సహనంతో ఉన్నాను. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకవచ్చింది. అమెరికాతో కుదుర్చుకుంటున్న కొత్త వాణిజ్య ఒప్పందం అనుకూల ఆర్థిక వాతావరణాన్ని సృష్టించింది. ప్రభుత్వం వాణిజ్య చర్చల విషయంలో అవలంబిస్తున్న స్థిరమైన వైఖరికి ఇది తార్కాణం. ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల అనేక దేశాలు వాణిజ్య పరమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ ఇండియా మాత్రం ప్రయోజనం పొందుతోంది."
– ప్రధాని మోడీ

## వే'మన'పద్యం

మైలకోకతోడ మాసిన తలతోడ
ఒడలు మురికితోడ యుండెనేవి
అగ్రకులజుడైన నట్టిట్టు పిల్వరు
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ఎట్టకేలకు కుదిరిన ఒప్పందం

భూదేవ ంత అరుగు, ఆకాశమంత పందిరి అంటారు.ప్రజలు ఆనంద ఉత్సాహాలలో తేలియాడుతూ ఉప్పొంగిపోతున్న స్థితిని చెప్పడానికి ఇలా అంటారు.ఏడాది పాటు సాగిన ప్రతిష్టంభన తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడంతో పాలక బి జె పి శిబిరం హర్ష పులకాంకితం కావడాన్ని తప్పు పట్టలేము. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతీకారంగా ఈ ఏడాది కాలంలో ట్రంప్ మనల్ని లక్ష్యం చేసుకొని రెచ్చిపోయిన తీరు చెప్పలవికానిది. అమెరికాకు ఎగుమతి అయ్యే భారతీయ సరకులపై సుంకాలను అత్యంత అనూహ్యంగా, అనుచితంగా 50 శాతానికి పెంచివేశాడు. హెచ్ -1బి విసాల ఇంటర్వ్యూలను దీర్ఘకాలం పాటు వాయిదా వేశాడు. ప్రధాని మోడీ తనకు మంచి మిత్రుడని పదే పదే చెబుతూనే ట్రంప్ సహాయ నిరాకరణ ప్రదర్శించడంతో పలుసార్లు చర్చలు వాయిదా పడ్డాయి.ఈ ఒప్పందం ఇండియా పై మొత్తం అమెరికా సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించివేసింది.దీనితో అమెరికా టారిఫ్ ల విషయంలో చైనా,పాకిస్తాన్, బంగ్లాదేశ్, వియత్నాం థాయిలాండ్ తదితర దేశాలకంటే భారత్ మెరుగైన స్థితిలోకి లోకి వచ్చిన మాట నిజం.దీనివల్ల మన ఎలక్ట్రానిక్, ఆక్వా, మత్స్య, జవుళి తదితర అనేక రంగాలు బాగుపడి లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది అనేది వాస్తవం. అయితే ఈ సంక్షోభం మొదలుకాక ముందు గతంలో మనపై అమెరికన్ సుంకాలు 3 నుంచి 5 శాతం మాత్రమే ఉండేవన్న సంగతిని గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. మొత్తానికి ఇంతకాలం పీడకలలా బాధించిన అధ్యాయం ముగిసిపోయి అగ్రరాజ్యంతో ఒప్పందం కుదరడం అత్యంత హర్షదాయకం.అయితే ఇంతకాలం మనలను నానా రకాలుగా వేధిస్తూ ట్రంప్ చేసిన ప్రేలాపనకు ఒక్క మాటైనా బదులు ఇవ్వకుండా ప్రధాని మోడీ పాటించిన మౌనం మన ప్రజలను అసాధారణ వేదనకు గురి చేసిన మాట వాస్తవం. తాను అలా ఒక ఎత్తుగడ ప్రకారం మౌనంగా ఉండడం వల్లనే ఇప్పుడు ఇంత ప్రయోజనాత్మక ఒప్పం సాధ్యమైందని ప్రధాని అంటున్నారు. ఒప్పందం వార్త వెలువడగానే డాలర్ తో రూపాయి 40 పైసలు బలపడింది. అయితే ఇండియాకు ఎగుమతి అయ్యే తమ సరకులపై టారిఫ్, నాన్ టారిఫ్ భారాలు ఏమీ ఉండబోవని ట్రంప్ చేసిన ప్రకటన గమనించదగినది. ఎటువంటి సుంకాలు లేకుండా అమెరికా తాను పంపించదలచిన వాటినన్నింటినీ ఇండియాలోకి కుమ్మరిస్తుందా,? అనే ప్రశ్న తలెత్తుతున్నది. రష్యా ఆయిల్ ను ఇండియా కొనుగోలు చేయకుండా చూడడం వల్ల మాస్కో మీద ఒత్తిడి పెరిగి ఉక్రెయిన్ యుద్ధం నుంచి వెనక్కు తగ్గుతుందని ట్రంప్ ఆశిస్తున్నాడు. అదే సమయంలో ఈ ఒప్పందంలో అమెరికా కు ఇండియా ఏమిచ్చుకుంటున్నదో తెలియలేదు. అమెరికా తన జన్యు మార్పిడి మొక్కజొన్న, సోయాబీన్, ప్రత్తి వంటివాటిని ఇండియా మార్కెట్లకు వెల్లువెత్తించాలని చూస్తున్నది. దానిని అడ్డుకోడానికే ప్రధాని మోడీ ఇంత కాలం మౌనం వహించారు. ఇప్పుడు కుదిరిన ఒప్పందంలో ఇందుకు సంబంధించి ఏమున్నదో బయటపడాలి.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ట్రంప్ వెనక్కి తగ్గినట్టేనా?

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ఖరారు అయింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికపై ప్రకటించి, అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఫోన్‌లో మాట్లాడారు. ఇకపై భారత్ చమురును యుఎస్ నుంచి వెనిజులా నుంచీ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. భారత్‌పై విధించిన సుంకాలను కూడా 18 శాతానికి తగ్గిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు మోడీ హర్షాన్ని వ్యక్తం చేశారు. ప్రియ మిత్రుడు ట్రంప్‌తో ఇవాళ మాట్లాడాను. భారత్‌లో తయారైన ఉత్పత్తులపై సుంకం 18 శాతం తగ్గడం ఎంతో సంతోషంగా ఉంది. 1.4 బిలియన్ల భారతీయుల తరుపున ఈ అద్భుతమైన ప్రకటనకు కృతజ్ఞతలు చెప్తున్నానంటూ మోడీ పేర్కొన్నారు. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచంలోనే పెద్దవైన ప్రజాస్వామ్యాలు కలిసి పని చేసినప్పుడు అది ప్రజలకు మేలు చేయడమే కాక పరస్పర ప్రయోజనకరమైన సహకారానికి ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని మోడీ అన్నారు.



### ఇతర దేశాలతో పోలిక

నూతన ఒప్పందం ఖరారు కావడంతో, చైనా, పాకిస్తాన్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, వియత్నాం వంటి ఇతర ప్రధాన ఆసియా ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నుంచి అత్యంత తక్కువ సుంకాల రేట్లను ఎదుర్కొంటున్న దేశాలలో భారత్ ఇప్పుడు ఒకటిగా నిలిచింది. అయితే, భారతదేశంతో జరిగే వాణిజ్యంపై అమెరికా విధించే సుంకాలు, అది తన యూరోపియన్ భాగస్వాములపైనా, జపాన్, దక్షిణ కొరియాపైనా విధించే సుంకాల కంటే కొద్దిగా ఎక్కువనే చెప్పాలి.

### అధిక సుంకాలు ఎదుర్కొంటున్న దేశాలు

యుఎస్ నుంచి అధిక సుంకాలను ఎదుర్కొంటున్న దేశాలలో బ్రెజిల్ (50శాతం), మయన్మార్ (40శాతం), లావోస్ (40శాతం), చైనా (37శాతం), దక్షిణ ఆఫ్రికా (30శాతం). ఆగ్నేయాసియాలో అధిక సుంకాలను ఎదుర్కొంటున్న దేశాలలో వియత్నాం (20శాతం) బంగ్లాదేశ్ (20 శాతం), పాకిస్తాన్ (19శాతం), మలేషియా (19 శాతం), కంబోడియా (19శాతం), థాయ్‌లాండ్ (19శాతం) ఉన్నాయి. తక్కువ సుంకాలు చెల్లిస్తున్న దేశాలు అమెరికాతో అత్యల్ప సుంకాల ఒప్పందం ఉన్న దేశాలలో యునైటెడ్ కింగ్‌డమ్ (10శాతం), యూరోపియన్ యూనియన్ (15 శాతం), స్విట్జర్లాండ్ (15 శాతం), జపాన్ (15 శాతం), దక్షిణ కొరియా (15 శాతం) ఉన్నాయి. భారత్-అమెరికా ఒప్పందం నిబంధనల గురించి- న్యూస్ ఏజెన్సీ రాయటర్స్ ప్రచురించిన ఒక కథనం ప్రకారం, రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారతదేశం నుండి దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై విధించిన శిక్షాత్మక 25 శాతం సుంకాన్ని అమెరికా రద్దు చేస్తోంది. ఈ సుంకం ఇప్పటికే ఉన్న 25 శాతం రెసిప్రోకల్ సుంకం రేటుకు అదనంగా విధించినది. బొగ్గుతో సహా 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఇంధనాన్ని, అలాగే సాంకేతికత, వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు, భారతదేశం అత్యంత ఆధునిక అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కూడా కట్టుబడి ఉందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ట్రంప్ సోషల్ మీడియాలో తెలిపారు. వారు కూడా యునైటెడ్ స్టేట్స్‌పై విధించిన తమ సుంకాలు, సుంకేతర ఆటంకాలను సున్నాకి తగ్గించడానికి ముందుకు వస్తారు, అని ట్రంప్ భారత్ గురించి అన్నారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చి గత సంవత్సరం అమెరికా సుంకాల రేట్లను రెండంకెల స్థాయికి పెంచే వరకు, ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం, భారతదేశంలో ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు ఉండేవి. ఇక్కడ సాధారణ వర్తింపు సుంకం రేటు 15.6 శాతం కాగా, వాస్తవ వర్తింపు సుంకం 8.2 శాతంగా ఉండేది.

### అస్పష్టంగా ఉన్న విషయాలు

ట్రంప్ ట్రూత్ సోషల్ సందేశం కొన్ని వివరాలను అందించింది. తక్కువ సుంకాల రేట్ల ప్రారంభ తేదీ, రష్యా చమురు కొనుగోళ్లను ముగించడానికి భారతదేశానికి గడువు, వాణిజ్య అవరోధాల తగ్గింపులు, భారతదేశం ఏ యుఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందో వంటి వాటిని కొన్నింటిని ప్రస్తావించి ంది. సోమవారం మధ్యాహ్నం నాటికి, వైట్ హౌస్ అధ్యక్ష ప్రకటన లేదా మార్పులను అధికారికంగా చేయడానికి అవసరమైన ఫెడరల్ రిజిస్టర్ నోటీసును జారీ చేయలేదు. భారత్ కానీ, యుఎస్ కానీ ఈ ఒప్పందం విధి విధానాలు జారీ చేయడం కానీ లేదా అది ఎప్పటి నుంచీ అమలులోకి వస్తుందన్న విషయాన్ని కానీ స్పష్టం చేయలేదు. భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయనుందనే విషయంపై రష్యా కూడా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. జపాన్, దక్షిణ కొరియాతో సహా ఇతర ప్రధాన ఆసియా వాణిజ్య భాగస్వాములతో గతంలో కుదిరిన వాణిజ్య ఒప్పందాలలో అమెరికా పరిశ్రమలలో వందల బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టే హామీలు ఉన్నాయి, కానీ భారతదేశం చేసిన ప్రకటనలో ఎలాంటి నిర్దిష్ట పెట్టుబడుల గురించి ప్రస్తావించలేదు.

# బడ్జెట్‌లో రైతాంగానికి దగా

మోదీ నాయకత్వాన ఉన్న కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ను, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 1-2-26న పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. బడ్జెట్ మొత్తం 53,47,315 కోట్లు. రెవిన్యూ వసూళ్లు 33,33,150 కోట్లు. మూలధనం వసూళ్లు 18,14,165 కోట్లు. రెవిన్యూ లోటు 5,92,344 కోట్లు, ద్రవ్య లోటు 16,95,768 కోట్లు. ఫలితంగా బడ్జెట్ లోటును పూడ్చడానికి అప్పులు చేయాలి. బడ్జెట్ లో అప్పుల వడ్డీల చెల్లింపుల కోసం కేటాయించింది 14,03,972 కోట్లు, అంటే మొత్తంలో బడ్జెట్ లో4వంతు వడ్డీల చెల్లింపులకే సరిపోతుంది. వివిధ రంగాలకు బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదన చేయడం జరిగింది. అందులో వ్యవసాయ రంగానికి 1,32,561 కోట్లు. గత బడ్జెట్ లో 1,27,290 కోట్లు. వ్యవసాయ రంగానికి నేటి బడ్జెట్ కేటాయింపు కొద్ది పెంపుదల మాత్రమే. అందువల్ల చిన్న, సన్న కారు రైతులకు, ఈ బడ్జెట్ వల్ల ప్రయోజనం లేదు. రైతు వ్యవసాయానికి అవసరమైన ఎరువులకు ఇచ్చే సబ్సిడీని 2025-26 బడ్జెట్ లో 1,86,853 కోట్ల కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్ లో 1,70,944 కోట్లకు తగ్గించడం జరిగింది. ఎరువుల ధరల నిర్ణయం వాటిని ఉత్పత్తి చేసే కంపెనీలకే కట్టబెట్టడం, పోషక విలువల ఆధార ఎరువుల సబ్సిడీని ప్రకటించడం వల్ల ఇప్పటికే ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎరువులకు ఇచ్చే సబ్సిడీని తగ్గించడం వల్ల వాటి ధరలు మరింతగా పెరిగి రైతులకు భారంగా మారి రైతు సేద్య సంక్షోభం మరింత పెరుగుతుంది. పీ ఎం ఫసల్ బీమా పథకం వల్ల పంట నష్ట పోయిన రైతాంగం బీమా కంపెనీల నుంచి పరిహారం లభిస్తుందని, కంపెనీలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియంలో 2% రైతులు చెల్లిస్తే మిగతా ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని మెదీ ప్రభుత్వం ప్రచార బాకాలు ఊదుతూ ఉంది. ఇది ప్రచారమేనని, ఆచరణలో పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది అనటానికి నేటి బడ్జెట్ నిదర్శనం. గత బడ్జెట్ ఈ పథకానికి 12,267 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో 12, 200 కోట్ల ప్రతిపాదించారు. ఈ తగ్గింపుల వల్ల తాను చెల్లించే ప్రీమియం మొత్తాన్ని మోదీ ప్రభుత్వం తగ్గించుకుంటుంది. ఫలితంగా ప్రీమియం నమోదు లో రైతుల సంఖ్య తగ్గుతుంది. చాల మంది రైతులకు పరిహారం అందదు. గత సంవత్సరం పంట నష్ట పోయిన ఆంధ్రప్రదేశ్ రైతులకు బీమా కంపెనీల నుంచి పరిహారం అంద



లేదు. తాను చెల్లించాల్సిన ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడమే అందుకు కారణం. నేటి బడ్జెట్ లో బీమా పథకానికి నిధుల తగ్గించడం వల్ల చాలా మంది రైతులు బీమా ప్రీ కి దూరం అవుతారు. రైతాంగానికి సేద్యం చేయడం ఒక సమస్యగా ఉంటే, పంటలు అమ్ము కోవడం మరింత సమస్యగా మారింది. రైతాంగ ప్రయోజనాలు కాపాడే ప్రభుత్వం అయితే, రైతాంగం పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, బయట మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు,గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోళ్లు చేయిస్తుంది. మోడీ ప్రభుత్వం అలాంటి విధానాలు అమలు చేయడం లేదు. గిట్టుబాటు ధరల ప్రకటన నుంచి, పంటల కొనుగోళ్ల నుంచి తప్పించుకునేందుకు రైతాంగ వ్యతిరేకంగా మూడు వ్యవసాయ చట్టాలను చేసి, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ చేసిన సుదీర్ఘ పోరాటం వల్ల వాటిని రద్దు చేసినా, మరో రూపంలో అమలు చేస్తూనే ఉంది. అందులో భాగమే పంటల కొనుగోళ్లకు బడ్జెట్ లో నామ మాత్రపు కేటాయింపులు చేస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో 12 వేలు మాత్రమే కేటాయించగా, 2026-27 బడ్జెట్లో కేటాయింపు గురించి ప్రస్తావించలేదు. దాన్ని గమనిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు పంటల కొనుగోళ్ల విషయం ఏమిటన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. పంటల కొనుగోళ్లు అన్నది పూర్తిగా ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లనుంది. ఫలితంగా రైతాంగం తీవ్ర నష్టానికి గురి కానున్నారు.

రైతాంగాన్ని ఆదుకోవడం కోసమే పీ ఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని ప్రవేశ పెట్టామని, దీని ద్వారా రైతాంగానికి ముందస్తు పెట్టుబడి సంవత్సరానికి ఆరు వేలు అందిస్తామని,ఈ పథకం రైతాంగానికి ఎంతో ప్రయోజన కరమని మోదీ ప్రభుత్వం నిరంతరాయంగా ప్రచారం చేసుకుంటూ ఉన్నది. ప్రతి సంవత్సరం పెరుగుతున్న సేద్యపు ఖర్చులను గమనిస్తే మోడీ ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సహాయం రైతుల సమస్యలకు పరిష్కారం కాదు. ఈ సహాయం పెంచే ఆలోచన కూడా మోదీ ప్రభుత్వం చేయడం లేదు. పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తే, రైతులకు పెట్టుబడి సహాయమే అవసరం ఉండదు. పెట్టుబడి సహాయం కోసం ప్రతి ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో నామమాత్రపు కేటాయింపులే. గత ఆర్థిక సంవత్సరం కేటాయించిన 63,500 కోట్ల రూపాయలనే ఈ ఆర్థిక బడ్జెట్ లోనూ ప్రతిపాదించింది. ఇప్పటి కే అనర్హత పేరుతో లక్షలాది మంది రైతులను పథకం నుంచి తొలగించింది. నేటి బడ్జెట్ ప్రతిపాదనల ద్వారా ఈ పథకం నుంచి రైతుల తొలగింపు పర్వం కొనసాగుతుంది. మోదీ ప్రభుత్వ 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వ్యవసాయ రంగానికి కేటాయింపుల ప్రతిపాదనలు రైతాంగంపై దాడిగా ఉంది. ఎరువులకు ఇచ్చే సబ్సిడీని, పసల్ బీమాకు కేటాయింపులు తగ్గించడం, పీ ఎం కిసాన్ సమ్మాన్ పథకానికి నిధులు పెంచకపోవడం, పంటల కొనుగోళ్లు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించక పోవడం ఆ దాడిలో భాగమే. రైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మోదీ ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా యావత్ భారత రైతాంగం ఉద్యమించాలి.



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# క్యాన్సర్‌పై అవగాహన అవసరం

క్యాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరి 4 న ప్రపంచ క్యాన్సర్ రోజుగా గుర్తిస్తారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఎగెనెస్ట్ క్యాన్సర్ సంస్థ ప్రతి ఏటా ఫిబ్రవరి 4న క్యాన్సర్ దినోత్సవంగా జరిపి ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి ప్రారంభించారు. ఆ సంస్థలో మొత్తం 100 దేశాలు, క్యాన్సర్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న 350 సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీరందరూ మీడియా ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రమాదాన్ని ప్రచారం చేయాలని పాలనా విధానాలలో క్యాన్సర్ వ్యతిరేక చర్యలు చేపట్టేల ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవటం కూడా వారు చేస్తున్న పని. 2006 నుండి ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే గా జరుపుతూ తగిన చర్యలు చేపట్టారు. అసలు క్యాన్సర్ అంటే ఏమిటి సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించ బడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను'కంతి' ( టూమర్, tumor) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' (Oncology) అంటారు. క్యాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41, 17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్చ(WHO) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి మగవారికి కూడ రావచ్చును. శరీరములో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మము మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును. శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యు పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కోవాలి. కేన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాద వశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది.క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయ గలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్ది కేన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే కేన్సర్ల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియో థెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించ రాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు. ప్రభుత్వాలు చ ర్య ల లో భాగంగా పొగాకు వాడ క ంపై యుద్ధం ప్రకటించ డ ం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి.



సంగనబట్ల
9440595494

# సిలోన్ నుంచి శ్రీలంక వరకు..

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం సముద్రాల సరిహద్దులతో ఏర్పడిన ద్వీప దేశంగా భారత దేశ తీరానికి 50 కిమీ దూరంలో ఉన్న శ్రీలంక 04 ఫిబ్రవరిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లలో మునిగి ఉన్నది. 1972 వరకు ఈ ద్వీపాన్ని 'సిలోన్'గా పిలవడం జరిగేది. 1948లో పాక్షిక స్వాతంత్ర్యం పొంది, 22 మే 1972లో పూర్తి స్వతంత్రం పొందిన తర్వాత 1978, 04 ఫిబ్రవరి రోజున బ్రిటీష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది అధికారికంగా "ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంక"గా రూపాంతరం చెంది ప్రెసిడెన్షియల్-పార్లమెంటరీ మిశ్రమ వ్యవస్థగా తనదైన రాజ్యాంగంతో అనేక ఒడుదుడుకులు మధ్య నేడు 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని 04 ఫిబ్రవరి 2026న నిర్వహించుకుంటున్నది. పశ్చిమ ఈశాన్య భారత బెంగాల్, ఒడిసాలో నుంచి వలస వచ్చిన ఆధునిక ఇండో-ఆర్యన్ సెట్లర్స్‌ను "సింహలీస్" అని పిలవడం జరుగుతున్నది.

### శ్రీలంక వైవిధ్యభరిత జనాభా

ప్రస్తుతం 23.5 మిలియన్ల శ్రీలంక జనాభాలో 75 శాతం సింహలీస్, 11 శాతం శ్రీలంక తమిళులు, 9 శాతం వరకు ముస్లిమ్ మూర్‌లు 4 శాతం భారత తమిళుల జనాభా ఉన్నది. అత్యధిక సింహలీలు బుద్ధిస్టులుగా, తమిళులు హిందువులుగా రెండు గ్రూపుల మధ్య విభేదాలతో రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టిటిఈ, అధిక జనాభా ఉన్న సింహలీస్ (ప్రభుత్వ సహకారంతో) మధ్య వర్గ పోరు (1976-2002) కూడా జరగడం, అనేక హింసాత్మక ఘటనలు చేటు చేసుకోవడం, చివరికి ఎల్‌టిటిఈ పోరాటాలను అడ్డుకోవడం, అంతం చేయడం చూసాం. శ్రీలంక ప్రభుత్వాలు, ఆర్థిక సంక్షోభాల నడుమ కొనసాగుతున్న శ్రీలంక ప్రయాణంలో ఆహార, ఇంధన, ఔషధాల కొరతలు కూడా తోడుకావడంతో పలు ప్రజా ఉద్యమాగ్నులు ఎగిసి పడడం చూసాం.

### చరిత్ర పుటల్లో శ్రీలంక - సిలోన్:

శ్రీలంక సంస్కృతి, నాగరికతను పరిశీలిస్తే దానిపై బుద్ధిస్టుల, హిందువుల, వలస పాలకుల, జాతి వైవిధ్య, ఆధునిక ప్రపంచీకరణ ప్రభావాలు ప్రస్ఫుటంగా కనుపిస్తాయి. శ్రీలంకలో సామాజికపరంగా కులమత వ్యవస్థలు భారతదేశంలో ఉన్నట్లుగానే కనిపిస్తాయి. 16వ




శతాబ్దంలో శ్రీలంక తీరప్రాంతాలు పోర్చుగీస్ అధీనంలో, 17వ శతాబ్దంలో డచ్‌ల అధీనంలో పాలన కొనసాగింది. 1796 నుంచి ఈ ద్వీప ప్రాంతం బ్రిటీష్ అధీనంలోకి క్రమంగా మారడం, 1833లో పూర్తిగా బ్రిటీష్ పాలన పగ్గాలు పట్టి ఈ ద్వీపానికి 'సిలోన్'గా నామకరణం చేసి వలక పాలన కొనసాగించడం, వలస పాలన 1948 వరకు కొనసాగడం చూసాం. సిలోన్ ప్రాంతం 1972లో శ్రీలంక రిపబ్లిక్‌గా పేరు మారడం, 04 ఫిబ్రవరి 1948న పూర్ణ స్వతంత్ర పొందిన తనదైన రాజ్యాంగం ప్రకారం "ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంక"గా రూపాంతరం చెందడం జరిగింది. శ్రీలంక రాజధానిగా 'శ్రీ జయవర్ధనేపుర కొట్టె (కొలంబో)' పాలన కేంద్రంగా పని చేస్తున్నది. శ్రీలంక అధ్యక్షుడిని ఎన్నిక ద్వారా ఎంచుకోవడంతో పాటు 225 మంది కలిగిన లెజిస్లేటివ్ పార్లమెంట్ ద్వారా ప్రధాన మంత్రిని ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా 'అరుణ కుమార దిసనాయకె', ప్రధానిగా 'హరిణి అమరసూర్య'లు సేవలు అందిస్తున్నారు. గతంలో దీర్ఘకాలం పాటు శ్రీలంకకు పెద్దన్న వలె నిలిచింది మన భారత్. ప్రస్తుత డిజిటల్ యుగంలో మారుతున్న సమీకరణాల ఆధారంగా ఆర్థిక చేయూత బూచీ చూపుతూ చైనా నాయకత్వం శ్రీలంకను మచ్చిక చేసుకోవడం చూస్తున్నాం. 04 ఫిబ్రవరి 2026న శ్రీలంక జురుపుకుంటున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవం-2026 ఇతివృత్తంగా "శ్రీలంకను నిర్మించుకుందాం (లెటజ్ బిల్డ్ శ్రీలంక)" అనే అంశాన్ని తీసుకొని ఘనంగా నిర్వహించుకోవడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో రాజధాని కేంద్రంగా జాతీయ పతా కాన్ని ఎగిరేయడం, ఆకర్షణీయ రక్షణ దళాల కవాతులు, సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ ఘన కీర్తిని చాటే ప్రదర్శనలు లాంటివని అనేకం నిర్వహిస్తారు. అనేక సమ స్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక రానున్న రోజుల్లో శాంతియుతంగా ప్రగతి పథాన స్థిరంగా అడుగులు వేయాలని కోరుకుందాం, మన పొరుగు దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

## చంద్రబాబు పాలనకు జగన్ పాలనకు పొంతన లేదు

- టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారు
- క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు



**అమరావతి, ఫిబ్రవరి 3:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. గతంలో 'బోసు డీకే' అనే పదానికి బూతు సృష్టించి టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారని గుర్తు చేశారు. ఆ పదానికి తన కార్యకర్తలకు బీపీలు వచ్చాయని జగన్ సమర్థించుకున్నారని మంత్రి తెలిపారు.

వైసీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తుంటే కూడా తాము అధికారంలో ఉన్నప్పటికీ సంయమనం పాటించాలని సూచిస్తున్నారని హోంమంత్రి అన్నారు. హింసను, విద్వేషాన్ని ప్రోత్సహించి ప్రజలను జగన్ భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలు రెచ్చిపోతే ఏనాడైనా తప్పని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఒక క్రిమినల్ ఆలోచనలకు, విజనరీ ఆలోచనలకు అర్థం చేసుకున్నారని అన్నారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పు చేయాలనే ఆలోచన రావాలంటేనే భయపడేలా రాజకీయ రౌడీలకు పోలీసు ట్రీట్మెంట్ ఇస్తామని మంత్రి అనిత వార్నింగ్ ఇచ్చారు.

# దొంగతనాలకు పాల్పడే ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఇద్దరు
- రూ.36 లక్షల దొంగ సొత్తు స్వాధీనం



**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** గత సంవత్సరం డిసెంబర్ నెల 21 వ తేది న యర్రగుంట్ల మండలం, చిలమకూరు గ్రామంలో నివాసం ఉంటూ, నాలుగు రోడ్ల కూడలిలో కిరాణ దుకాణం నడుపుకొంటున్న దుద్దే రమేష్ శెట్టి ఇంటి నందు అక్రమంగా ప్రవేశించి బీరువా లో ఉన్న బంగారు ఆభరణాలు దొంగలించిన దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి దొంగ సొత్తు ను ఎర్రగుంట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వై. ఎస్ ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ మీడియా కు వివరాలు తెలిపారు. మంగళ వారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సుమారు 210 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 60 వేలు విలువ గల ఐఫోన్, నేరానికి ఉపయోగించిన వస్తువుల ఒక కట్టింగ్ మిషన్లు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, కేసులో ఇద్దరు ముద్దాయిలు మరియు ఇద్దరు బాల నేరస్థులు చిలమకూరు గ్రామం సిర్రాజుపల్లె రోడ్డులో ఉన్నటువంటి సప్లయర్స్ దుకాణం ఉన్నటు వంటి యేట్టి. చంద్రపాల్ కుమారుడు యేట్టి విజయ్ పాల్, షేక్ మహబూబ్ కుమారుడు షేక్ గైబు వల్లిని అరెస్టు చేశారని వివరించారు.

ముద్దాయిలు చదువు మానేసి, చెడు వ్యసనాలకు బానిసై జులాయి గా తిరుగుతూ జన సంచారం తక్కువ ఉన్న ప్రాంతాలలో గత కొంత కాలంగా గ్రామం నందు చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉన్నట్లు, అనంతరం ముద్దాయిలు ముదస్తు పథకంలో భాగంగా కుట్ర పన్ని గత కొద్ది రోజులుగా నాలుగు రోడ్ల కూడలిలో కిరాణ దుకాణం నడుపుకొంటున్న దుద్దే రమేష్ శెట్టి, కుటుంబ సభ్యుల కదలికలు మరియు ఇంటిని గమనిస్తూ, పిర్యాది అంగడి వద్ద ఉండగా, సాయంత్రం సమయంలో పిర్యాది బంధువులు ఇంటికి రాగా, వారితో పాటు పిర్యాది అమ్మ ఊరికి వెళ్ళగా, పిర్యాది భార్య ఇంటికి తాళం వేసి అంగడి వద్దకు వెళ్ళగా, గత కొన్ని రోజుల నుండి గమనిస్తున్న వీరు ఇదే అదునుగా భావించి గత సంవత్సరం డిసెంబర్ నెల 21 వ తేది న రాత్రి సుమారు 7.00 నుండి 7.30 గంటల సమయంలో చిలమకూరు గ్రామం నందు రోడ్డు పై ఒక బాల నేరస్తుడు సదరు ఇంటి యజమానుల మరియు సదరు ఇంటి వైపు వచ్చే వారి కదలికలు గమనిస్తూ ఉండగా, పైన తెలిపిన ఇద్దరు ముద్దాయిలు



మరియు మరొక బాల నేరస్థుడు పిర్యాది ఇంటి తలుపుల గడియను బండలను కట్ చేసే కట్టింగ్ మిషేన్ ఇంటి బయట ఉన్న కరెంట్ ప్లగ్ ద్వార కరెంట్ సప్లై ఇచ్చి, దాని ద్వార కట్టింగ్ చేసి, ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న సుమారు 210 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించారని తెలిపారు. కాగా కేసు విచారణకు పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి రాబడిన సమాచారంతో వీరిని యర్రగుంట్ల మండలం, ముద్దనూరు – కడప మెయిన్ రోడ్డు పై నిడ్జి గ్రామం దాటినా తరువాత మాలేపాడు క్రాస్ వద్ద సోమవారం వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి చోరి సొత్తు రికవరీ చేశారని వివరించారు. కడప ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఈ పోలీసు బృందాలకు రివార్డ్ లు ఇచ్చి అభినందించారు.

## పెద్దపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందనక్కర్లేదు

- మంత్రి కందుల దుర్గేష్
- రాజానగరం సమీపంలో సంచరిస్తున్న పెద్దపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మరంగా గాలింపు ప్రయత్నాలు చేస్తోందని వెల్లడి
- బోనులు, ట్రాప్ కెమెరాలు, డ్రోన్లతో అటవీశాఖ అప్రమత్తంగా ఉందని సూచన
- ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత వెల్లడి

**విజయవాడ ఫిబ్రవరి 3 వుదయం న్యూస్ బ్యూరో:** – తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలో పెద్ద పులి సంచారంపై ఆందోళన అక్కర్లేదని, పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాప్, డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం కేబినెట్ అనంతరం మంత్రి దుర్గేష్ ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారితో ఫోన్ లో మాట్లాడారు. పులి సంచారానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. గత కొన్ని రోజులుగా తొర్రేడు, సీతానగరం సమీపంలో పులి సంచరిస్తుందని, దాని ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని అధికారి చెప్పారన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒకసారి పులి సంచారం చేసిందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. తగిన జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని తెలిపారు.



అటవీ శాఖ పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సందర్భంగా పెద్దపులి పట్టుబడేంత వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని, రాత్రి సమయాల్లో పశువుల పాక చుట్టూ ఎక్కువ కాంతినిచ్చే దీపాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరితగతిన పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రి దుర్గేష్ ప్రజలకు భరోసానిచ్చారు.



## అంతర్-రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం

**విజయవాడ ఫిబ్రవరి 3 వుదయం న్యూస్ బ్యూరో:** –కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న, మై భారత్ (మై భారత్) కార్యక్రమం భాగంగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్ ఆధ్వర్యంలో అంతర్–రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం (ఇంటర్ – స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం) 3 నుంచి 7 వరకు ఐదు రోజుల పాటు జరుగనుంది. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా స్టేట్ యన్.యస్.యస్ ఆఫీసర్ డా.యమ్.సుధాకర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల యువత మధ్య సాంస్కృతిక అవగాహన, జాతీయ సమగ్రతను మరియు 'ఏకభారతం–శ్రేష్ఠ భారతం' స్ఫూర్తిని పెంపొందించడానికి రూపొందించబడింది. ఈ కార్యక్రమం ద్వారా యువకులు వేరే రాష్ట్రాల సంస్కృతులు, సాంప్రదాయాలు, జీవనశైలి మరియు సామాజిక–ఆర్థిక అంశాలను ప్రత్యక్షంగా అనుభవిస్తారు అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి గారు మాట్లాడుతూ కేరళ రాష్ట్ర నుండి 37 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు, వారికి ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సామాజిక జీవన విధానం గురించి అవగాహన పొందుతారు . కేరళ రాష్ట్ర నుండి వచ్చిన యువతతో పరస్పర సంభాషణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాపులు, చర్చా వేదికల ద్వారా జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోనున్నారు , మరియు ఆంధ్రలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత గల ప్రాంతాలను సందర్శించి, రాష్ట్ర అభివృద్ధి నమూనాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలు విధానాలపై అవగాహన పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి భావన, భిన్నత్వం లో ఏకత్వం అనే ఆలోచన మరింత బలపడిందని, ఇలాంటి కార్యక్రమాలు యువతను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో , ఎన్టీఆర్ జిల్లా యన్.యస్.యస్. ఆఫీసర్ డా.రమేష్ , ఎ.పి.యస్.యస్.డి.సి. అసిస్టెంట్ యన్.యస్.యస్. యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, శ్రీ.శీలం ఉమా మహేశ్వర రెడ్డి , కేరళ రాష్ట్ర విద్యార్థిని , విద్యార్థులు మరియు కళాశాల యన్.యస్.యస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## టీడీపీ ఎంపీలకు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు

- హాజరైన ఎంపీలు కేశినేని, వేమిరెడ్డి , తెన్నేటి, మాగుంటి, బైరెడ్డి
- తొలిసారి సభకు వచ్చిన వారికి ఎక్కువ అవకాశం ఇవ్వాలని ఎంపీలు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన లోక సభ స్పీకర్ ఓంబిర్లా

**విజయవాడ ఫిబ్రవరి 3 వుదయం న్యూస్ బ్యూరో:** – ఢిల్లీ లోక సభ స్పీకర్ ఓంబిర్లా పార్లమెంట్ లోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం టిడిపి ఎంపీలకు ఇచ్చిన తేనీటి విందుకు బాపట్ల ఎంపీ లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి ప్రసాద్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఒంగోలు ఎంపీ మాగుంటి శ్రీనివాసులు రెడ్డి, నంధ్యాల ఎంపీ బైరెడ్డి శబరి లతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓంబిర్లాను టిడిపి ఎంపీలు శాలువాతో ఘనంగా సత్కరించారు.

అనంతరం లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా టిడిపి ఎంపీలతో సమావేశమై వ్యక్తిగతంగా వారితో వివిధ అంశాలపై చర్చించారు. అలాగే సభా కార్యకలాపాలు ఇంకా బాగా జరి



గేందుకు ఎంపీ ల వద్ద నుంచి స్పీకర్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. తొలిసారి పార్లమెంట్ కి వచ్చిన ఎంపీల అనుభవాలు అడగటంతో పాటు, తమ వైపు నుంచి కావాల్సిన మద్దతు గురించి అడిగి తెలుసుకున్నారు. తొలిసారి లోక్ సభకు వచ్చిన వారికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని తామంతా కలిసి చేసిన విజ్ఞప్తికి స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఆశా వర్కర్స్ యూనియన్

**ఆత్మకూరు రూరల్ అనంతసాగరం (వుదయం ప్రతినిధి)** మూడో తేదీ ఆశా డే సందర్భంగా ఫిబ్రవరి 12వ తేదీ దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొంటున్నారని ముందస్తుగా ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల కు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 28వేల రూపాయలు ఇవ్వాలి నిరసన తెలిపినారు. ఫిబ్రవరి 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వసంత ,జ్యోతి మరియు ఆశా వర్కర్స్ అందరూ పాల్గొనారు.

## ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ ఫిబ్రవరి మూడు వుదయం న్యూస్ బ్యూరో:** – తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు ప్రమాద భీమా పాలసీని రాష్ట్రంలో అమలుకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ కరివేపాకుతోట ప్రాంతంలో నివాసముండే వాకా వసంతరావు ఇటీవల ప్రమాదంలో మరణించారు. వసంతరావుకు టీడీపీలో సభ్యత్వం ఉండటం వల్ల రూ.5 లక్షల విలువైన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. ఆ చెక్కును తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా వసంతరావు ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు అందచేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్త వాకా వసంతరావు ప్రమాదానికి గురై మరణించడం చాలా బాధాకరమని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని విధంగా పార్టీలో సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పాలసీని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మొదటి సారిగా విదేశాల్లో ఉన్న విధానాలను మన రాష్ట్రంలో అమలు చేశారన్నారు. కుటుంబంలో వ్యక్తి మరణించడం వల్ల ఆ కుటుంబం అన్ని విధాలుగా ఇబ్బందులు పడతారని ఆలోచించి నారా లోకేష్ ఈ పాలసీని అమలు చేయడం వల్ల కార్యకర్తలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఆ ప్రమాద బీమా స్కీమ్ ద్వారానే ఇప్పుడు వసంతరావు కుటుంబసభ్యులకు రూ.5.00 లక్షల మంజూరు చెక్కును అందచేస్తున్నామన్నారు. వసంతరావు కుమార్తెకు ఇటీవల జరిగిన వైద్య చికిత్సలకు సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారని, ఈ విషయాన్ని తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలియజేయడంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా అత్యధికంగా నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.కార్పోరేటర్ పొట్లూరి సాయిబాబు మాట్లాడుతూ ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నష్టం జరిగిన కుటుంబ సభ్యులకు అండగా ఉండేందుకు నారా లోకేష్ ప్రవేశపెట్టిన ఈ ప్రమాద బీమా అండగా నిలుస్తుందన్నారు. పార్టీలో సభ్యత్వం ఉన్న వారికి ప్రమాదం జరిగిన వెంటనే పార్టీ నాయకులకు తెలియజేయాలని, పార్టీ నాయకులే అన్ని పనులు పూర్తి చేసి నగదును మరణించిన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్క కార్యకర్త తప్పనిసరిగా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో అబ్దుల్ కరీమ్, ముమ్మనేని ప్రసాద్, పేరేపి ఈశ్వర్, మాదల రాజ్యలక్ష్మి , అబ్దుల్ ఖాలిక్, యలమంచిలి రవీంద్ర, నిస్సార్ ఉరిమి, శాయన బుజ్జి, మేదరమెట్ల నారాయణ, పఠాన్ హయత్ ఖాన్, రంగరావు, పడాల గంగాధర్, బాలు పాల్గొన్నారు.

## పేడ దిబ్బలు... సెప్టిక్ ట్యాంకుల నడుమ విద్యార్థుల చదువులు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాలపై తల్లిదండ్రుల పెదవివిరుపు



**నాయుడుపేట, ఫిబ్రవరి 3, వుదయం ప్రతినిధి:** పేడ దిబ్బలు... సెప్టిక్ ట్యాంకుల దుర్గంధపు దుర్వాసనలు నడుమ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులు కొనసాగుతున్న విషయం తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం అన్నమేడు ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంటుంది. అన్నమేడు ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బాలురు దాదాపు 40 మంది బాలికలు దాదాపు 49 మంది చదువుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పాఠశాల తరగతి గదుల పక్కనే సెప్టిక్ ట్యాంకులు మరియు పేడదిబ్బలు ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్గంధపు దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. అనేక మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని వారు వాపోయారు. సెప్టిక్ ట్యాంకులు మరియు పేడ దిబ్బల వల్ల వచ్చే



దుర్గంధపు దుర్వాసనతో విద్యార్థులు అస్వస్థతకు గురై అనేక సందర్భాలలో ఆసుపత్రి పాలైనట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పర్యవేక్షించాల్సిన మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణతో వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు వాపోడం విశేషం. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అన్నమేడు ప్రత్యేక ప్రాథమిక పాఠశాల విషయమై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మేరా భారత్ మహాన్ పురస్కారం

**కడప, ఫిబ్రవరి: 03, (వుదయం ప్రతినిధి)** కడప జిల్లా సిద్ధవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన నటరాజ కులుకు చెక్క భజన గురువు వరికుంట్ల సాయికృష్ణ పేద కుటుంబంలో జన్మించి కళాలే తన సర్వం అంటూ చెక్క భజన లో మంచి గురువు గా గుర్తింపు పొందారు. ప్రకాశం జిల్లా మార్కాపురం గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 77వ గణతంత్రం దినోత్సవం సందర్భంగా మేరా భారత్ మహన్ పురస్కారం చెక్క భజన గురువు వరికుంట్ల సాయికృష్ణ అందుకున్నారు. గురువు సాయి కృష్ణ చెక్క భజన, కోలాటం , జడకోపు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకమైన కళా ను నేర్చుకుని రాష్ట్ర అవార్డు గ్రహీత సగిలి పుల్లయ్య దగ్గర చెక్క భజన నేర్చుకుని తను కూడా ఒక గురువు గా ఎదగాలని కష్టపడి చెక్కభజన నేర్చుకొని గురువుగా



ఎదిగారు తన చెక్క భజన లో ఎంతోమంది శిష్యులు కళాకారులను తయారు చేసినటు వంటి గురువు సాయి కృష్ణ చెక్క భజన లో, వాగ్దేవి సంగీత నృత్య కళాశాల వారి నుండి ఉత్తమ నంది అవార్డు పురస్కారమును కూడా పొందారు ఇలా ఎన్నో అవార్డులను అందుకున్నారు తన గ్రామంలో శిష్యులు, పెద్దలు ,కళాకారులు అందరూ ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థుల కోసం ఆర్ఎస్ఎఫ్ పోరాటాలు అభినందనీయం

టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్

**కడప, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి)** విద్యార్థుల సమస్యలపై ఆర్ఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాలు అభినందనీయం టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ గారు అన్నారు. మంగళవారం కడప టిడిపి కార్యాలయంలో ఆర్ఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన నిలబడి నిరంతరం విద్యార్థుల కోసం మాట్లాడడం అభినందనీయం. అన్నారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నరన్నారు. క్రమశిక్షణ మార్గంలో ఉండేటట్లు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా ఆర్ఎస్ఎఫ్ అడుగుతున్న కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం ఈ ప్రాంతం యొక్క అభివృద్ధితో ముడిపడిన అంశం అని దాని పైన కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ జనార్ధన్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు జియా, ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం కాపుల (బలిజ) జోలికి వస్తే ఖబర్దార్

వైఎస్ఆర్సీపీ యువజన విభాగం నగర అధ్యక్షులు గుంటి నాగేంద్ర

**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం కాపుల బలిజ జోలికి వస్తే ఊరుకోమంటూ వైఎస్ఆర్సిపి యువజన విభాగం నగర అధ్యక్షులు గుంటి నాగేంద్ర ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. మంగళవారం కడపలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజు నుంచి టీడీపీ శ్రేణులు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారన్నారు. ఈ దాడులు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, ఆటవిక రాజ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. వంగవీటి రంగా హత్య, ముద్రగడ పద్మనాభం కుటుంబంపై దాడి తర్వాత ప్రభుత్వాలు ఏమయ్యాయో గుర్తుంచుకోవాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేసేలా ఉన్న ఫ్లెక్సీని తొలగించేందుకు వెళ్లిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై వందమంది గూండాలు కర్రలు, రాడ్లు, మారణాయుధాలతో హత్యాయత్నం చేస్తే,అంబటిపైనే తిరుగు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కాపుల ఓట్లతో గద్దెనెక్కి వారిపైనే దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఇది కాపు జాతిపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. ఒక కాపు నేతపై ఇంతలా బరితెగించి దాడి చేస్తుంటే ప్రశ్నిస్తా నన్న పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయన కాపు కులాన్ని చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి నేతలకు ఒక చట్టం, వైఎస్సార్‌సీపీ నాయకులకు మరో చట్టం అమలవుతోందని ఆరోపించారు. ఈ దాడులు పునరావృతమైతే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి నగర ఉపాధ్యక్షులు దాసరి శివ, వైఎస్ఆర్సిపి గండి క్షేత్ర ఆలయ మాజీ చైర్మన్ కృష్ణ తేజ, వైఎస్ఆర్టీపీ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ రాయల్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి దత్త, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మెదడు వ్యాధిగ్రస్తునికి డాక్టర్ ప్రణీత్ సాయహస్తం

**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి)** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తేజేష్ అనే బాలుడు చిన్ననాటి నుంచే మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ వస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు అధినేత, ఎస్ వి పి ప్రజావైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్ , 10 నెలలుగా ప్రతినెలా తేజేష్‌కు అవసరమైన మందులను అందిస్తూ మానవతా సేవలో నిలుస్తున్నారు. సోమవారం ఆయన స్వయంగా తేజేష్ కి రెండు నెలలకు సరిపడా



మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ సీజర్ సిండ్రోమ్ విత్ ఎన్సిఫలోపతి కారణంగా మెదడు అభివృద్ధి నెమ్మదిగా జరిగి, మూర్ఛ వంటి సమస్యలు వస్తాయి. దీనికి శాశ్వత చికిత్స లేకపోయినా, నిరంతర మందుల ద్వారా నియంత్రణ సాధ్యమవుతుంది అన్నారు.




## తహసీల్దార్ కార్యాలయాన్ని శాసిస్తున్న షాడో అధికారులు , ప్రైవేటు వ్యక్తులు!?

**నాయుడుపేట, ఫిబ్రవరి 3, వుదయం ప్రతినిధి:** ఓ తహసిల్దార్ కార్యాలయాన్ని ఇటు షాడో అధికారులు అటు ప్రైవేటు వ్యక్తులు శాసిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం తహసిల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్నట్లు సమాచారం. నాయుడుపేట తాహసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది కిందిస్థాయి ఉద్యోగుల బంధువులు షాడో అధికారులుగా అవతారమెత్తి కార్యాలయంలో అనధికారిక పనులను చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు కార్యాలయంలో పనిచేసే కొంతమంది అధికారులు ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని ప్రజల నుంచి అనధికారిక వసూళ్లు చేయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రతి పనికి కార్యాలయంలో మామూళ్ళను ముట్ట చెపితే తప్ప ఏ దస్త్రము కదలడం లేదని ప్రజలు వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన తహసిల్దార్ షాడో అధికారులకు మరియు ప్రైవేటు వ్యక్తులకు పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. తాహసిల్దార్ కార్యాలయంలో భూమి రికార్డులను మార్చే ప్రక్రియలు ఇటు షాడో అధికారులు అటు ప్రైవేటు వ్యక్తులు కర్ర పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ జోరుగా జరుగుతున్న క్రమంలో చీకటి సమయాలలో కార్యాలయంలో భూమి రికార్డుల మార్పులలో భారీగా అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో తహసిల్దార్ కార్యాలయంలో సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు అందని ద్రాక్షాలా ఉన్నాయని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నాయుడుపేట తహసిల్దార్ కార్యాలయంపై శాఖా పరమైన విచారణ చేపట్టి షాడో అధికారులు మరియు ప్రైవేట్ వ్యక్తుల ఆగడాల నుంచి సామాన్య ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## విష సంస్కృతిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు

మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి

**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి)** కూటమి నాయకులు చేసిన తప్పులను ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై ఇలాంటి దాడులు చేస్తూ కేసులు నమోదు చేయించి ఇబ్బందులకు గురిచేస్తూ విషసంస్కృతిని కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రజల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామిలు చేయాలని కోరిన నాయకుల దగ్గర నుండి తప్పుడు ఆరోపణలు ప్రశ్నించిన వారి వరకు ప్రతి ఒక్కరిని టార్గెట్ చేస్తూ దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం లాంటివి చేస్తున్నారన్నారు. జిల్లాలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నివాసంపై జరిగిన దాడితో మొదలు పెడితే మాజీ మంత్రులు విడదల రజని, అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వైఎస్సార్సీపీ ప్రముఖనాయకులతో పాటు కార్యకర్తలను ఎంతగానో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించిన వారి నోళ్లు మూయించి కూటమి ప్రభుత్వం



ఏం సాధించాలనుకుంటుందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ విషయంలో ఇప్పటి వరకు కూటమి నాయకులకు సిబిఐ రిపోర్టుతో తమ తప్పు గ్రహించారని, దీని నుండి రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకు దాడులు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ కు తెరలేపుతున్నారన్నారు. ఇలాంటి దాడులు చూస్తుంటే ప్రజలకు ఈ రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి రాజ్యాంగం నడుస్తుందా లేక కూటమి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందా అని అనుకునే పరిస్థితుల్లోకి వెళ్లిపోయారని అన్నారు. వైఎస్సార్సీపీ నాయకులపై ఇలాంటి చర్యలు కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

## నేడు వెటర్నరీ కాలేజీలో డాగ్ షో

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** మండలంలోని గోపవరం పంచాయతీ లో వున్న శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఇండియన్ సొసైటీ ఆఫ్ యానిమల్ ప్రొడక్షన్ & మేనేజ్‌మెంట్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, ప్రొద్దుటూరులో ఫిబ్రవరి 4వ తేదీ బుధవారం వర్క్‌షాప్ కమ్ డాగ్ షో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కళాశాల ప్రిన్సిపాల్, అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాద్, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ డి.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి & ప్రిసైడింగ్ అధికారి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తిరుపతి వెటర్నరీ సైన్స్ ఫ్యాకల్టీ, డీన్ డాక్టర్ సురేష్ కుమార్, గౌరవ అతిథిగా వాసుదేవ్ చంద్రకర్ కామధేను విశ్వవిద్యాలయ, ఛత్తీస్‌గఢ్, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ ఎల్.గీత ప్రియ, విశిష్ట అతిథిగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ & హెడ్ బఫెలో రీసెర్చ్ స్టేషన్, వి.ఆర్. గూడెం, డా.కె.ఆనందరావు ప్రఖ్యాత న్యాయనిర్ణేతలు గన్నవరం ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ప్రొఫెసర్ & హెడ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్ డాక్టర్ సి వెంకట శేషయ్య, కడప ఐవిస్డిపి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.రవణ రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

## వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజాకి శుభాకాంక్షలు



**కడప, ఫిబ్రవరి 03, (వుదయం ప్రతినిధి)** రాజ మ ండ్రి స్వగృహం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ని కలసిన వైయస్సార్ కడప జిల్లా యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ కుంట్లపల్లి వెంకటేశ్వర రెడ్డి అయన కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# అభ్యర్థుల చేతికి 'బీఫామ్'

- ఏదులాపురం మున్సిపల్ పోరులో 'హస్తం' దూకుడు
- బీ-ఫామ్‌లు అందజేసి... అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం , ఫిబ్రవరి 3(వుదయం ):**

ఏదులాపురం : ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం అభ్యర్థుల చేతికి బీఫామ్ లు అందజేశారు. దీంతో మున్సిపల్ కోటపై 'హస్తం' జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రచార పర్వం ఊపందుకుంది.

**గెలుపే లక్ష్యంగా గడప గడపకూ..**

బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు నామినేషన్లు సమర్పించాలని మంత్రి సూచించారు. "అధికారికంగా బీఫామ్‌లు అందాయి.. ప్రభుత్వ ప్రజారంజక పాలనను, అమలు చేస్తున్న గ్యారంటీలను వివరించి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

**క్లీన్ స్వీప్ టార్గెట్!**

వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఏదులాపురంలోని అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రి చేతుల మీదుగా బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచార క్షేత్రంలోకి అడుగుపెట్టారు.

# స్టీల్ మినరల్ వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు చర్యలు

**సింగరేణి సహకారంతో ఏర్పాటు చేసిన ప్లాంట్ రిపేర్‌కు రూ.30 వేల వ్యయం అంచనా**
**ప్రజల కోసం తిరిగి అందుబాటులోకి తేవాలని ఎర్రబెల్లి సర్పంచ్ కృష్ణవేణి నరేష్ రావు ఆదేశం**

**మంథని , (వుదయం ప్రతినిధి):**



మంథని మండలం దుబ్బపల్లి గ్రామపంచాయతీలో మూడు సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన స్టీల్ మినరల్ వాటర్ ప్లాంట్ కొద్ది కాలం పనిచేసిన అనంతరం సాంకేతిక లోపాలతో నిలిచిపోయింది. అప్పటి సర్పంచ్ ఎర్రవెల్లి నరేష్ రావుతో పాటు అప్పటి పాలకవర్గ సభ్యులు సింగరేణి అధికారులపై ఒత్తిడి చేసి ఈ వాటర్ ప్లాంట్‌ను గ్రామానికి తీసుకురావడం జరిగింది.ప్రారంభంలో కొంతకాలం ప్లాంట్ సక్రమంగా పనిచేసినప్పటికీ, అనంతరం రిపేర్ అవసరం రావడంతో పూర్తిగా నిలిచిపోయింది. అప్పటి నుంచి గ్రామ ప్రజలు మినరల్ వాటర్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెకానిక్ పరిశీలన - రూ.30 వేల వ్యయం అంచనాఇటీవల నూతనంగా ఎన్నికైన దుబ్బపల్లి సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్ రావు బాధ్యతలు చేపట్టిన వెంటనే, నిలిచిపోయిన వాటర్ ప్లాంట్ అంశంపై దృష్టి సారించారు. ప్లాంట్‌కు సంబంధించిన మెకానిక్‌ను పిలిపించి పరిశీలన చేయించగా, రైన్ వాల్వ్స్ మరియు ఫిల్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని మెకానిక్ తెలిపారు.

**సింగరేణి సహకారంతో త్వరిత చర్యలు**

ఈ విషయాన్ని సర్పంచ్ కృష్ణవేణి వెంటనే సింగరేణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సాధ్యమైనంత త్వరగా సహకారంతో రిపేర్ చేయించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అయితే ఆలస్యం జరిగితే, గ్రామపంచాయతీ నిధులు వెచ్చించి అయినా సరే ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి దుబ్బపల్లి ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని సూచించినట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ స్పష్టం చేయడంతో, వాటర్ ప్లాంట్ పునరుద్ధరణపై గ్రామంలో ఆశలు నెలకొన్నాయి.

# కోదాడ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య హననం



**ఏకగ్రీవ ఎన్నికలు రద్దు చేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలి బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, ఫిబ్రవరి 3 (వుదయం):**

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 11, 21, 31 వార్డుల్లో ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏకగ్రీవ ఎన్నికలు నిర్వహించారని, ఈ నేపథ్యంలో కోదాడలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా రద్దు చేసి, స్వేచ్ఛాయుత వాతావరణంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మొత్తం 35 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థులను ఎంపిక చేసి బీ-ఫారమ్‌లు అందజేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దురుద్దేశంతో కొన్ని వార్డుల్లో ఏకగ్రీవాలు సాధించేందుకు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా 11వ వార్డులో బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థి డి. గీత సత్య ప్రసాద్‌ను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసి, చివరికి కిడ్నాప్ చేసి నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని తెలిపారు. అలాగే అదే వార్డులో మరో మహిళా అభ్యర్థిని ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా నామినేషన్ ఉపసంహరణ చేయించిన ఘటన ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచిందన్నారు. ఈ సందర్భంలో ఎన్నికల అధికారులు కూడా తమ బాధ్యతను విస్మరించి కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలికారని విమర్శించారు. ఇదే తరహాలో 21వ, 31వ వార్డుల్లో కూడా ఇతర పార్టీల అభ్యర్థులను బెదిరించి ఏకగ్రీవ ఎన్నికలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ అక్రమాలకు నిరసనగా కోదాడ పట్టణ ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారని, తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని, తక్షణమే ఈ ఎన్నికలను రద్దు చేసి, పూర్తి భద్రతతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఇందుకు బాధ్యులైన అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గుర్తుల కేటాయింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

**నిబంధనల ప్రకారం అభ్యర్థులకు గుర్తులను కేటాయించాలి,**
**తెలుగు అక్షర క్రమం ఆధారంగానే అభ్యర్థుల క్రమ సంఖ్య ఉండేలా చూసుకోవాలి,**
**జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులను అభ్యర్థుల పేర్లలోని తెలుగు అక్షరమాల క్రమానుసారంగా కేటాయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం నాగర్ కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా, వార్డుల వారీగా దాఖలైన నామినేషన్ల ఆధారంగా రూపొందించిన అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కలెక్టర్‌కు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థుల పేర్ల ఆధారంగా తెలుగు అక్షరమాల క్రమంలో తయారు చేసిన జాబితాలను, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తుల కేటాయింపు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నామినేషన్ ఉపసంహరణ, గుర్తుల కేటాయింపుపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు స్వయంగా హాజరై ఉపసంహరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతినిధి లేదా ఏజెంట్ ద్వారా ఉపసంహరణ పత్రాలు అందజేసిన సందర్భంలో తప్పనిసరిగా సంబంధిత అభ్యర్థికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవడంతో పాటు పత్రాలపై ఉన్న సంతకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా జాతీయ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల అధికారిక బీఫారమ్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆయా పార్టీలు మొదటగా వెల్లడించిన ఫారం-ఏ ఆధారంగానే బీఫారమ్‌లు సమర్పించబడ్డాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, ఎన్నికల విధులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డీవో సురేష్, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నాగర్ కర్నూల్ తహసిల్దార్ తబితా రాణి, వివిధ వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.





# DCCB మేనేజర్ రూపవతికి మాజీ వైస్ ఎంపీపీ ఘన సన్మానం

**దమ్మపేట, ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేటలోడి.సి.సి బ్యాంక్ మేనేజర్‌గా నియమితులైన శ్రీమతి రూపవతి ని, మాజీ వైస్ యం.పి.పి దారా మల్లిఖర్జునరావు, కోపరేట్ డైరెక్టర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిన్న శెట్టి సత్యనారాయణ, (చిన్న బాబు )గోపవరపు వంశీ, దారా పాపారావు సన్మానించడం జరిగింది. వారి సేవలు మరింత విజయవంతంగా కొనసాగాలని మనస్పూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు

# మాజీ ఎమ్మెల్యే తాటి వినూత్న ప్రచారం

**అశ్వరావుపేట, ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి ):**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో 5వ వార్డ్ అభ్యర్థి ఎండి రెహానా బేగంకు మద్దతుగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు ప్రజలతో మమేకమయ్యారు. ప్రచారంలో భాగంగా విన్నుతుంగా ఒక ఇంటి వద్దకు వెళ్లిన ఆయన కట్టెపులను కొడుతూ ఓట్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# క్యాతనపల్లి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేస్తాం

- 16,20 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):**



క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎన్నికల బరిలో 16 వ వార్డ్ అభ్యర్థిగా జి కృపానందం(గ్యాస్ నాని),20 వ వార్డ్ బరిలో మంద వేణుగోపాల్ లు ఉన్నారు.స్థానికంగా బిఆర్ఎస్ పార్టీకి ఎక్కువ ఓటు బ్యాంక్ ఉన్న నేపథ్యంలో ఇక్కడ మున్సిపాలిటీ గద్దె పై గులాబీ జెండా ఎగిరేస్తాం అని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బిఆర్ఎస్,సిపిఐ పార్టీ కలిసి మునిసిపాలిటీలో పోటీ చేస్తున్న నేపథ్యంలో ప్రచారంలో సైతం ముందు నిలుస్తున్నారు. తమను గెలిపిస్తే వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తమ పై పెట్టుకున్నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తామని కౌన్సిలర్ అభ్యర్థులు నాని, మంద వేణుగోపాల్ లు అంటున్నారు.



# మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

**సూర్యాపేట ఫిబ్రవరి 3(వుదయం):**

మున్సిపాలిటీ ఎన్నికలను శాంతియుతంగా, స్వచ్ఛంగా నిర్వహించేందుకు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీషీటర్లు, ట్రబుల్ మేకర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని డీజీపీ ఆదేశించారు. ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజున కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని, విజేత ర్యాలీలపై ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పాల్గొని, జిల్లాలో చేపడుతున్న బందోబస్తు ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, చెక్‌పోస్టుల తనిఖీలు, ప్రలోభాల నివారణ, మద్యం అమ్మకాలపై నిఘా చర్యలను వివరించారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, డీజేలు, భానా సంచాపై నిషేధం అమల్లో ఉందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సీఐలు వెంకటయ్య, రామారావు, ఎలక్షన్స్ సెల్ ఎస్ఐలు రాంబాబు, అనిల్ రెడ్డి, పోలీస్ ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ వార్డు అభ్యర్థులకు బిఫామ్ లు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి):**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మరియు సీపీఎం బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించి వారికీ బి ఫార్మ్స్ అందించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

వార్డు - 01 : మరుతి సూరిబాబు (బిఆర్ఎస్)
వార్డు - 02 : వీరపనేని రాధిక (బిఆర్ఎస్)
వార్డు - 03 : కుసంపూడి మాధురి (బిఆర్ఎస్)
వార్డు - 04 : షేక్ కరీముల్లా (బిఆర్ఎస్)
వార్డు - 05 : కొనేటి అనురాధ (బిఆర్ఎస్)
వార్డు - 06 : చిన్నంశెట్టి రాజ్యలక్ష్మి (బిఆర్ఎస్)
వార్డు - 07 : రామిశెట్టి రాజేశ్వరి (బిఆర్ఎస్)
వార్డు - 08 : షేక్ చాంద్ పాషా (బిఆర్ఎస్)
వార్డు - 09 : పూజాల రవి (బిఆర్ఎస్)
వార్డు - 10 : అరేపుల ఆనంద రావు (బిఆర్ఎస్)
వార్డు - 11 : జాన్ మొహమ్మద్ మిర్జా (బిఆర్ఎస్)
వార్డు - 12 : జొన్నలగడ్డ లత (బిఆర్ఎస్)
వార్డు - 13 : గుంజా పెదమంగా (బిఆర్ఎస్)
వార్డు - 14 : కుసంపూడి మహేష్ (బిఆర్ఎస్)
వార్డు - 15 : అక్షింతల వెంకటరమయ్య (బిఆర్ఎస్)
వార్డు - 16 : అడ్డంకి అనిల్ కుమార్ (బిఆర్ఎస్)
వార్డు - 17 : కోతూరు తులసి (బిఆర్ఎస్)
వార్డు - 18 : తూతా లక్ష్మి కుమారి (బిఆర్ఎస్)
వార్డు - 19 : పాకలపాటి లక్ష్మి (సిపిఐఎం )
వార్డు - 20 : బెల్లంకొండ రాము (బిఆర్ఎస్)
వార్డు - 21 : మల్లూరు అంకమ్మ రాజు (బిఆర్ఎస్)
వార్డు - 22 : మాటూరి భవాని (బిఆర్ఎస్)
వార్డు - 23 : షేక్ సహీరా బేగం (బిఆర్ఎస్)

# అనుమతి లేకుండా ర్యాలీలు తీస్తే కఠిన చర్యలు

- సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):**



మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా ఎవరైనా సభలు లేదా ర్యాలీలు నిర్వహిస్తే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎన్నికల పవిత్రతను కాపాడటానికి, అభ్యర్థులు మరియు వారి మద్దతుదారులు చట్టాలను గౌరవించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# అంతర్జాతీయ పోటీలకు బధిర విద్యార్థులను సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):**



అంతర్జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సిద్ధం చేయాలని, అందుకు గల అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.గత నెల 29 నుండి ఈనెల 1 వరకు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ది సైలెంట్ ఒలంపియాడ్ 2026 పేరుతో ముంబైలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. మొత్తం 28 మంది బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ చాటారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో జరిగే క్రీడా పోటీల్లోనూ ఈ విద్యార్థులు పాల్గొనేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ బధిర విద్యార్థులు రాణించేందుకు సంసిద్ధం చేయాలని, మరింత శిక్షణ ఇప్పించాలని అన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.కమల ఉదయ కుమారి, ఉపాధ్యాయులు జే.తులసీరామ్, కె.శ్రీనివాస్ ఎన్.సుజాత, బి.అఖిల్, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.



# ప్రీ ప్రైమరీ స్కూల్ ను సందర్శించిన ఎంఈఓ

**రాయపర్తి(వుదయం ప్రతినిధి):**

ప్రీ ప్రైమరీ స్కూల్ ను మండల విద్యాధికారి వెన్నంపల్లి శ్రీనివాస్ సందర్శించారు. మంగళవారం మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో గల ప్రీ ప్రైమరీ తరగతులు జరుగుతున్న తీరును విద్యార్థులు రంగులను గుర్తుపట్టు విధానాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజేంద్రప్రసాద్ , ప్రీ ప్రైమరీ టీచర్ సీనపల్లి అనిత, ఆయా కందికట్ల రజిని పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ సిఆర్పి సిన్నపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 03(వుదయం జిల్లా ప్రతినిధి):**




జిల్లాలో ఆహార కల్తీని కట్టడి చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆహార తనిఖీ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ఆహార తనిఖీ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, వైద్య, విద్యా, పంచాయతి రాజ్, సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆహార భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వసతి గృహాలు, హోటళ్లు, భోజనశాలలు తదితర ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలని సూచించారు.ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఎక్కడా కల్తీ ఆహారం విక్రయించ బడకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా తీసిన ఫోటోలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో తప్పనిసరిగా పోస్ట్ చేయాలని, తద్వారా పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. నమూనాలు సేకరించి పరీక్షించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం, అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మెనూ తనిఖీ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆహార తనిఖీ అధికారి వరుణ్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, డిపిఓ శ్రీలత, మహదేవపూర్ సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు దవాఖానల్లోనే ప్రసవాలు జరగాలి



**ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంచడమే మన లక్ష్యం**
**గర్భిణీల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు**
**సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):**



జిల్లాలోని గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పట్టుదలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. మంగళవారం మార్కుక్ మరియు జగదేవ్‌పూర్ మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని గదులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు నమోదైన ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైద్య పరికరాలు, మందులను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో రాజీ పడకూడదని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని, గ్రామాల్లోని గర్భిణీల ఆరోగ్య స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఒక్క గర్భిణీ కూడా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డి.ఎం.అండ్.హెచ్.ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.



# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**మెనూ పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవు**

**సిద్దిపేట, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలంలో ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాల యాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శిం చారు. మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ నిబం ధనలు పాటించని అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో వండిన అన్నం, క్యాబేజ్ కూర, పప్పు, సాంబారును కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును, వాడుతున్న సరుకులను పొంతన లేక పోవడంపై పాఠశాల ప్రత్యేక అధికారి (SO)ని నిలదీశారు. స్టాక్ రిజిస్టర్లో ఎంట్రీలు లేకుండా ఇష్టానుసారంగా సరుకులు వాడటంపై మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను సదరు ఎస్.ఓ పై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓ కు ఫోన్ ద్వారా ఆదేశించారు. పాఠశాలను తరచుగా సందర్శించి నివేదిక ఇవ్వాలని ఎంఈఓ కు సూచించారు. ఏదో మొక్కుబడిగా వంట చేసి విద్యార్థులకు పెడితే ఊరుకునేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతిరోజూ నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, విద్యార్థుల కూర్చున్న చోటికే వెళ్లి ప్రేమతో వడ్డించాలని వంట సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**వార్డు అభ్యర్థులకు పారదర్శకంగా ఎన్నికల గుర్తులను కేటాయించాలి**

**అధికారులు ఎన్నికల విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి**

**వైరా తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల అభ్యరుల గుర్తుల కేటాయింపు ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం, ఫిబ్రవరి -03(వుదయం):** ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గద ర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవా రం వైరా తహసీల్దారు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సి పాలిటీ వార్డు అభ్యర్థుల బీఫామ్ పరి శీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు, బీ ఫామ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావర ణంలో ఎన్నికల నిర్వహణకు ఖచ్చి తంగా పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. **ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ** ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బం దీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఎన్నిక లకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల అధికారులు క్షేత్ర స్థాయిలో కలిసి పని చేసి మన జిల్లాలో ఎన్నిక లు స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా అందరు కలిసి పనిచేయాలని సూచించారు. ఎన్నికలకు కేటాయిం చిన అధికారులందరు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల తర్వాత ఉపసంహరణ, రాజకీయ పార్టీ లు బీఫామ్ పరిశీలన చాలా ముఖ్యమైన అంశమని వివరిం చారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నామినే షన్ల అప్పీళ్ల పరిష్కారం, బీఫామ్ లేని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా ప్ర కటన, గుర్తుల కేటాయింపు పారదర్శ కంగా కేటాయించాలని సూచించారు. ఏలాంటి తొందరపాటు లేకుండా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదా రులకు ఒకే రూట్ లో సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు.ఎన్నికల్లో ప్రలో భాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వైరా తహసీల్దారు సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, ఎంపీడీఓ తేజావత్ సక్రియ, ఎంఈఓ వెంకటేశ్వర్లు అధికా రులు, తదితరులు పాల్గొంటున్నారు.



# సత్తుపల్లి కాంగ్రెస్ వార్డు అభ్యర్థులకు

**బి ఫామ్ లు అందించిన ఎమ్మెల్యే మట్టా**

**సత్తుపల్లి ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించి వారికి బీ ఫార్మ్ లు అందించిన సత్తుపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

1 వ వార్డు మట్టా ప్రసాద్

2 వ వార్డు నాయుడు రాధిక,

3 వ వార్డు బొంతు సుమలత 4 వ వార్డు షేక్ మౌలాలి

5 వ వార్డు షేక్ అకీమ్ పాషా, 6 వ వార్డు తోట సుజల రాణి, 7 వ వార్డు మహ మ్మద్ నసీమా, 8 వ వార్డు బందారు శరత్ చంద్ర, 09 వ వార్డు జగన్నాధం శ్రీను, 10 వ వార్డు మట్టా దేవజ్యోతి, 11 వ వార్డు ఎస్కే నాగుల్ మీరా, 12 వ వార్డు సింగపొగు నాగలక్ష్మి, 13 వ వార్డు ఉప్పు నాగమణి. 14 వ వార్డు పింగళి శామ్యూల్, 15 వ వార్డు దూదిపాళ్ల రాంబాబు, 16 వ వార్డు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, 17 వ వార్డు చావా స్వరూపా రాణి, 18 వ వార్డు పర్సా మానస, 19 వ వార్డు కర్నాటి విజయ కుమారి, 20 వ వార్డు మహమ్మద్ కమల్ పాషా, 21 వ వార్డు మందపాటి ప్రభాకర్ రెడ్డి, 22 వ వార్డు మహమ్మద్ రెహానా బేగం, 23 వ వార్డు వీరవల్లి అపర్ణ.

# ధర్మపురిలో 'త్రిముఖ' వ్యూహం

**అసలైన రాజకీయ చదరంగం మొదలు**

**బల ప్రదర్శనకు సిద్ధమైన ప్రధాన పార్టీలు**

**ప్రచార హోరుకి సర్వం సిద్ధం**

**ధర్మపురి, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):** ధర్మపురి మున్సిపాలిటీలో ఉపసంహ రణల పర్వం ముగి యడంతో అసలైన రాజకీయ చదరంగం మొదలైంది. ప్రధా న పార్టీలైన కాంగ్రెస్,బి.ఆర్.ఎస్, బీజేపీ లు సమాన సంఖ్యలో చెరో 15 మంది అభ్యర్థులను రంగంలోకి దింపి, ఢీ అంటే ఢీ అంటున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకు కొనసాగిన ఉత్కంఠకు తెరపడటం తో, ఇప్పుడు అందరి దృష్టి ఓటర్ల నాడిపైనే ఉంది.కాంగ్రెస్ అధికార పార్టీ హోదాలో సంక్షేమ పథకాలు,అభివృద్ధి మంత్రంతో ఓటర్లను ఆకట్టుకో వాలని కాంగ్రెస్ భావిస్తోంది. వార్డుల వారీగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. బిఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని,పట్ట ణంలో జరిగిన మార్పులను వివరిస్తూ కేడర్‌ను సమాయత్తం చేస్తూ వ్యూహ రచన చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న పట్టును నిరూపించుకోవాలని గులాబీ శ్రేణులుతహతహలాడుతున్నాయి బీజేపీ కేంద్ర పథకాల ప్రచారం, పట్టణ ఓటర్లలో ఉన్న పట్టును నమ్ముకుని బీజేపీ బరిలోకి దిగింది.యువతను, మార్పు కోరుకునే ఓటర్లను ఆకర్షించ డంపై కమలనాథులు దృష్టి సారించా రు.గత రెండు రోజులుగా అసమ్మతి నేతల బుజ్జగింపులు ఫలించినట్లు కని పిస్తోంది. ముఖ్యంగా చివరి రోజున 19 మంది వెనక్కి తగ్గడం వెనుక పార్టీ పెద్దల వ్యూహం పనిచేసింది. స్వతంత్రు లుగా పోటీలో ఉన్న 7 మంది అభ్యర్థు లు ఎవరి ఓట్లను చీలుస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కొన్ని వార్డుల్లో స్వతంత్రులు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉండటంతో ప్రధాన పార్టీల్లో టెన్షన్ నెలకొంది.వార్డుల్లో త్రిముఖ పోటీ నెల కొన్న చోట స్వల్ప ఓట్ల తేడాతోనే జయా పజయాలు తారుమార య్యే అవకాశం ఉంది. దీంతో ప్రతి ఓటూ కీలకమేనని అభ్యర్థులు భావిస్తున్నారు. ఇంటింటి ప్రచారం,కుల సంఘాల మద్దతు కూ డగట్ట డంపై నేతలు దృష్టి పెట్టారు. మొత్తానికి ధర్మపురి పురపోరు కేవలం మున్సిపల్ ఎన్నికలగానే కాకుండా,పా ర్టీల ప్రతిష్టాత్మక పోరుగా మారింది.



# గ్రామపంచాయతీలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 03(వుదయం జిల్లా ప్రతినిధి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ పూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచా యతీ ఆవరణలో సర్పంచ్ సరిత ఆధ్వర్యం లో మంగళవారం ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేశారు.గ్రామంలోని సమస్యలను మౌఖికంగా చెప్పడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా ఫిర్యాదు బాక్సులో వేయవ చ్చని సర్పంచ్ తెలిపారు.ప్రతి సోమవారం ఫిర్యాదు బాక్స్‌ను తెరిచి అందులో వచ్చిన సమస్యలను పరిశీలించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నా రు.సోషల్ మీడియాలో సమస్యలను వైరల్ చేయకుండా, నేరుగా ఫిర్యాదు బాక్స్ ద్వారా సమస్యలను తెలియజేయాలని గ్రామస్తుల కు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపస ర్పంచ్ లచ్చిరెడ్డి, కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో పారదర్శకత పాటించాలి

**మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)**



**రంగారెడ్డి, ఫిబ్రవరి 03 (వుదయం ప్రతినిధి):** ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రి యకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీని వాస్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థ వంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని ఆరు ము న్సిపాలిటీల పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మా ట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాం డమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లో ని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బా ధ్యతలు కేటాయించడం జరుగుతుం దన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవా లని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగల్గుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించా లని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవా లని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వ హించారా లేదా అన్నది పరిశీలించా లని, మాక్ పోల్, తదనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలూ ఉన్నాయా లేవా అన్నది గమనించా లని, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వ ర్తిసున్న విధులను గమనించాలని, పోలింగ్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని, ఎక్కడ కూడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని సూచించారు. పోలింగ్ ప్రారంభమై నప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్ప టికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్య తను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగ్రత్త తో వ్యవహరించాలని అన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్య ర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అంది స్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు, పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి యూనిట్లను పరిశీలించిన కలెక్టర్

**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్**



**దమ్మపేట, ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి):** జిల్లాలో అమలవుతున్న సేంద్రియ వ్యవసాయం, కౌజు పిట్టల పెంపకం, కొర్రమీను చేపల సాగు వంటి వినూత్న వ్యవసాయ మరియు గ్రామీణ ఉపాధి కార్యక్ర మాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పశుసంవర్ధక శాఖ అడి షనల్ డైరెక్టర్ అమయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. పర్యటనలో భాగంగా పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను వారు సమగ్రంగా పరిశీలించా రు. యూనిట్‌లో అమలవుతున్న సేంద్రియ విధానాలు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను సమీ క్షించి తగిన సూచనలు ఇచ్చారు. యూనిట్‌లో సేంద్రియ పద్ధతిలో తయారుచేసే ఉత్పత్తుల్లో మునగాకు ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాల తో తయారుచేసిన ఆహార పదార్థా లు, ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, వివిధ రకాల కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సబ్బులు మొదలైన మొత్తం 102 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. గ్రామీణ వన రులను సమర్థవంతంగా ఉపయోగి స్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తు లను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ఈ యూనిట్ ప్రత్యేకత. పరిశుభ్రత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సమర్థ వంతమైన మార్కెటింగ్ విధానాల వల్ల కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం స్థానిక మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయి. పక్షులకు అందించే ఆహార దాణా, గాలి ప్రసరణ, షెడ్ నిర్వహణ, పరిశుభ్రత చర్యలను కూడా పరిశీ లించారు.అనంతరం, దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘ సభ్యుల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను కూడా పరి శీలించారు. గుడ్ల ఉత్పత్తి, గుడ్లను పొదిగించడం, పిల్లల పెంపకం వంటి ప్రక్రియలను యూనిట్ ని ర్వాహకులు వివరించారు. జిల్లా కలెక్టర్, రాబోయే రోజుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవస రమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదన లు సిద్ధం చేసి నాబార్డ్ ద్వారా ఆర్థిక సహాయం పొందేలా సూచించారు. తదుపరి, లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువ రైతు చాపా బాలకృష్ణ ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలకృష్ణ, రసాయన ఎరువులు లేదా క్రిమి సంహారక మందులు వినియోగిం చకుండా, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి సహజ పద్ధతుల ద్వారా మంచి దిగుబడి సాధిస్తున్న ట్లు జిల్లా కలెక్టర్ గుర్తించారు. అలాగే, సమీకృత ప్రకృతి వ్యవసా యం చేపట్టే విధంగా స్థానిక ఏ.పి. యం కు సూచనలు చేశారు.జిల్లాలో అమలవుతున్న ఈ సేంద్రియ వ్యవసాయం, పశుపక్షి పెంపకం, మత్స్య సాగు కార్యక్రమాలు రైతులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామీణ యువతకు స్థిర ఆదాయ మార్గాలను కల్పిస్తున్నాయి అని జిల్లా కలెక్టర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ఈ విధానాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పం చులు, మహిళలు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి):** జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలో ని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కా ర్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తో కలిసి జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సం క్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో పత్తి పంట దిగుబడి అంచనా వేయాలని, తదనగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్య వసాయ విస్తరణ అధికారులు కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా కొనుగోలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 23 వేల ఎకరాలను పత్తి సాగు చేసే అవకాశం ఉందని, పంట దిగుబ డికి అనుగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలోని రైస్ మిల్లులకు 1 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉందని తెలిపారు. పంట ఉత్పత్తులను రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసి సకాలంలో సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాల ని తెలిపారు. జిల్లాలో పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేంద్రాల ఏర్పా టులో నిబంధనలను పాటించాలని తెలిపారు. పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టార్పా లిన్లు, గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు అవసరమైన మేర సమకూ ర్చాలని, హమాలీల సంఖ్య అనుగుణం గా ఉండేలా పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అం దించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్ కి సన్మానం




**కామారెడ్డి, ఫిబ్రవరి 3 (వుదయం):-** కామారెడ్డి పట్టణంలోని ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవా రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్‌కి సన్మానం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుంచి మొట్టమొదటి ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్ ఎందరో గ్రామీణ పేద విద్యార్థులకు కోచ్ గా వ్యవ హరించి వారు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఒలంపిక్స్, పారాలింపిక్స్ లో పథకాలు సాధించేలా ఎంతో కృషి చేసినందుకు ప్రతిష్టాత్మక ద్రోణాచా ర్య అవార్డును పొందడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆర్కే కళాశా లకు విచ్చేసి విద్యార్థులను చదువుతో పాటు ఆటలలో నైపుణ్యం ప్రదర్శిం చాలని తెలియజేశారు. ఆటల ద్వారా ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు మానసిక ఉల్లాసం అంతేకాకుండా వాటి ద్వారా లభించే సర్టిఫికెట్ల ద్వారా భవిష్యత్తులో ఉద్యోగాలకు సైతం ఎంతో పనికి వస్తుందని అందుకని ప్రతి విద్యార్థి తనకు నచ్చిన ఆటల్లో ముందుండాలని అవసరమున్న వారికి తగు సూచనలు చేయడానికి వారు ముందుంటారని తెలియజేశా రు. ఈ సందర్భంగా ఆర్కే సీఈవో, కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లా డుతూ, కామారెడ్డి ప్రాంత విద్యార్థుల కు మంచి చదువుతో పాటు ఆటల్లో నైపుణ్యం ఉండేలా ఎంతో కృషి చే స్తున్నామని, నాగపురి రమేష్ ఎంతో స్ఫూర్తిదాయకమని వారు ఆర్కే కళాశాలకు విచ్చేసి విద్యార్థులను ప్రోత్సాహపరిచినందుకు ధన్యవాదా లు తెలియజేశారు. అనంతరం విద్యా ర్థుల సమక్షంలో వారిని సన్మానించి మేమెంటో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామారెడ్డికి చెందిన సాయి శ్రేష్ఠ 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో , 8 సంవత్సరాల విభాగంలో స్టాండింగ్ లాంగ్ జంప్ లో గోల్డ్ మెడల్ సాధించినందుకు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేష్, నిజామాబాద్ అథ్లె టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజ గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ శివ, సాయికృష్ణ, ప్రిన్సిపల్స్ అమృత దత్తాత్రి, నవీన్, గోవర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం చేద్దాం



**భద్రాచలం ,ఫిబ్రవరి03 (వుదయం):** భద్రాచలం పట్టణంలోని బీసీ ఐక్య వేదిక కార్యకర్తల సమావేశంలో అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు, (యంజేఏసీ) అధ్యక్షులు ఈటె రాజే శ్వరరావు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలుగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు రాజకీయ వాటాలో దానికోసం బడుగు బలహీన వర్గాలు సామాజిక న్యాయం కోసం రాజకీయ అధికారం కోసం మొత్తం ఒక మాట పైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యాధికార భాగస్వామ్య ఉద్యమంలో అందరూ పాల్గొనా లని దానికోసం చేసే పోరాటంలో అందరి ఐకమత్యాన్ని చాటవల సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు ఈ సమావేశాలను ప్రతి నెలకు ఒకసారి జరుపు కోవాల్సిన అవసరం ఉందని వారి అభిప్రాయా యాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్ర మంలో తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిని విత్ డ్రా కొరకు బెదిరింపు

**రామకృష్ణాపూర్/ ఫిబ్రవరి 3 (వుదయం ప్రతినిధి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16 వ వార్డ్ భారాస కౌన్సిలర్ అభ్యర్థి గండమాల కృపానందం (గ్యాస్ నాని) ని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కిడ్నాప్ చేసి,బలవంతంగా విత్ డ్రా చే సుకోవాలని భయభ్రాంతులకు గురిచేసి మున్సిపాలిటీ కార్యాలయంలోని ఎన్నికల కేంద్రానికి విత్ డ్రా సమయం అయిపో యిన తర్వాత బలవంతంగా తీసుకుని రావడంతో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఎన్నికల సమయం దాటి పోయిందని అనుమతించలేదు. బారాస నాయకులు, అధికార పార్టీ నాయకులను అభ్యర్థిని భయభ్రాంతులకు గురి చేసి తీసుకురావ డం ఏంటని ప్రశ్నించడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అక్కడే ఉన్న స్థానిక ఎస్సై జె శ్రీధర్ గొడవ జరిగేలా ఉందని గమనించి అందరు నీ కార్యాలయం బయటికి పంపించి వేశారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

## జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ...




**కోరుట్ల ,ఫిబ్రవరి 03 (వుదయం )**

మెట్ పెల్లి మండలం బండ లింగపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా పాఠశాలలో విద్య బోధన విధానం విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకం అమలు మౌలిక వసతులను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు తరగతి గదిలో విద్యార్థుల పాఠ్యంశాల్లోని సెలబస్ ను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి వారితో పాఠాలు చదివించి వారి భోధన స్థితి గతులను ప్రత్యేకంగా పరిశీలించారు 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాక్షించారు10వ తరగతి మ్యాథ్స్ సబ్జెక్టు నోట్ బుక్‌లను పరిశీలించారు గణితం విషయంలో పిల్లలు కొంచెం వెనుకంజలో ఉన్నారని ఇంకా పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని 10వ తరగతి పరీక్షలకు రైటింగ్ బాగా ప్రాక్టీస్ చేస్తేనే మంచి మార్కులు వస్తాయని విద్యార్థులకు సూచించారు భవిష్యత్తులో ఏమి అవ్వాలని ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకొని చదువుకుంటే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేసి ప్రోత్సాహించారు అనంతరం ఎంపీపీ ఎస్ పాఠశాలలోని 3వ తరగతి ఎఫ్ ఎల్ ఎన్ పై పలు ప్రశ్నలు అడిగారు మధ్యాహ్న భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అవగాహన కల్పించాలన్నారు మధ్యాహ్నం భోజనంలో సన్న బియ్యం వాడాలని వంటకాల కోసం గ్యాస్ సిలిండర్ లను ఉపయోగించే విధంగా చూడాలని ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు వైద్య పరీక్షలు సకాలంలో చేయాలని ప్రభుత్వ మెను ప్రకారం రోజువారి వంటకాలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందే విధంగా సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు

ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ శ్రీనివాస్ జిల్లా విద్యాధికారి కె రాము ఎంఈవో చంద్ర శేఖర్ మండల తహసిల్దార్ నీత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అశ్వారావుపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ హవా

## 19వ వార్డులో ఇంటింటి ప్రచారంతో ప్రజల మనసు గెలుచుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భారీ మెజార్టీతో జ్యేష్ట సత్యనారాయణ చౌదరి గెలుపే లక్ష్యం




**అశ్వరావుపేట, ఫిబ్రవరి 3 (వుదయం )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా హోరాహోరీగా సాగుతున్న వేళ, కాంగ్రెస్ పార్టీ ప్రచారం రోజురోజుకూ మరింత ఉధృతంగా కొనసాగుతోంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, ఇంటింటి ప్రచారంతో ప్రజల హృదయాలను గెలుచుకుంటూ కాంగ్రెస్ నాయకత్వం ముందుకు సాగుతోంది.ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జ్యేష్ట సత్యనారాయణ చౌదరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే సంకల్పంతో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రజలతో ముఖాముఖి సమస్యలపై లోతైన చర్చఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, రోడ్ల దుస్థితి, వీధి దీపాల లేమి, పారిశుధ్య సమస్యలు, పార్కుల కొరత, పాఠశాలల మౌలిక సదుపాయాల అవసరం వంటి అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల పార్టీ

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అనేది పేదల, బడుగు బలహీన వర్గాల, మధ్యతరగతి ప్రజల పార్టీ అని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసి, అభివృద్ధికి పునాది వేసిందని గుర్తు చేశారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధి కావాలంటే అనుభవం ఉన్న పార్టీ, ప్రజలకు దగ్గరగా ఉండే నాయకత్వం అవసరమని అన్నారు. అందుకే ప్రతి వార్డులో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి,మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలని ప్రజలను కోరారు.

సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం చేపట్టిన పథకాలు, రైతులకు భరోసా ఇచ్చే కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలు, వృద్ధులకు గౌరవంగా పెన్షన్లు అందించే చర్యలను ప్రజలకు వివరించారు.

ప్రభుత్వ పథకాలు కేవలం పేపర్లకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.అభ్యర్థి మాటల్లో అభివృద్ధి సంకల్పంఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జ్యేష్ట సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇస్తే 19వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ ద్వారా వచ్చే ప్రతి రూపాయిని వార్డు అభివృద్ధికే వినియోగిస్తానని స్పష్టం చేశారు.

వార్డులో మెరుగైన రోడ్లు, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ, శుద్ధ తాగునీరు, పారిశుధ్య మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, పిల్లల కోసం ఆటస్థలాలు, మహిళలకు భద్రత, యువతకు క్రీడా సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా పనిచేస్తానని హామీ చ్చారు.

కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషి

ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. ప్రతి ఇంట్లో కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరిస్తూ, అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎస్సీ–ఎస్టీ విభాగాలు, మైనారిటీ విభాగం నాయకులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, నార్లపాటి రాములు, ముబారక్ బాబా, కోలా లక్ష్మీనారాయణ, పార్థసారథి, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, తాడేపల్లి రవి, వెలుపుల సత్యనారాయణతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,

యువకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ గెలుపుతోనే

అశ్వారావుపేట అభివృద్ధి

అశ్వారావుపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగల శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, అశ్వారావుపేటలో కాంగ్రెస్ పాలన తీసుకురావాలని ప్రజలను కోరారు.

# విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో పాల్గొంటేనే ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారు

## సీఎం కప్ రెండో విడత మండల స్థాయి ఆటల పోటీలు. ఎంపీడీవో వనపర్తి అద్వైత.

**ఖానాపురం, ఫిబ్రవరి 3 (వుదయం ):**

విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో పాటలలో పాల్గొంటేనే మనసు ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుందని చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత విద్యార్థులకు తెలిపారు. సీఎం కప్ రెండో విడతలో భాగంగా మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్ ఆవరణలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, కోకో, వాలీబాల్, తోపాటు వివిధ రకాల ఆటల పోటీలను ఏర్పాటు చేసి ఆటల పోటీల కార్యక్రమాన్ని ఎంపీడీవో తోపాటు తహసిల్దార్ నంగునూరి రమేష్, ఎస్ఐ సిహెచ్ రఘుపతి, మండల విద్యాశాఖ అధికారి ఎం చరణ్ సింగ్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ గట్ల సురేందర్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు గ్రామ సర్పంచ్ జాడి అచ్చితంతో కలిసి ఆటల పోటీలను ప్రారంభించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఆటలు ఆడకుండా ఇష్టపడి ఆటలు ఆడి గ్రామ మండల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని అందుకునే విధంగా ఓర్పుతో నేర్పుతో వివిధ రకాల ఆటల్లో పాల్గొని విజయం సాధించాలని విద్యార్థులను ఎంపీడీవో ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసిల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో ఓడిన గెలిచిన మనస్ఫూర్తిగా ఒకరినొకరు స్వాగతించుకోవాలని విద్యార్థులకు తాహసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీఎం కప్ రెండో విడతలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ఆటల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి గెలుపు ఓటమి ప్రతి ఆటలో ఉంటుందని గెలుపును ఏ విధంగా స్వాగతిస్తారో ఓటమిని కూడా అదే రీతిలో స్వాగతించుకునే విధంగా విద్యార్థులు ఉండాలని విద్యార్థులకు ఎస్ఐ తెలిపారు. రెండో విడత సీఎం కప్ లో 12 టీంలు వివిధ రకాల ఆటోలో పాల్గొన్నట్లు ఎంపీడీవో తెలిపారు

. ఈ కార్యక్రమంలో సర్పంచులు పెసరు రాణి, భూక్య భానుప్రసాద్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎలాగౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# సమ్మె జయప్రదం చేయండి

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు.




**మధిర ఫిబ్రవరి 3 (వుదయం )**

29 కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ ను అమల్లోకి తెస్తూ 2025 నవంబర్ 21న ఇచ్చిన నోటిఫికేషన్ ను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం ఉప సంహరించుకోవాలి, పేదలకు పనికి గ్యారంటీ కల్పిస్తున్న చట్టాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్ల పరిష్కారానికై జాతీయ కార్మిక సంఘాలు.ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపుపై 2026 ఫిబ్రవరి12న జరుగనున్న ఒక్క రోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పాల్గొంటుందని తెలియజేస్తూ ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ కు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ బడ్జెట్ లో కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయల లాభాలు చేకూర్చే ప్రాజెక్టులుకట్టబెట్టిందని,కార్పొరేట్ల,సంపదపై పన్ను మినహాయింపులు ఇచ్చిందని,కార్మికుల ఉద్యోగ భద్రత,ఉపాధి హామీపై ఒక్క మాట కూడా బడ్జెట్లో లేదని, కొద్దిమంది కార్పొరేట్ల సంపదను పెంచేందుకు కోట్లాది ప్రజల జీవన హక్కులను తాకట్టు పెట్టేదిగా ఉందని,ఉపాధి సృష్టి పేరుతో శాశ్వత ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు,గిగ్,ఔట్సోర్సింగ్ ఉపాధిని పెంచే బడ్జెట్గా ఉందని,కార్మికులకు ఉద్యోగ భద్రత,ఉపాధి కల్పన,కనీస వేతనాల పెంపు, అసంఘటితరంగ కార్మికులు,స్కీం వర్కర్లకు సంబంధించి సామాజిక భద్రత అయిన పెన్షన్,ఈఎస్ఐ,పీఎఫ్ లాంటి వాటి అమలుపై ప్రస్తావన లేదని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలు వల్ల నష్టపోయే కార్మికుల గురించి పట్టించుకోలేదని ఈ బడ్జెట్ అసమానతల్ని పెంచేదిగా ఉందన్నారు. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్ రద్దుకు, కనీస వేతనం రూ.26,000 డిమాండ్,స్కీమ్ వర్కర్స్ను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్,అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు జరగబోయే జాతీయ సమ్మె లో కార్మికులు,ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ నాయకురాలు నండ్రు సుధారాణి,ధనలక్షి రుక్మిణి,రమాదేవి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి

# దేవజ్యోతి విస్తృత ప్రచారం



**సత్తుపల్లి ,ఫిబ్రవరి 3 (వుదయం )**

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దేవజ్యోతి వార్డు పరిధిలోని వెంగళరావు నగర్, జలగం నగరాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మద్దతుదారులతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా దేవజ్యోతి స్థానిక నివాసితులతో నేరుగా ముచ్చటించారు. ముఖ్యంగా చిన్న పిల్లలను చూడగానే ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, వారిని హత్తుకుని ముద్దాడటం అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవజ్యోతి మాట్లాడుతూ.. "మన 10 వార్డు పురోభివృద్ధే నా ధ్యేయం. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతాయి. మన వార్డు అభివృద్ధికి, మీ సమస్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను. మీ అమూల్యమైన ఓటును 'హస్తం' గుర్తుపై వేసి, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 10 వ వార్డు కాంగ్రెస్ నాయకులు దొడ్డకుల గోపాలరావు భాస్కర్ కార్యకర్తలు, మహిళలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 31వ వార్డులో కుసుమ బాబు ఏకగ్రీవ ఎన్నిక



**కోదాడ, ఫిబ్రవరి 2(వుదయం)**

కోదాడ పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్‌గా మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు నిర్వహించి పుష్పగుచ్చాలు అందజేసి మిఠాయిలు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుసుమ బాబు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఆశీస్సులు, స్థానిక నాయకుల సహకారంతోనే తాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని తెలిపారు.

# అధికారుల సమన్వయ సమావేశం

## మహాశివరాత్రి జాతర లో భాగంగా అధికారుల సమన్వయ సమావేశం




ఆర్డీవో ,డీఎస్పీ

**మేళ్లచెరువు/ హుజూర్నగర్ ఫిబ్రవరి 3 (వుదయం ):**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసినటువంటి శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానమునందు ఈ నెల 15వ తారీకు నుంచి ఐదు రోజులు అంగరంగ వైభవంగా జరుగు జాతరలో భాగంగా అధికారులు మరియు రాజకీయ నాయకుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ సుమారు జాతరకి రెండున్నర లక్షల నుంచి మూడు లక్షలు వస్తారని అధికారులందరూ సమన్వయ సహకారంతో పనిచేసి మేళ్లచెరువు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జాతరను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇక్కడికి విచ్చేసినటువంటి గ్రామ పంచాయితీ సిబ్బంది, ఎలక్ట్రిక్ సిబ్బంది,ఆర్టీసీ సిబ్బంది,ఆర్ అండ్ బి సిబ్బంది, ఎన్ఎస్పి సిబ్బంది, ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది వారితో మాట్లాడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జాతర గురించి చర్చించడం జరిగింది. అనంతరం మేళ్లచెరువు ఎస్సై పరమేష్ మాట్లాడుతూ

మనకు సమయము చాలా తక్కువగా ఉన్నది కాబట్టి రేపటి నుంచే పార్కింగ్ స్థలాలు శుభ్రం చేయాలని, బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని మరియు లైటింగ్ ప్రభల గురించి వారు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ సిఐ చరమంద రాజు, దేవాలయ ఈవో నాగేల్ల. శంబిరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య ఉత్సవ కమిటీ సభ్యులు సర్పంచ్ బచ్చు.పద్మావతి శ్రీనివాసరెడ్డి, ఎండిఓ,గ్రామ పంచాయతీ ఈవో, దేవాలయ సిబ్బంది కూన్రెడ్డి.కొండారెడ్డి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రంగా రూపను అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మదిర,ఫిబ్రవరి 3,(వుదయం )**



మధిర డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను 21వ డివిజన్ కౌన్సిలర్ అభ్యర్థి రంగా రూప మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మధిర మున్సిపాలిటీ 21వ డివిజన్ కౌన్సిలర్‌గా రంగా రూపని అధికారికంగా ప్రకటించిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్కని శాలువాతో సత్కరించి అభివాదం చేశారు.పార్టీపై పెట్టుకున్న విశ్వాసానికి, తనపై చూపిన ఆదరణకు ధన్యవాదాలు తెలుపుతూ21వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని రంగా రూప శ్రీనివాసరావు పేర్కొన్నారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రంగా రూపను అభినందించి ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం 21 వార్డ్ కౌన్సిలర్ గా రంగా రూప కాంగ్రెస్ నాయకులు బి ఫాం అందజేశారు

.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రాయల నాగేశ్వరరావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా,మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు,కోట నాగరాజు,ఎన్ఎస్ఆర్ రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మర్రి అరుణ కుమార్

## మద్దతుగా బత్తిని మౌనిక నామినేషన్ ఉపసంహరణ



**అందోల్ ఫిబ్రవరి 3 (వుదయం )**

సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట్ మున్సిపల్ ఎన్నికలలో మూడో వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన బత్తిని మౌనిక మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆమె పోటీ నుండి స్వచ్ఛందంగా తప్పుకుంటూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మర్రి అరుణ కుమార్ పూర్తిస్థాయి మద్దతు ప్రకటించి, ఆయన విజయానికి కృషి చేస్తానని తెలియజేశారు.బత్తిని మౌనిక తనకు మద్దతు తెలిపినందుకు అభ్యర్థిని అరుణ కుమార్ ఆనందం వ్యక్తం చేస్తూ, సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సురోత్తమ్ రెడ్డి, పెండ్యాల రాములు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మంత్రి ఆశీస్సులతో 3వ వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మర్రి అరుణ కుమార్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మర్రి అరుణ కుమార్ తో పాటు పార్టీ నాయకులు సదాశివుడు , కుమార్ , అవినాష్ , సతీష్ , ప్రశాంత్ , శివకుమార్, వెంకటేష్, సంతోష్, జోగినాథ్ , చాపల మహేష్ , ఎల్లప్ప , బన్నీ , తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టిక ఆహారం తీసుకోవాలి

## గర్భిణీ బాల్యంతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలి సర్పంచు జయన్న

**గద్వాల ఫిబ్రవరి 3 (వుదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని కాకులవరం గ్రామంలో మంగళవారం రోజు అంగన్వాడి సెంటర్లు పౌష్టిక ఆహారంపై అంగన్వాడి టీచర్లు నిర్ణయించిన సభకు హాజరైన గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అందరూ అంగన్వాడి సెంటర్ కు మీ పిల్లలను రోజు పంపించాలి మీ పిల్లలకు అంగన్వాడి నుండి సెంటర్లో ఇచ్చే గుడ్డును పిల్లలకి ఇచ్చే పౌష్టికా ఆహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రూప మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణీ బాలింతలు ప్రతిరోజు మధ్యాహ్నం సెంటర్ కొచ్చి పౌష్టిక ఆహారం తిని వెళ్లాలని మీ పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్వాడి కేంద్రం వాళ్ళు



ఇచ్చే పోషీగా ఆహారాన్ని ప్రతి ఒక్క గర్భిణీ బాల్యంత తీసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ రాజేష్, ఆశ వర్కర్ అంగన్వాడి టీచర్లు పాల్గొనడం జరిగింది

# మున్సిపల్ ఎన్నికల వేళ పటిష్ట భద్రత

## మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి



**మహబూబ్‌నగర్ ,ఫిబ్రవరి 3, (వుదయం )**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ మరియు బీ–ఫారంల సమర్పణకు నేడు చివరి రోజు కావడంతో, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట భద్రతా చర్యలను ఎస్పీ సమీక్షించారు.
ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా ముగించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.
శాంతి భద్రతలు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
అభ్యర్థులు, వారి అనుచరులు మరియు ప్రజలు ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జోగిపేట 1వార్డ్ కౌన్సిలర్

# బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్ధి : చక్ర పాణి





**అందోల్ ఫిబ్రవరి 3 (వుదయం )**

సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట్ మున్సిపల్ ఎన్నికలలో జోగిపేట 1వార్డ్ కౌన్సిలర్ బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తున్న చక్ర పాణి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు

# ఘనంగా పురాతన ఈశ్వరాలయంలో రుద్రాభిషేకం



**అందోల్, ఫిబ్రవరి 3 (వుదయం )**

మెదక్ జిల్లా అల్లాదుర్గంలో వెలసిన పురాతన ఈశ్వరాలయంలో మంగళవారం గురు స్వామి సదానందం స్వామి, పూజా కార్యక్రమాలు మంత్రోచ్చారణతో ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈసందర్భంగా స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం, శివ స్తోత్రం, పుష్పార్చన, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఎంతో మహిమ గల ఈ ఆలయంలో జరుగుతున్న ఈకార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దుర్గయ్య శివ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక పూజ కార్యక్రమాలకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారినీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సంగమేశ్వర స్వామి, బేతయ్యస్వామి,
బాలరాజ్ స్వామి, శివకుమార్ స్వామి, వివిధ గ్రామాల శివ స్వాములతో పాటు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# భూభారతి సర్వే సమగ్రంగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్**
**నారాయణపేట ఫిబ్రవరి 03 (వుదయం )**

భూభారతి సర్వే సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భూభారతి సర్వే ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో కోస్గి కొత్తపల్లి నారాయణపేట షేర్నిపల్లి సర్వ జంగం రెడ్డిపల్లి లలో సర్వే చేయు నిమిత్తం ఫెంటాక్ అడ్వాన్స్ సహాయంతో సర్వే చేయుటకు గ్రామ సభలు నిర్వహించుటకు జిల్లా సర్వే అధికారి
ఎ.డి.వేణు గోపాల్ రెడ్డి,వారి సిబ్బంది సర్వే పరికరం విధివిధానాల గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు.

# సంగారెడ్డిలో నేడు యుడిఐడి (సదరం) క్యాంపు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 3 ( వు దయం ):**

సంగారెడ్డి జిల్లాలో 2026 సంవత్సరం ఫిబ్రవరి నెలకు సంబంధించిన యుడిఐడి (సదరం) క్యాంపు నేడు (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సంగారెడ్డి నందు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు.యుడిఐడి పోర్టల్ ద్వారా పునరుద్ధరణ మరియు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి నిరంతరం స్లాట్స్ బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. యుడిఐడి పోర్టల్‌లో స్లాట్ రిజిస్టర్ చేసుకుని, అనంతరం ఫోన్ కాల్ లేదా మెసేజ్ ద్వారా సమాచారం అందిన అభ్యర్థులే క్యాంపుకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.క్యాంపుకు హాజరయ్యే వారు తప్పనిసరిగా స్లాట్ పేపర్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో మరియు సంబంధిత మెడికల్ రిపోర్టులు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

## సంక్షేమం,అభివృద్ధి సమన్వయంతో తెలంగాణ ముందుకు:డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.



**మధిర ,ఫిబ్రవరి 3, (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు,ముఖ్యంగా నగర ప్రాంతాల్లోని పౌరులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాలుగా పట్టణ పాలన, అర్బన్ ప్లానింగ్ రంగాల్లో సమగ్ర ప్రణాళికలతో మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. నగరాల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పేదలు, మధ్యతరగతి,బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేసి, ప్రతి వ్యక్తికి 6 కేజీల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం.రాష్ట్రంలో మొత్తం 1 కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా,దాదాపు 1 కోటి 3 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. మార్కెట్‌లో కిలోకు రూ.50 నుంచి రూ.55 ధర ఉన్న బియ్యాన్ని ఉచితంగా అందించడం ద్వారా కోట్లాది కుటుంబాలకు ప్రభుత్వమే భరోసాగా నిలిచింది.
200 యూనిట్ల లోపు వినియోగించే పేద, బలహీన, అల్పాదాయ వర్గాల కుటుంబాలకు ఉచిత విద్యుత్ సరఫరా. బిల్లు మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా విద్యుత్ శాఖకు చెల్లిస్తోంది.మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం, దీని ద్వారా వారి జీవనోపాధి ఖర్చులు గణనీయంగా తగ్గాయి.గ్రామీణ ప్రాంతాల్లోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకే కాకుండా, పట్టణాల్లోని మహిళలు కూడా ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం.మున్సిపాలిటీల్లో మహిళల కోసం దాదాపు రూ.6,000 కోట్ల మేర వడ్డీలేని రుణాలు మంజూరు చేసి, వాటి వడ్డీ భారం కూడా ప్రభుత్వమే భరిస్తోంది.విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా అన్ని మున్సిపాలిటీల్లో, శాసనసభ నియోజకవర్గ కేంద్రాల వద్ద అడ్వాన్స్డ్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశాం. విద్య ఉన్నా నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు దొరకని పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయి.భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నాం.సంక్షేమంతో పాటు పరిశ్రమలు,మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుంది. రాష్ట్రంలో పెరుగుతున్న అర్బనైజేషన్‌ను దృష్టిలో పెట్టుకుని కోర్,పెరి అర్బన్,రీజినల్,రూరల్ ఎకానమీ అనే మూడు దశల విధానంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు చేస్తున్నాం. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా మిగతా మున్సిపాలిటీల పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల క్లస్టర్లు ఏర్పాటు చేసి, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్ ద్వారా విలువ జోడించిన ఉత్పత్తులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ భవిష్యత్ నిర్మాణం కోసం విజన్2047 డాక్యుమెంట్‌ను విడుదల చేశాం,రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఈ అభివృద్ధి పునాదులను బలపరచేందుకు ప్రజల ఆశీర్వాదం అత్యంత అవసరం.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలోని పట్టణ ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి.అలాగే ఆయా
ప్రాంతాల ఎమ్మెల్యేలు,మంత్రులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.కాంగ్రెస్ పార్టీని ఒక కుటుంబంలా భావించి, కింది స్థాయి కార్యకర్తల నుంచి నాయకత్వం వరకు అందరూ కలిసి కట్టుగా పనిచేస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం అన్నారు.

# ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు
రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియతో మున్సిపాలిటీలకు ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి,
జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 03 (వుదయం )**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి , అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం లతో కలిసి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,.... ..... జిల్లాలోని నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 49 పోలింగ్ కేంద్రాలు, కల్వకుర్తి మున్సిపాలిటీలో 44 పోలింగ్ కేంద్రాలు, కొల్లాపూర్ మున్సిపాలిటీలో 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీకి అదనంగా 20 శాతం సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు.మొత్తం 131 పోలింగ్ కేంద్రాలకు గాను 159 మంది ప్రిసైడింగ్ అధికారులు, 159 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 474 మంది ఇతర పోలింగ్ అధికారులు (ఓపిఓలు) ను ఆయా మున్సిపాలిటీలకు కేటాయించామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు
సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ నెల 11న జరగనున్న పోలింగ్ సందర్భంగా 131 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ జరిగే రోజున వెబ్‌కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా అలంకరించి ఒక్క మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమ ఓటు హను వినియోగించుకునేలా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు డీఈవో రమేష్ కుమార్, సీతారాం నాయక్, సింహ పాల్గొన్నారు

# కేన్సర్ పై అవగాహన

**సంగారెడ్డి ,ఫిబ్రవరి 03 (వుదయం )**

అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం, సంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరియు యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.
ఈ సందర్భంగా వైద్య నిపుణులు మరియు అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు మరియు ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ మరియు సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు.
కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ




కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు మరియు సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన పెంపొందించబడింది.

# ధర్మపురి 'పుర' పోరు ఖరారు

**ధర్మపురి, ఫిబ్రవరి 3 (వుదయం ):**

- *బరిలో 52 మంది అభ్యర్థులు*
- *ముగిసిన ఉపసంహారణల పర్వం*

*మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్యే అసలు సిసలు సమరం*




ధర్మపురి మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల రణం తుది దశకు చేరుకుంది.మంగళవారం తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. బుజ్జగింపులు, రాయబారాల నడుమ చివరి రోజున పెద్ద సంఖ్యలో అభ్యర్థులు వెనక్కి తగ్గారు. మొత్తం 73 మంది నామినేషన్లు దాఖలు చేయగా,
గత రెండు రోజుల్లో 21 మంది తమ దరఖాస్తులను ఉపసంహ రించుకున్నారు. దీంతో 52 మంది అభ్యర్థులు విజేతగా నిలిచేందుకు ఓటర్ల తీర్పు కోసం పోటీ పడనున్నారు.తొలి రోజైన సోమవారం కేవలం ఇద్దరు మాత్రమే నామినేషన్లు ఉపసం హరిం చుకోగా, గడువు ముగిసే చివరి రోజున ఆ సంఖ్య 19కి చేరింది. రెబెల్ అభ్యర్థు లను దారికి తెచ్చుకోవడంలో ప్రధాన పార్టీల నేతలు సఫలీకృతం కావడంతో ఉపసంహరణల పర్వం ఊపందుకుం ది.తుది జాబితా ప్రకారం ప్రధాన రాజకీ య పార్టీలైన కాంగ్రెస్,బి.ఆర్.ఎస్, బీజేపీలు చెరో 15 మంది అభ్యర్థు లను రంగంలోకి దింపాయి.ఈ మూడు పార్టీల మధ్యే పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది. వీరితో పాటు 7 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ అదృష్టా న్ని పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ 15,బిఆర్ఎస్ 15,బీజేపీ 15, స్వతంత్రులు 07మొత్తం 52 మంది పోటీ పడుతున్నట్లు తెలిపారు.ఉపసంహరణ గడువు ముగియడంతో ఇక ప్రచార పర్వం ఊపందుకోనుంది. వార్డు ల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



దేవరకద్ర నియోజకవర్గం లోని భూత్పూర్ మున్సిపాలిటీ 10 వార్డులకు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు స్థానిక నాయకుల సమక్షంలో బి–ఫారం లు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR)

# బీఆర్ఎస్ లో చేరికలు



**కామారెడ్డి, ఫిబ్రవరి 3 (వుదయం)**

:కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జులు నారడి నాగరాజు, రియాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో మంగళవారం చేరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని గోవర్ధన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాసర్ల స్వామి, పోలీస్ కృష్ణాజీరావు, పెద్దోళ్ల శశిధర్ రావు, నిట్టు లింగారావు, జూకంటి ప్రభాకర్, నీలం రాజలింగం, మునీరుద్దీన్, బాలస్వామి, దేవరి నరేష్, బాలకిషన్, తిమ్మక్కపల్లి ప్రవీణ్, విశాల్, భాను, కె.నరేష్, చిట్టకూరి రవి, మీసాల సత్యం, రాజ్ కుమార్, మీసాల నవీన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### మంథని మున్సిపల్ పోరులో

# మాచిడి గెలుపు పక్క

ఆశీర్వదించాలంటున్న మాజీ సింగిల్ విండో డైరెక్టర్

**మంథని ,ఫిబ్రవరి 03 (వుదయం )**




మంథని మున్సిపల్ ఎన్నికల్లో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మాచిడి రాజు గౌడ్ మూడో వార్డు నుండి బరిలో ఉన్నారు. గతంలో సింగిల్ విండో డైరెక్టర్ గా అనేక సేవా కార్యక్రమాలు చేశానని, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల్లో ఉన్నానని ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటెయ్యాలని ఆయన కోరారు. మంథని మున్సిపల్ లో మూడో వార్డును అభివృద్ధిలో అగ్రగామిక తీర్చి దిద్దుతానని ఆయన తెలిపారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆశీస్సులతో ప్రజాసేవకు ముందు వస్తున్నానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఆశీర్వదించి కారు
గుర్తుకు ఓటేస్తే... సేవకుడిలా పనిచేస్తానని ఆయన వివరించారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 94.39 శాతం మంది విద్యార్థుల హాజరు..

**జగిత్యాల ఫిబ్రవరి 03 (వుదయం )**

జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 94.39 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ బొప్పరాతి నారాయణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ విభాగంలో 884 మంది విద్యార్థులకు గాను 862 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 22 మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారన్నారు ఒకేషనల్ విభాగంలో 560 మంది విద్యార్థులకు గాను 501 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు మొత్తంగా 1444 మంది విద్యార్థులకు గాను 1363 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 81 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని దీంతో 94.39 శాతం హాజరు నమోదయిందన్నారు మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షల్లో జనరల్ విభాగంలో 724 మంది విద్యార్థులకు గాను 722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు ఒకేషనల్ విభాగంలో 516 మంది విద్యార్థులకు గాను 476 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 40 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు మొత్తంగా 1240 మంది విద్యార్థులకు గాను 1198 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని దీంతో 96.61శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు

# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

**మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ సందర్భంగా భద్రత ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**కామారెడ్డి, ఫిబ్రవరి 3 (వుదయం):**



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు మంగళవారం సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన పటిష్ట భద్రతా ఏర్పాట్లను ఆయన సమగ్రంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్.హెచ్.ఓ నరహరి, రూరల్ ఇన్స్పెక్టర్ రామన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## తరచుగా తుమ్ములు వస్తున్నాయా?



రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. కొందరు ఒకేసారి అనేకసార్లు తుమ్ముతుంటారు. దీంతో వారిలో ''నాకు రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గిపోయిందా?'' అనే సందేహం చాలామందిలో కలుగుతుంది. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? నిపుణులు ఏమంటున్నారు? పూర్తి వివరాలు తెలుసుకుందాం. తుమ్ము అనేది మన శరీరంలోని ఒక సహజ రక్షణ చర్య.

ముక్కులోకి దుమ్ము, అలెర్జీ కారకాలు, బ్యాక్టీరియా లేదా వైరస్‌లు ప్రవేశించినప్పుడు, వాటిని బయటకు పంపడానికి శరీరం తుమ్ము ద్వారా స్పందిస్తుంది. అంటే, తుమ్మడం అనేది శరీరం పనిచేస్తున్న సంకేతమే తప్ప, తప్పనిసరిగా బలహీనతకు గుర్తు కాదు. 1. అలెర్జీలు.. ఇదే అత్యంత సాధారణ కారణం. దుమ్ము, పుప్పొడి (పోలెన్), పెంపుడు జంతువుల వెంట్రుకలు, చలి గాలి, ఇవన్నీ తుమ్ములను ప్రేరేపిస్తాయి.2. వాతావరణ మార్పులు.. ఒక్కసారిగా చలి నుంచి వేడికి లేదా వేడి నుంచి చలికి మారితే ముక్కులోని నరాలు స్పందించి తుమ్ములు వస్తాయి.3. సైనసైటిస్ లేదా ముక్కు సమస్యలు.. సైనస్ ఇన్‌ఫెక్షన్, ముక్కులో వాపు ఉండటం వల్ల కూడా తుమ్ములు ఎక్కువవుతాయి.4. వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. జలుబు, ఫ్లూ మొదలైనవి ఉన్నప్పుడు తుమ్ములు సహజం.5. కాలుష్యం, రసాయన వాసనలు.. పెర్ఫ్యూమ్స్, సిగరెట్ పొగ, కెమికల్స్ కూడా తుమ్ములకు కారణం కావచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇది కొంతవరకు నిజమే. తరచూ తుమ్మడం అనేది ఎక్కువగా అలెర్జీ లేదా పర్యావరణ కారణాల వల్లే జరుగుతుంది. బలహీనమైన ఇమ్యూనిటీ ఉన్నవారికి సాధారణంగా.. తరచూ జలుబులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా రావడం, గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడటం, నిరంతర అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.కేవలం తుమ్ములే ఉన్నాయంటే అది ఇమ్యూనిటీ తక్కువగా ఉందని చెప్పలేం. కానీ, తరచుగా తుమ్మడం, పునరావృత జలుబు, గొంతు నొప్పి, అలసట లేదా తరచుగా అనారోగ్యాలు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతాలు. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, శరీరం బాహ్య అలెర్జీ కారకాలు, వైరస్లతో సమర్థవంతంగా పోరాడలేకపోతుంది. అందువల్ల, లక్షణాలు పదే పదే సంభవిస్తాయి.

## ఈ లక్షణాలు ఉంటే పైల్స్ వచ్చే అవకాశం ఎక్కువ?

చాలా మందికి రకరకాల సమస్యలు ఉంటాయి. ముఖ్యంగా సమస్యే. ముందస్తుగా లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకుంటే బాగుంటుందంటున్నారు నిపుణులు. చాలా మంది మలబద్ధ పెద్ద సమస్య కాదని భావిస్తారు. ప్రారంభ దశలో రు దానిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో కు మూలవ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు మాత్రమే కాదు, అన్ని వయసుల వారికి మలబద్ధకం రావచ్చు. వారి ఆహారం



దానికి ప్రధాన కారణం. దానిని సరిదిద్దకపోయినా ప్రారంభంలోనే మలబద్ధకం గుర్తించకపోతే అది ఫైల్స్‌గా మారే ప్రమా దం ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. అరుదుగా లేదా ఎక్కువసేపు మలవిసర్జన జరగడం మలబద్ధకం ప్రధాన లక్షణం. వారానికి మూడు లేదా అంతకంటే తక్కువ మలవిసర్జన జరగడం మలబద్ధకానికి సంకేతం. ఇది ఇలాగే కొనసాగితే మలబద్ధకం వచ్చే అవకాశం ఉంది. తరచుగా మలవిసర్జనలు జరుగుతున్నా లేదా ప్రతిరోజూ మలవిసర్జనలు జరిగినా, మలవిసర్జన సులభంగా జరగాలి. కానీ మలవిసర్జన గట్టిగా, పొడిగా మారితే అది మలబద్ధకం. కాఫీ తాగితేనే మల విసర్జన చేయగలం. మలవిసర్జన చేసే ముందు వేడినీరు తాగకపోతే అస్సలు మలవిసర్జన చేయలేరు. మలవిసర్జన చేసేటప్పుడు నొప్పి లేదా ఇబ్బంది లేకుండా చేయలేరు. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లయితే ఇది ఖచ్చితంగా మలబద్ధకమేనంటున్నారు నిపుణులు.రోజూ మలవిసర్జన చేసిన తర్వాత కూడా ప్రేగులలో వ్యర్థాలు ఉన్నప్పుడు, అజీర్ణం ఉన్నప్పుడు ఈ సమస్య వస్తుంది. సాధారణంగా మలవిసర్జన తర్వాత కడుపు ఖాళీగా, రిలాక్స్‌గా అనిపిస్తుంది. కానీ మలబద్ధకం సమస్య ఉంటే మలవిసర్జన తర్వాత కూడా కడుపు బరువుగా అనిపిస్తుంది. అది ఖాళీగా అనిపించదు. అసౌకర్యంగా అనిపిస్తుంది. ఇలా జరిగినట్లయితే కు ఫైల్స్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయంటున్నారు నిపుణులు.

ఆరోగ్య సమస్యలు. వీటిని నిర్లక్ష్యం చేసినట్లయితే తీవ్రమైన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఇక చాలా మందిలో ఫైల్స్ సమస్య కూడా ఉంటుంది. ఇది కూడా పెద్ద

## పసుపు పాలు తాగుతున్నారా?

ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే రు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, రు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు కు అందవు. కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.



## నెలసరి నొప్పుల్ని తగ్గిస్తాయట!

నెలసరి సమయంలో పొత్తి కడుపులో నొప్పి, నడుం నొప్పి, మూడ్ స్వింగ్స్.. వంటివన్నీ సహజమే! అయితే ఇలాంటి శారీరక నొప్పుల నుంచి ఉపశమనం పొందాలంటే కొన్ని ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. నానబెట్టిన ఎండు ద్రాక్షను తినడం ద్వారా నెలసరి సమయంలో ఎదురయ్యే శారీరక నొప్పులే కాదు.. మూడ్ స్వింగ్స్‌నీ దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఎండు ద్రాక్షలోని ఐరన్, ఫైబర్, ఖనిజాలు ఇందుకు దోహదం చేస్తాయని చెబుతున్నారు. అలాగే రక్తహీనత, మలబద్ధకం.. వంటి సమస్యలకూ దూరంగా ఉండచ్చంటున్నారు. నెలసరి నొప్పుల్ని, ఆ సమయంలో ఎదురయ్యే అసౌకర్యాన్ని దూరం చేసుకోవాలంటే కొన్ని దుంప కూరలను తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా చేమ దుంప, చిలగడదుంప.. వంటి దుంప జాతికి చెందిన కాయగూరలు ఈ సమయంలో నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయట. అరటి పండు నెలసరి నొప్పులకు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు. సాయంత్రం స్నాక్స్ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల రాత్రి పూట మితంగా ఆహారం తీసుకునే వీలుంటుంది. తద్వారా రాత్రుళ్లు హాయిగా నిద్ర పడుతుందంటున్నారు. శరీరంలో హార్మోన్లను సమతులంగా ఉంచుకోవడానికి ఇదీ ఓ ప్రక్రియే! ఫైబర్, పొటాషియం, విటమిన్ 'బి'.. వంటి పోషకాలు పుష్కలంగా లభించే ఈ పండు నెలసరి సమయంలో కొంతమందిలో ఎదురయ్యే కడుపుబ్బరం నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందట. అరటి పండుతో పాటు అరటి కాయ, అరటి పువ్వును వంటకాల్లో భాగం చేసుకొని తీసుకోవచ్చు. హార్మోన్లను సమతులంగా ఉంచడంలో అరటి పువ్వు కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.



## ఆరోగ్యానికి అమృతం లాంటి పండు

అలసట లేదా తరచుగా అనారోగ్యాలు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతాలు. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, శరీరం బాహ్య అలెర్జీ కారకాలు, వైరస్లతో సమర్థవంతంగా పోరాడలేకపోతుంది. అందువల్ల, లక్షణాలు పదే పదే సంభవిస్తాయి.

సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. మనం సపోటాను సాధారణ పండుగానే తీసుకుంటాం. కానీ, సపోటా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. పోషకాలతో నిండిన ఈ పండు మనకు చాలా సులభంగా దొరుకుతుంది. దుకాణాల్లోనే కాదు, చాలా ఇళ్లలో కూడా ఇది సాధారణంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. వారానికి కనీసం మూడు సార్లు సపోటా తినడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.కంటి సమస్యలు ఉన్నవారికి సపోటా మంచి ఆహారంగా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగుపరుస్తుంది. అదే విధంగా, విటమిన్ ఇ చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మెరిసేలా ఉండేందుకు సపోటా తోడ్పడుతుంది. సపోటాలో విటమిన్ అ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ అలసట, నీరసం అనుభవించే వారికి ఇది మంచి శక్తినిచ్చే పండు. రోజూ సపోటా తినడం వల్ల శరీరం ఉత్సాహంగా ఉంటుంది. నిపుణుల సూచనల ప్రకారం, రోజుకు 1 నుంచి 2 మధ్యతరహా సపోటాలు తినవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో, వైద్యుల సలహాతో సపోటాను తీసుకోవచ్చు. మొత్తానికి, తక్కువ ఖర్చుతో సులభంగా లభించే సపోటా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, రోజువారీ ఆహారంలో ఈ పోషక విలువల పండును తప్పక చేర్చుకోండి.



## ముప్పైల్లో అడుగుపెడుతున్నారా..!

మహిళలకు ముప్పైఏళ్లు రాగానే మన జీవనశైలిలో వీటిని భాగం చేసుకోమంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు, యవ్వనంగా కనిపించేలానూ చేస్తాయి. మనకి ముప్పై ఏళ్లు దాటిన తరవాత ఎముక సాంద్రత తగ్గుతూ వస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే రోజూ పిల్లలకి పాలు తాగించడమే కాదు, మనమూ పాలు తాగమంటున్నారు. వీటితోపాటు కాల్షియం ఎక్కువగా ఉండే నువ్వులు, రాగులు, మునగాకు వంటి వాటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. హార్మోనుల్లో మార్పు కారణంగా ప్రతి పదేళ్లకోసారి 3-8శాతం కండరాలు వాటి ద్రవ్యరాశిని కోల్పోతాయి. దీనినే సార్కోపెనియాగా చెబుతున్నారు శాస్త్రవేత్తలు. దీనివల్ల నెలసరి క్రమం తప్పడం, అలసట, బరువు తగ్గడం జరుగుతున్నాయి. దీన్ని అదుపు చేయాలంటే 15-20గ్రా. ప్రొటీన్ ప్రతీ భోజనంలోనూ అందేలా ఆహార నియమాలు పాటించాలి. వ్యాయామం అనగానే నడక మాత్రమే అనుకుంటాం. కానీ వారంలో కనీసం 3-5రోజులు స్ట్రెంత్ ట్రైనింగ్ తప్పనిసరిగా చేయాలి. ఈ వ్యాయామాలు కండరాలకు శక్తినివ్వడంతోపాటు, వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తాయి. ఏటా ప్రతి నలుగురిలో ఒకరు యాంగ్జయిటీ బారిన పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ఒత్తిడిని దాచుకోకుండా మనసుకి దగ్గరైన స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకుంటే దీన్నుంచి బయటపడొచ్చు. యోగ, ధ్యానం, డ్యాన్స్ వంటివి రొటీన్‌లో భాగం చేసుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర ఏడు గంటలకు తక్కువ కాకుండా చూసుకోవాలి. రోజూ పనులతో అలసిపోయిన మన శరీరం తిరిగి శక్తి పుంజుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. నిద్ర తక్కువైన మహిళల్లో కార్టిసాల్ స్థాయిలు పెరగడం, బరువు పెరగడం వంటివి వృద్ధాప్యానికి దారితీస్తున్నాయి.



## రక్తహీనతను తరిమి కొట్టే సజ్జల లడ్డూ

ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు పెద్దలు. అందుకే ఆరోగ్యంగా ఉండాలి అంటే తప్పకుండా మంచి ఆహారం తీసుకోవాలి. అయితే ఈ మధ్యకాలంలో చాలా మంది రక్తహీనత, ఎముకల బలహీనతతో బాధపడుతున్నారు. అలాంటి వారు మంచి ఐరన్, ఫైబర్ ఉండే సజ్జల లడ్డు రోజుకు ఒకటి తిన్నారంటే, ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. మరి దీనిని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.



కావాల్సిన పదార్థాలు: సజ్జలు అర కిలో, బెల్లం 500 గ్రాములు, నెయ్యి 10 టీస్పూన్స్, తెల్ల నువ్వులు, వేరుశనగలు 100 గ్రాములు, బాదం 75 గ్రాములు, ఎండు ద్రాక్ష 25 గ్రాములు, ఏలకుల పొడి వన్ టీ స్పూన్, శొంఠి పొడి పావు టీస్పూన్, ఉప్పు చిటికెడు. తయారీ విధానం: ముందుగా స్టవ్ వెలిగించి, దానిపై పాన్ పెట్టుకొని సజ్జలను వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు సజ్జల పిండి రెడీ అయిపోయింది. ఇప్పుడు మరో పాన్ తీసుకొని అందులో కొంచె నెయ్యి వేసి, తెల్ల నువ్వులు, వేరుశనగ పప్పులు, బాదం, ఎండు ద్రాక్ష వేసి దోరగా వేయించుకోవాలి. తర్వాత వీటిని పక్కన పెట్టి, అదే పాన్‌లో మరో టీ స్పూన్ నెయ్యి వేసి, మనం మిక్సీ పట్టుకున్న పిండిని దోర దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు వేయించిన నువ్వులు, పల్లీలు, బాదం అన్నింటినీ మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఈ పొడిని పక్కన పెట్టుకొని, ఒక పెద్ద బౌల్ తీసి, అందులో మనం వేయించి పక్కన పెట్టుకున్న సజ్జల పిండిని, మిక్సీ పట్టిన వేరుశనగ, నువ్వుల మిశ్రమాన్ని వేసి, కొంచెం ఉప్పు వేసి, మంచిగా కలుపుకోవాలి. ఇప్పుడు బెల్లం పాకం ప్రిపేర్ చేసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి, అందులో అర కప్పు నీళ్లు పోసి, అవి మరిగిన తర్వాత బెల్లం వేసి, పాకం వచ్చే వరకు మరిగించుకోవాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, కొంచెం చల్లారిన తర్వాత అందులో సజ్జల పిండిని వేసి మంచిగా ఉండలు లేకుండా కలుపుకోవాలి.దీని తర్వాత చేతికి నెయ్యిని రాసుకొని, సజ్జల పిండిని చిన్నగా లడ్డూల మాదిరి చుట్టుకోవాలి. అంతే ఆరోగ్యాన్ని ఇచ్చే టేస్టీ టేస్టీ సజ్జల లడ్డూలు రెడీ.

# అమెరికాతో ట్రేడ్ డీల్.. క్లారిటీ ఇచ్చిన కేంద్రం

బిజినెస్




అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ విజయవంతంగా పూర్తిచేయడంతో.. ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ క్రమంలో కేంద్రం ఈ ట్రేడ్ డీల్ పై క్లారిటీ ఇచ్చింది. నిషేధిత దేశాల నుంచి భారత్ ముడిచమురును కొనుగోలు చేయదని స్పష్టం చేసింది. ఈ ఒప్పందంలో భాగంగా వెనిజులాతో సహా ఆంక్షలు లేని దేశాల నుంచి ధరల ఆధారంగా భారత్ ముడి చమురును కొనుగోలు చేస్తూనే ఉంటుందని కూడా తెలిపింది. వెనిజులాపై ఆంక్షలున్న సమయంలో అక్కడి నుంచి ముడిచమురును కొనుగోలు చేయలేదని గుర్తు చేసింది. ఇప్పుడు ఆ ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో మళ్లీ ముడిచమురు కొనుగోలను ప్రారంభిస్తామని కేంద్రం వెల్లడించింది. ఇంధన కొనుగోళ్లలో ఎప్పటికీ ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని వెల్లడించింది. దేశ వ్యవసాయం, పాడిశ్రమలను కాపాడుకుంటామని, అది తమ బాధ్యత అని కేంద్రం పేర్కొంది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలిగించదని కేంద్ర ప్రభుత్వ ఉన్నత వర్గాలు వెల్లడించాయి. భారత్ – అమెరికా ట్రేడ్ డీల్ ద్వార్ ద్వైపాక్షిక వాణిజ్యం భవిష్యత్తులో లక్షంగా పెట్టుకున్న 500 బిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉన్నట్లు కేంద్ర వర్గాలు వెల్లడించాయి. అమెరికాతో భారత్ ఆర్థిక సంబంధాలను ఎప్పకప్పుడు బలోపేతం చేస్తూనే ఉంటుందని, దేశీయ ప్రయోజనాలను కాపాడుకోవడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాయి. ట్రేడ్ డీల్ అమలు విధానాన్ని త్వరలోనే పూర్తి వివరాలతో వెల్లడిస్తామని కేంద్రవర్గాలు తెలిపాయి.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..
### రాజ్యసభలో జేపీ నడ్డా కీలక ప్రకటన



గత 9 నెలలుగా నెలకొన్న వివాదానికి తెరదించుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎక్స్ వేదిక సంచలన ప్రకటన చేశారు. భారత్–అమెరికా మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరిందని, భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే వస్తువులపై 18 శాతం టారిఫ్స్ మాత్రమే విధిస్తామని ప్రకటించారు.ఈ ప్రకటనతో భారత, అమెరికా వ్యాపార వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా.. భారత పార్లమెంట్‌లో మాత్రం ప్రతిపక్షాల నిరసనకు దారి తీసింది. భారత్–అమెరికా మధ్య కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి, రాజ్యసభ పక్ష నేత జేపీ నడ్డా రాజ్యసభ వేదికగా స్పందించారు. ఈ ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే ఉభయ సభల్లోనూ సుమోటో ప్రకటన చేయడమే కాకుండా, దానిపై సమగ్ర చర్చకు కూడా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. సాయంత్రం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల తగ్గింపు గురించి, ప్రధాని మోడీని తన 'నిజమైన మిత్రుడు' అని పేర్కొంటూ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్లను నడ్డా ప్రస్తావించారు. దీనికి ప్రతిస్పందనగా ప్రధాని మోడీ కూడా ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, వాణిజ్య సంబంధాల బలోపేతం పై ట్వీట్ చేశారని ఆయన సభకు వివరించారు. ప్రభుత్వం అన్ని వివరాలను బహిర్గతం చేయడానికి, చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్, ఇండి కూటమి సభ్యులు సభలో ఆందోళన చేయడం సరైన పద్ధతి కాదని ఈ సందర్భంగా జేపీ నడ్డా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు వారి నిరాశను ప్రతిబింబిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఒప్పందంలోని ప్రతి చిన్న అంశాన్ని ప్రభుత్వం నేడు సభ ముందు ఉంచుతుందని, కాబట్టి ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన కోరారు.

## దేశీయ కరెన్సీ సరికొత్త జోరు..
### భారీగా పెరిగిన రూపాయి విలువ

అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు, డాలర్ బలపడటం వంటి కారణాలతో కొంత కాలంగా నెల చూపులు చూసిన రూపాయి విలువ ఈ రోజు భారీగా పెరిగింది. భారత్ –అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశీయ కరెన్సీకి కొత్త ఊపిరి పోసింది. మంగళవారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే 119 పైసలు పెరిగి 90.30 వద్ద స్థిరపడింది. అమెరికా విధిస్తున్న సుంకాలను 25 శాతం నుంచి 18



శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి 90.30 వద్ద ప్రారంభమైంది. ఇది సోమవారం నాటి ముగింపు (91.49) కంటే 119 పైసలు ఎక్కువ. సుంకాల తగ్గింపుతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ బలోపేతం కావడంతో, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తిరిగి భారతీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఫారెక్స్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. ఈ సానుకూల వార్తతో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీ లాభాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ 2,138 పాయింట్లు (2.62%), నిఫ్టీ 607 పాయింట్లు (2.42%) మేర పెరగడంతో రూపాయి విలువ కూడా పెరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితులపై ఫిన్రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ఎల్ఎల్పి గ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలీ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గడం భారతీయ ఎగుమతిదారులకు అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ఆధిక్యాన్ని అందిస్తుంది" అని తెలిపారు. దాదాపు 9 నెలల నిరీక్షణ తర్వాత వచ్చిన ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## భారత్‌పై యూఎస్ సుంకాల తగ్గింపు
### భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు




భారత ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై విధిస్తున్న సుంకాలను భారీగా తగ్గిస్తూ చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల అనంతరం, భారత్‌ను తన గొప్ప స్నేహితుడుగా అభివర్ణిస్తూ ట్రంప్ ఈ డీల్‌ను ఖరారు చేశారు. ఈ పరిణామంతో ఇవాళ భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా రాకెట్‌లా దూసుకుపోయాయి. ట్రంప్ ప్రకటనతో ఇన్వెస్టర్లలో నూతనోత్సాహం నెలకొంది. దీంతో సెన్సెక్స్ ఏకంగా 2,500 పాయింట్లకు పైగా లాభపడి రికార్డు సృష్టించింది. మరోవైపు నిఫ్టీ దాదాపు 760 పాయింట్లకు పైగా ఎగబాకింది. అదేవిధంగా అమెరికాకు ఎగుమతులు చేసే ఎ* సర్వీసెస్, ఫార్మా, టెక్స్‌ల్స్, జెమ్స్, జ్యువెలరీ ఆటోమొబైల్ రంగాల షేర్లు భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. ముఖ్యంగా ఎగుమతిదారుల మధ్య పోటీ పెరగడం వల్ల కార్పొరేట్ ఆదాయాలు వృద్ధి చెందుతాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. కాగా, గతంలో భారత్‌పై 25 శాతంగా సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లుగా అమెరికా ప్రకటించింది. అదేవిధంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్ల కారణంగా గతంలో విధించిన అదనపు 25 శాతం శిక్షాత్మక సుంకాన్ని అమెరికా పూర్తిగా తొలగించింది.
దీంతో ఎఫెక్టివ్ టారిఫ్ 50 శాతం నుంచి 18 శాతానికి పడిపోయింది. భారత్ ఇకపై రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసి, అమెరికా, వెనిజులా నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకోవడానికి అంగీకరించింది. అదేవిధంగా అమెరికా వస్తువులపై భారత్ విధిస్తున్న సుంకాలను కూడా భవిష్యత్తులో జీరోకు తగ్గించేలా రెండు దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి.

## వాట్సాప్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్




దిగ్గజ టెక్ సంస్థ మెటాపై (ఓవబిజీ) సుప్రీంకోర్టు సీరియస్ అయింది. భారత చట్టాలను పాటించకపోతే దేశం విడిచి వెళ్లిపోవచ్చంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. వాట్సాప్ గోప్యతా విధానంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాట్సాప్ మాతృసంస్థ మెటాను సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ తీవ్రంగా హెచ్చరించారు.' మా దేశ ప్రజల గోప్యతతో రు ఆటలాడలేరు. మా డేటాలో సింగిల్ డిజిట్ కూడా పంచుకునేందుకు మేము అనుమతించమని స్పష్టం చేశారు. భారత చట్టాలను పాటించడం ఇష్టం లేకపోతే ఈ దేశం విడిచిపెట్టవచ్చని సీరియస్ కామెంట్స్ చేశారు. వాట్సాప్ 2021 గోప్యతా విధాన నవీకరణను పరిశీలిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (అఅఎ) నవంబర్ 2024లో జారీ చేసిన ఉత్తర్వుల నుండి ఈ వివాదం తలెత్తింది. మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని ఉపయోగించి వినియోగదారులను కొత్త గోప్యతా విధానాన్ని తప్పనిసరిగా అంగీకరించేలా వాట్సాప్ ఒత్తిడి తీసుకువచ్చిందని సీసీఐ పేర్కొంది. వాట్సాప్ మెసేజింగ్ సేవలను కొనసాగించాలంటే మెటా ఇతర ప్లాట్‌ఫార్మ్‌లతో డేటా పంచుకోవడానికి అనుమతి ఇవ్వాల్సిందేనని వినియోగదారులకు తెలిపిందని సీసీఐ ఆక్షేపించింది. ఈ చర్య పోటీ చట్టానికి విరుద్ధమని భావించి రూ.213 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశించింది. ఈ ఉత్తర్వును మెటా, వాట్సాప్ 2025 జనవరిలో సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. 2025 నవంబర్‌లో న్యాయ ్రబ్యునల్ వాట్సాప్ డేటా షేరింగ్‌పై ఐదేళ్ల నిషేధాన్ని రద్దు చేసింది. అయితే రూ.213 కోట్ల జరిమానాను మాత్రం యథాతథంగా ఉంచింది. తాజాగా ఇవాళ విచారణ జరిపిన ధర్మాసనం మెటా తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

క్రీడలు



## భారత షట్లర్లకు పరీక్ష

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కఠిన సవాల్‌కు సిద్ధమైంది. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో భారత మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. అయితే స్టార్ షట్లర్ పి.వి.సింధు గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో భారత్‌కు అతి పెద్ద ప్రతికూలత. సింగిల్స్‌లో తన్వి శర్మ, ఉన్నతి హుడా, మాళవిక బాన్సోద్, రష్మిక శ్రీ.. డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ, ప్రియ.కె, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టోలు భారత్ తరపున పోరాడనున్నారు. బుధవారం గ్రూపు–వై పోరులో మయన్మార్‌తో భారత్ తలపడనుంది. 2016, 2020లో కాంస్య పతకాలు సాధించిన భారత పురుషుల జట్టుకు లక్ష్యసేన్ సారథ్యం వహించనున్నాడు. కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, సాయి ప్రతీక్, పృథ్వీ కృష్ణమూర్తి, హరిహరన్ ఆధ్వర్యంలో భారత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గ్రూపు–సి పోరులో సింగపూర్‌తో భారత్ పోటీపడనుంది.

## టీ20 ప్రపంచకప్: పాక్ బహిష్కరణ నిర్ణయం



పాకిస్తాన్ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో గ్రూప్–స్టేజ్ మ్యాచ్‌ను బహిష్కరించే నిర్ణయం తీసుకోవడంపై ప్రస్తుత పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ ఆలీ ఆఘా తనదైన స్పందన ఇచ్చారు. ఆఘా స్పష్టం చేసినట్లు, ఈ నిర్ణయం అటు ఆటగాళ్ల చేతిలో లేదని, అది ప్రభుత్వం మరియు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (ఖఅః) ఆదేశాల ప్రకారమే తీసుకున్నదని చెప్పారు. 'మేము ప్రపంచకప్‌లో పాల్గొంటున్నాం, కానీ భారత్‌తో మ్యాచ్ ఆడకపోవడం మాకు నిర్ణయించే అధికారము లేదు, ఇది ప్రభుత్వం మరియు బోర్డు చెప్పినదే' అన్నట్లు ఆయన తెలిపారు, అలాగే ఆటగాళ్లకు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకునే హక్కు లేదన్న విషయాన్ని కూడా స్పష్టం చేశారు.ఇది పాకిస్తాన్‌లో మరియు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో వివిధ స్పందనలకు దారితీసింది. కొన్ని మాజీ పాక్ క్రికెటర్లు ఈ నిర్ణయాన్ని సిద్ధాంతపూర్వక ప్రిన్సిపుల్స్ నిర్ణయం అని మద్దతు ఇచ్చారు, అలాగే కొన్ని రాజకీయాన్ని క్రీడతో విడదీయాలన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. కొన్ని వ్యాఖ్యలు క్రికెట్‌ను రాజకీయాలు ప్రభావితం చేయకూడదు అని హెచ్చరించాయి, అలాగే ఎఅఅ నిర్ణయాలపై పాక్ విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, కెప్టెన్, మాజీ క్రికెటర్లు నిర్ణయం తమ చేతిలో లేదని, ప్రభుత్వ నిర్ణయాన్ని పాటిస్తామని చెప్పగా, కొందరు వాటిని క్రీడాభిమానులకు ప్రతికూలంగా చూడవచ్చు అని సూచిస్తున్నారు. అంతర్జాతీయంగా కూడా క్రికెట్ మరియు రాజకీయాల సంబంధంపై సమగ్ర వాదనలు కొనసాగుతున్నాయి.

## ఐసీసీకి పోటీగా కొత్త క్రికెట్ బోర్డు?
### పీసీబీ ప్లాన్ ఆదిలోనే ఫెయిల్!



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోసారి అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ప్రత్యామ్నాయంగా తమకంటూ ఒక ఐసీసీ స్థాయి క్రికెట్ సంస్థను ఏర్పాటు చేయాలన్న పీసీబీ ప్రయత్నం పూర్తిగా విఫలమైనట్లు సమాచారం.ఈ ప్రతిపాదనకు మద్దతు కోరుతూ పీసీబీ ఏకంగా ఎనిమిది దేశాల క్రికెట్ బోర్డులను సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే వాటిలో కేవలం రెండు దేశాలు మాత్రమే సానుకూలంగా స్పందించడంతో పీసీబీకి ఊహించని షాక్ తగిలింది.కొత్త అంతర్జాతీయ క్రికెట్ బోర్డు ఏర్పాటుకు చైనా, బంగ్లాదేశ్, యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ స్టేట్స్, వెస్టిండీస్, జింబాబ్వే వంటి దేశాలతో పీసీబీ చర్చలు జరిపినట్లు సమాచారం. ఐసీసీ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న దేశాలను ఏకం చేసి కొత్త సంస్థను ఏర్పాటు చేయాలన్నదే పీసీబీ ఆలోచనగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రతిపాదనకు ప్రపంచ క్రికెట్ నుంచి పెద్దగా స్పందన రాలేదు.పీసీబీ సంప్రదించిన ఎనిమిది బోర్డుల్లో ఆరు బోర్డులు ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు తెలుస్తోంది. యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యుఎస్ఏ, వెస్టిండీస్, జింబాబ్వే ఈ ఆలోచనకు నో చెప్పినట్లు టాక్. కేవలం చైనా, బంగ్లాదేశ్ మాత్రమే పీసీబీ యోచనకు మద్దతు తెలిపినట్లు సమాచారం.ఆరు దేశాల తిరస్కరణతో ఐసీసీకి ప్రత్యామ్నాయంగా సంస్థ ఏర్పాటు చేయాలన్న పీసీబీ ఆలోచన తొలి దశలోనే కుప్పకూలిస్తుంది. ఈ పరిణామంపై క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఐసీసీకి పోటీగా మరో అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ముందుగా పాకిస్థాన్ క్రికెట్ తన అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆట అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నెటిజన్లు సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే, పీసీబీ మరోసారి అనవసర నిర్ణయాలతో క్రికెట్ ప్రపంచంలో విమర్శల పాలయ్యిందన్న అభిప్రాయం సోషల్ డియాలో వ్యక్తమవుతోంది.

## హెచ్‌సీఏ కొత్త అధ్యక్షుడిగా అమర్‌నాథ్..
### ఉత్తర్వులు జారీ చేసిన అంబుడ్స్‌మన్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కొత్త ప్రెసిడెంట్‌గా అమర్‌నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇవాళ బీసీసీఐ అంబుడ్స్‌మన్ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అరెస్ట్ అయ్యాక గత 9 నెలలుగా హెచ్‌సీఏ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. ఈ క్రమంలోనే తనను హెచ్‌సీఏ అధ్యక్షుడిగా నియమించాలంటూ ఇటీవలే అమర్‌నాథ్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న అంబుడ్స్‌మన్, అమర్‌నాథ్‌ను హెచ్‌సీఏ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 20, 2023న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో 'యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ' ప్యానెల్ అభ్యర్థి జగన్‌మోహన్ రావు తన సప ప్రత్యర్థి అమర్‌నాథ్‌పై కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. మొత్తం అసోసియేషన్‌లో 173 ఓట్లు ఉండగా, 169 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో జగన్‌మోహన్ రావుకు 63 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 62 ఓట్లు వచ్చాయి. దీంతో నాడు జగన్‌మోహన్ రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

## భారత్‌లో మళ్లీ ఫార్ములావన్!
### భారత్‌లో మళ్లీ ఫార్ములావన్ కార్లు రయ్‌రయ్‌మంటూ



దూసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో ఈ ఆటను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఆసక్తిని ప్రదర్శిస్తోంది. జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో 2011లో గ్రేటర్ నోయిడాలోని బుద్ధా సర్క్యూట్‌లో తొలిసారి ఎఫ్–1 రేసు జరిగింది. చివరగా 2013లో రేసు నిర్వహించారు. పన్నుల విషయంలో వివాదం, ఇతర సమస్యలతో భారత్‌కు ఫార్ములావన్ దూరమైంది. ఫార్ములావన్ పునరుద్ధరణ కోసం కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఇప్పటికే బుద్ధా సర్క్యూట్‌ను పరిశీలించారని.. ప్రస్తుతం ఈ రేసింగ్ ట్రాక్ నిర్వహణను చూస్తున్న యమున ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో మాట్లాడారని తెలిసింది. ఈ ట్రాక్‌ను సొంతం చేసుకోవాలని అదానీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్‌లో మళ్లీ ఎఫ్–1 ట్రాక్ సందడిగా మారే అవకాశాలున్నాయి. "ఎఫ్–1 రేసును నిర్వహించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. ఆ సమస్య త్వరలో తీరుతుందని ఆశిస్తున్నాం. ఎఫ్–1 రేసును పునరుద్ధరించేలా చేస్తామని క్రీడల మంత్రి నిర్వాహకులకు భరోసా ఇచ్చారు" అని భారత ఫార్ములావన్ వర్గాలు తెలిపాయి. ఎఫ్–1 రేసు నిర్వహించాలంటే ఏడాదికి రూ.200 కోట్ల నుంచి 500 కోట్ల వరకు వ్యయం అవుతుంది.

## టీ20 ప్రపంచ కప్.. బోణీ కొట్టిన భారత జట్టు

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ కంటే ముందు భారత జట్టు శుభారంభం అందుకుంది. వార్మప్ మ్యాచ్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జట్టును ఓడించి బోణీ కొట్టింది భారత జట్టు. దీంతో భారత అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ ఫిబ్రవరి 7వ తేదీన అంటే మరో ఐదు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇవాళ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, భారత జట్ల మధ్య వార్మప్ మ్యాచ్ జరిగింది. ఇందులో 38 పరుగుల తేడాతో భారత జట్టు విక్టరీ కొట్టింది. టీ20 ప్రపంచ కప్ 2026 నేపథ్యంలో నవీ ముంబై వేదికగా జరిగిన ఈ వార్మప్ మ్యాచ్ లో ఇండియా మొదటి బ్యాటింగ్ చేసింది. ఈ నేపథ్యంలో 20 ఓవర్లు ఆడిన భారత జట్టు, కేవలం మూడు వికెట్లు నష్టపోయి 238 పరుగులు సాధించింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పోరాడి ఓడింది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా. 19.4 ఓవర్లు ఆడి 200 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో వార్మప్ మ్యాచ్ లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఓటమి చవి చూసింది. ఇది ఇలా ఉండగా, టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో ఇవాళ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో వార్మప్ మ్యాచ్ ఆడిన భారత జట్టు.. మరో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది.



# వుదయం సినిమా

పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీకి

## సూపర్ స్టార్ కానుక



**చెన్నై:** తనకు దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీని సూపర్ స్టార్ రజనీకాంత్ మెచ్చుకోవడంతో పాటు బంగారు గొలుసును కానుకగా అందించారు. చెన్నై మహానగర పాలకసంస్థలో కార్మికురాలిగా పని చేస్తున్న పద్మ (50) ఇటీవల తనకు రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి పలువురు మన్ననలు అందుకున్నారు. తాజాగా ఆమెను అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సన్మానించారు. తన ఇంటికి పిలిచి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడిన రజనీకాంత్ ఆమెకు ఒక బంగారపు గొలుసును కానుకగా ఇచ్చారు. ఇక పద్మకు భారత తపాలా శాఖ ఇటీవల అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించారు. ఆమెను అభినందిస్తూ ప్రభుత్వం తరపున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో అందించించిన సంగతి తెలిసిందే.

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. 'ధురంధర్:ది రివెంజ్' పేరుతో మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా.. రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. 'ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది'' అని రణ్‌వీర్ సింగ్ రివెంజ్ డైలాగుతో అదరగొట్టారు.

## ధురంధర్ 2 ది రివెంజ్ టీజర్ విడుదల




## నాలుగేళ్లు విరామం తీసుకున్నా

– మాధవన్



విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ చెప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు.

''నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను. కనీసం ప్రకటనల్లో కూడా నటించలేదు. దేశంలో పర్యటించాను. గడ్డం పెంచుకొని చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతిఒక్కరితో మాట్లాడాను. వాళ్ల జీవనశైలి, వారిని ఇబ్బందిపెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ నాలుగేళ్ల పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది'' అని మాధవన్ అన్నారు. విరామం తర్వాత చేయాలనుకున్న పాత్రలపై మరింత స్పష్టత వచ్చిందని మాధవన్ అన్నారు. తాను తిరిగి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో కొందరు దర్శక నిర్మాతలకు ముందుచూపు లేదని తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి కొత్త దర్శకులను వెతుకున్నట్లు వెల్లడించారు.

ఇటీవల 'ధురంధర్'లో కనిపించి ఆకట్టుకున్న మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు.

## అలా మొదలైంది జర్నీ

దుల్కర్, శివకార్తికేయన్



ఎన్ని సినిమాలు చేసినా నటులకు తొలి చిత్రం ఎంతో అపురూపం. ఆ మూవీ విడుదల తేదీ ప్రత్యేకం. అలా మలయాళ హీరో దుల్కర్ సల్మాన్, తమిళ హీరో శివకార్తికేయన్‌కు ఫిబ్రవరి 3 స్పెషల్ కావడం యాదృచ్ఛికం. టాలీవుడ్‌లోనూ వీరికి క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. మరి, వీళ్లు ఏయే సినిమాలతో ప్రేక్షకులకు పరిచయమయ్యారు?

### తండ్రికి తగ్గ తనయుడు..

అగ్ర నటుడు మమ్ముట్టి వారసుడిగా 'సెకండ్ షో' సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చారు దుల్కర్ సల్మాన్. 2012లో ఇదే రోజున విడుదలైంది. మూవీ కమర్షియల్ హిట్ కావడంతో పాటు దుల్కర్ నటనకూ మంచి పేరొచ్చింది. సినీ నేపథ్యం ఈ హీరో పరిచయానికే పరిమితమైంది. తర్వాత తండ్రి ప్రస్తావన లేకుండా సినిమాలు చేస్తూ.. నటనలో తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. 'ఉస్తాద్ హోటల్', 'పట్టమ్ పోలే', 'బెంగళూర్ డేస్', 'ఓ కాదల్ కన్మణి'.. ఇలా మలయాళం, తమిళం చిత్రాల్లో వైవిధ్యం ప్రదర్శించి, 'మహానటి'తో టాలీవుడ్‌కు పరిచయం అయ్యారు. 'సీతారామం', 'లక్కీ భాస్కర్'.. ఇలా తెలుగులో నటించినవన్నీ ఆయనకు విజయాల్ని అందించడం విశేషం. ఎంతోమందికి ఫేవరెట్‌గా మారిన దుల్కర్.. ప్రస్తుతం తెలుగులో 'ఆకాశంలో ఒక తార', రవి నేలకుదిటి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇది ఆయనకు 41వ చిత్రం. మలయాళంలో 'ఐయామ్ గేమ్'లో యాక్ట్ చేస్తున్నారు. నిర్మాతగానూ మంచి గుర్తింపు దక్కింది. ఆయన నిర్మించిన 'కొత్తలోక'.. మలయాళ చిత్ర పరిశ్రమలోనే అత్యధిక కలెక్షన్లు (రూ.300+ కోట్లు) రాబట్టిన సినిమాగా రికార్డు సృష్టించింది.

### హోస్ట్ నుంచి హీరోగా..

కాలేజీ రోజుల్లో మిమిక్రీ చేస్తూ.. ఓ స్టాండప్ కామెడీ షో విజేతగా నిలిచి, తర్వాత హోస్ట్‌గా బుల్లితెరపై ప్రేక్షకులను అలరించి, హీరోగా మారి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు శివకార్తికేయన్. 2012 ఫిబ్రవరి 3న విడుదలైన 'మెరీనా'తో తమిళ ఆడియన్స్‌కు కథానాయకుడిగా పరిచయం అయ్యారు. బాక్సాఫీసు వద్ద హిట్ కావడంతోపాటు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులూ అందుకుందీ చిత్రం. 'ఖాకీ సత్తై'లాంటి యాక్షన్ సినిమాలు, 'రెమో'లాంటి రొమాంటిక్ కామెడీ చిత్రాలతో కోలీవుడ్‌ను ఆకట్టుకున్నారు. 'రెమో', 'డాక్టర్', 'డాన్' సినిమాలు తెలుగు ఆడియన్స్‌నూ ఆకట్టుకున్నాయి. 'కౌసల్య కృష్ణమూర్తి'తో 2019లో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగు దర్శకుడు అనుదీప్ కేవీతో 'ప్రిన్స్' మూవీ చేశారు. ఆయన 25వ సినిమా 'పరాశక్తి' జనవరి 10న తమిళంలోనే విడుదలైంది. అభిరుచి గల ప్రొడ్యూసర్ అనిపించుకున్నారు. ఆయన నిర్మించిన 'కొట్టుకాళి'.. 53వ ట్రాన్సిల్వేనియా అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై, ప్రత్యేక జ్యూరీ పురస్కారం పొందింది.




## క్లాస్.. ఇప్పుడు మాస్.. ఆనంద్ తక్షకుడు టీజర్

'మిడిల్‌క్లాస్ మెలొడీస్'తో విజయం అందుకుని, హిట్ కాంబోగా నిలిచారు హీరో ఆనంద్ దేవరకొండ – డైరెక్టర్ వినోద్ అనంతోజు. ఇదే కాంబినేషన్‌లో దానికి భిన్నంగా యాక్షన్ థ్రిల్లర్ మూవీ రూపొందుతోంది. నేరుగా ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీజర్ ను తాజాగా రిలీజ్ చేశారు. 'లాపతా లేడీస్' ఫేమ్ నీతాన్షీ గోయెల్ ఈ సినిమాలో హీరోయిన్.

## సినిమానా.. బూతు పురాణమా?

హీరోపై నెటిజన్స్ ఫైర్

ఈ రోజుల్లో సినిమాకు ప్రమోషన్స్ చేయడం చాలా ముఖ్యం. కథపై దర్శకుడికి నమ్మకమున్నా సరే మూవీ ప్రమోషన్స్ చేస్తే జనాల్లోకి వెళ్తుంది. అందుకే ట్రైలర్ లాంఛ్ ఈవెంట్స్‌తో పాటు ప్రీ రిలీజ్, సాంగ్ రిలీజ్‌ల పేరుతో ప్రమోషన్స్ నిర్వహిస్తుంటారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా మూవీకి సంబంధించి ఆసక్తికర విషయాలను ఆడియన్స్‌తో పంచుకుంటారు. దీనివల్ల సినిమాపై అభిమానుల్లో ఓ రకమైన క్యూరియాసిటీ పెరుగుతుంది. అలా సినిమాలకు ప్రేక్షకులను తీసుకొచ్చేందుకు ప్రమోషన్స్ అనేది సినీ ఇండస్ట్రీలో తప్పనిసరి.

అయితే ప్రమోషన్స్ పేరిట ఆడియన్స్‌ను తమవైపు తిప్పుకునేందుకు చాలా ప్రయత్నాలు చేస్తుంటారు. అంతేకాకుండా అప్పుడప్పుడు కాంట్రవర్సీలు కూడా జరుగుతుంటాయి. తాజాగా టాలీవుడ్ ఇండస్ట్రీలో మరోసారి అలాంటిదే జరిగింది. బరాబర్ ప్రేమిస్తా అనే మూవీ ఈనెల 6వ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో టాలీవుడ్ యంగ్ యాక్టర్ చంద్రహాస్ నటించారు. రిలీజ్‌కు దగ్గరవుతున్న వేళ సోమవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు మేకర్స్.

అంతా బాగానే ఉన్నా.. ఈవెంట్‌లో పాడిన ఓ సాంగ్ తీవ్ర వివాదానికి దారితీసింది. హీరో చంద్రహాస్ ఒక వివాదాస్పదమైన బూతు పాట పాడటం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో సినీ ప్రియులే కాదు.. నెటిజన్స్ సైతం తీవ్రస్థాయిలో అతనిపై మండిపడుతున్నారు. సినిమా ప్రమోషన్స్ కోసం ఇంత బరితెగించాలా అంటూ గడ్డిపెడుతున్నారు. అసలు ఆ బూతు పాటలేంటని మండిపడుతున్నారు. కేవలం నెగెటివ్ పబ్లిసిటీ కోసమే ఇంతలా అసభ్యకర భాషను వాడతారా అని నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సినిమా పబ్లిసిటీ కోసం ఇంత దిగజారాలా అంటూ కామెంట్స్ పెడుతున్నారు.




## అలాంటి వారికి నిద్ర ఎలా పడుతుంది

– రకుల్‌ప్రీత్ సింగ్

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై నటీనటులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు.

''పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదు'' అని అన్నారు.

ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



## ఆయనపై ఇంకా గౌరవం పెరిగింది

ఎన్టీఆర్‌పై పూజా బేడీ ప్రశంసలు..

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్‌పై బాలీవుడ్ నటి పూజా బేడీ ప్రశంసలు కురిపించారు. తామిరువురు కలిసి నటించిన 'శక్తి' మూవీ షూటింగ్‌ను గుర్తుచేసుకుంటూ.. నటుడిని కొనియాడారు. 'బరాబర్ ప్రేమిస్తా' మూవీ ఈవెంట్‌లో.. గతంలో నటించిన తెలుగు సినిమాల ప్రస్తావన రాగా ఎన్టీఆర్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ''శక్తి'లో నేను సోనూసూద్‌కు భార్యగా నటించా. అందులో నాది నెగెటివ్ ఛాయలున్న పాత్ర. ఓ సన్నివేశంలో హీరో నాతో ఫైట్ చేయాల్సి వస్తుంది. కానీ, అందుకు ఎన్టీఆర్ నిరాకరించారు. ఎలాంటి పాత్రైనా మహిళలతో ఫైట్ చేయనన్నారు. అదీ ఆయన వ్యక్తిత్వం. అప్పుడు ఆయనపై ఇంకా గౌరవం పెరిగింది'' అని పేర్కొన్నారు. ఫాంటసీ యాక్షన్ మూవీగా రూపొందిన 'శక్తి' 2011 ఏప్రిల్‌లో విడుదలైంది. అంత కన్నా 18 ఏళ్ల ముందే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు పూజాబేడీ. మోహన్‌బాబు హీరోగా తెరకెక్కిన 'చిట్టెమ్మ మొగుడు'లో వైద్యురాలి పాత్ర పోషించారు. 'బరాబర్ ప్రేమిస్తా'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. చంద్రహాస్ హీరోగా నటించిన ఈ సినిమా ఫిబ్రవరి 6న విడుదల కానుంది.








## నవ్విస్తోన్న 'సూపర్ సుబ్బు' టీజర్

ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' ఒరిజినల్ వెబ్‌సిరీస్ 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీశర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్ ఇదే ప్లాట్‌ఫామ్‌పై త్వరలో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. కొడుకు చేసే పనులు నచ్చని తండ్రి, ఉపాధ్యాయుడిగా మురళీశర్మ కనిపించారు. 'వాడికి పెళ్లి చేస్తే అంతా మంచి జరుగుతుందన్నావ్. మన సార్‌ను 60 మంది అమ్మాయిలు రిజెక్ట్ చేశారు' అంటూ నవ్వులు పూయించారు. జాబ్ పర్మినెంట్ కావడం కోసం ఓ గ్రామానికెళ్లిన హీరో.. అక్కడ ఎదురైన సమస్యల నుంచి ఎలా బయటపడ్డాడన్న కథాంశంతో ఈ సిరీస్ రూపొందుతోంది. బ్రహ్మానందం, సంపూర్ణేశ్‌బాబు కీలక కీలక పాత్రలు పోషించారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.